యయాతి చరిత్ర

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ దివాకర్ల వేంకటావధాని

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2019

YAYATHI CHARITRA
with Commentary

Commentary by
Dr. Diwakarla Venkatavadhani

T.T.D. Religious Publications Series No.1368
© All Rights Reserved

First Print : 2019

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **“మహాభారతం”** అయ్యింది.

“యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్”

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు –అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధపరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలవ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **యయాతి చరిత్ర.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక

గయా, ఒంబరీషౌ, శశిబిం, ద్వనంగౌ,
పృథు, ర్మరుత్వాన్, భరత, స్సుహోత్రః ।
రామౌ, దిలీపో, నృగు, రంతిదేవౌ,
యయాతి, మాంధాతృ, భగీరథాశ్చ॥

గయుడు, అంబరీషుడు, శశిబిందువు, అనంగుడు, పృథువు, మరుత్తు, భరతుడు, సుహోత్రుడు, పరశురాముడు, శ్రీరాముడు, దిలీపుడు, నృగుడు, రంతిదేవుడు, యయాతి, మాంధాత, భగీరథుడు – ఈ పదునాఱుగురు పుడమిఱేడులు ప్రాచీన పౌరాణిక వాఙ్మయంలో "షోడశ మహారాజులు" – అనే ప్రసిద్ధమైన నామధేయంతో పేర్కొనబడివున్నారు.

ప్రాతస్స్మరణీయులయిన పై రాజన్యులలో చంద్రవంశీయుడైన యయాతి నరపతి ప్రముఖుడుగా పరిగణింపబడి రాజర్షిశ్రేష్ఠుడు.

పాండవుల మునిమనుడైన జనమేజయుడు సర్పయాగాన్ని సమాప్తి గావించిన అనంతరం ఒకనాడు వ్యాస భగవానుణ్ణి మహాభారతకథను ఆద్యంతం తనకు వివరించవలసినదని, పరమభక్తితో ప్రార్థించాడు. వేదవ్యాస మహర్షి వాత్సల్యంతో అంగీకరించి, తన శిష్యుడైన వైశంపాయనుణ్ణి అందుకు నియమించి, వెళ్లినాడు.

వైశంపాయనుడు గురువర్యుని ఆనతిని శిరసావహించి, మహాభారతాఖ్యానాన్ని అందలి వైశిష్ట్యాన్ని జనమేజయునకు ఆహ్లాదకరంగా విశదీకరింపసాగాడు.

చంద్రునినుండి అవతరించిన కౌరవవంశ క్రమాన్ని, అందలి తొలుతటి మహీపతులను సంగ్రహంగా పేర్కొంటూ, ఆ వరుసలో మిగుల ప్రసిద్ధుడయిన యయాతి మహారాజుయొక్క చరిత్రను – జనమేజయుని కోరిక మేరకు వైశంపాయన మునీంద్రుడు విపులంగా అభివర్ణించాడు.

చంద్రుని నుండి ఆరవ వంశపురుషుడు యయాతి.

చంద్రుడు, బుధుడు, పురూరవుడు, ఆయువు, నహుషుడు, యయాతి; ఇది వారి వంశక్రమము. నహుషుని పత్ని ప్రియంవద. ప్రియంవదా నహుషుల ఆరుగురు కుమారులలో ద్వితీయుడు, పరాక్రమంలో అద్వితీయుడు యయాతి.

'వర్ణ ధర్మముల్ గాచుచు, వసుధయెల్ల ననఘచరితుడై యేలిన' వాడని, 'విపుల తేజంబునను, తపోవీర్యమునను జగదనుగ్రహ నిగ్రహ శక్తియుక్తు'డని, 'మఱియు నస్మద్వంశకరుం'డని జనమేజయునిచే అత్యంత గౌరవాసక్తులతో కొనియాడబడిన ధన్యచరితుడు యయాతి!

యయాతి సార్థక నామధేయుడు. "యథా వాయోరివ యాతి సర్వత్ర రథగతి రస్య" – అని ఆయన నామానికి మేదినీ నిఘంటువులో వ్యుత్పత్తి చెప్పబడింది. అనగా, ఆ మహారాజు అధిరోహించిన రథం అంతటా వాయువేగంతో వెళ్లుతుంటుంది – అని అభిప్రాయం. స్వర్గాధిపతియైన దేవేంద్రుడు ఆతని ప్రశస్తిని గూర్చి విని, ఆనందించాడు. ఆయన నామధేయానికి అనుగుణంగా అమిత వేగవంతములయిన దివ్యాశ్వాలను పూన్చిన బంగారు రథాన్ని బహూకరించి, 'యయాతి' నామసార్థకతను ఇనుమడింపజేశాడు!

యయాతి తండ్రి అనంతరం సింహాసనాన్ని అధిష్ఠించి, సామ్రాజ్యాన్ని నలువైపుల విస్తరింపజేసి, తన నలువురు సోదరులను ఆ యా ప్రదేశాలలో ప్రతినిధులనుగా నెలకొల్పినాడు; సకల ప్రజారంజకుడైన పరిపాలకుడుగా ప్రశస్తిగాంచినాడు.

యయాతి ఒకనాడు వేటకొరకు అరణ్యానికి వెళ్లాడు. వేటాడి, యాడి బాగా అలసిపోయాడు. దప్పిగొని, అడవిలో అటునిటు అన్వేషిస్తూ, ఒక నూతివద్దకు చేరుకున్నాడు. ఆ బావిలో ఒక తీగను అవలంబించి, దిక్కుతోచక భీతితో దుఃఖిస్తూవున్న యువతి నొకతెను చూచాడు. 'తాను శుక్రాచార్యుని కూతుర'నినీ, 'పేరు దేవయాని' యనీ, 'ప్రమాదవశాత్తు ఇందులో పడిన నన్ను ఉద్ధరించి, రక్షించవలసిన'దనీ ఆమె సంప్రార్థించింది. యయాతి వెంటనే తన దక్షిణ బాహువును చాచి, దేవయానియొక్క కుడిచేతిని పట్టుకొని పైకి లాగి, నూతినుండి వెలువడజేసినాడు.

ఈ సన్నివేశం ఆదికవి లేఖినినుండి ఈ క్రింది 'చంపకమాల' జాలువాఱింది–

చ. జలధివిలోలవీచివిలసత్కలకాంచిసమంచితావనీ
తల వహనక్షమంబయిన దక్షిణ హస్తమునం దదున్నమ
ద్గళదురు ఘర్మవారికణ కమ్రకరాబ్జము వట్టి, నూతిలో
వెలువడఁ గోమలిం దిగిచె విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్.

– ఆదిపర్వము, 3వ ఆశ్వా, 144ప.

ఇదే సన్నివేశం పోతనామాత్యుని ఆంధ్రమహాభాగవతంలో నెలకొని వుండటం ఈ సందర్భంలో ఎన్నదగివున్న సరస సారస్వతాంశం! పోతనార్యుడు నవమ స్కంధంలో రచించిన పై సన్నివేశ వర్ణన ఈ క్రింది 'శార్దూలవిక్రీడితం' గా రూపొందింది! –

శా. సప్తాంభోనిధిమేఖలావృత మహాసర్వంసహా కన్యకా
ప్రాప్తోద్యద్వర దక్ష దక్షిణకర ప్రాలంబముం జేసి ప్రో
క్షిప్తం జేసె యయాతి కట్టుకొనఁ బైచేలంబు మున్నిచ్చి, ప
ర్యాప్తస్వేదజలాంగి నాళిసముదాయ స్వర్గవిన్ భార్గవిన్.

– 9వ స్కంధము, 528 ప.

ఈ విధంగా, ఒకే సన్నివేశాన్నిగురించి ఇరువురు ప్రాచీనాంధ్ర మహాకవులు ఆవిష్కరించిన పై పద్యాల్లోని భావసౌందర్యాన్ని తులనాత్మకంగా పరిశీలించి, ఆస్వాదించే అవకాశం ఇందులో జతపడివుండటం ఒక విశేషం!

ఉదాత్తమైన పై చర్య యయాతి మహారాజుయొక్క దయాగుణానికీ, దీనజన సంరక్షణ తత్పరతకూ ఉత్తమ నిదర్శనం!

అయితే, యయాతియొక్క ఈ ఉపకారం అనంతరకాలంలో ఆ మహారాజు దేవయానిని పరిణయమయ్యే విధంగా పర్యవసించింది.

చచ్చి, బ్రతికి, శుక్రునివద్ద చదువు (మృత సంజీవినీవిద్యను) సాధించిన కచుడు అమరావతికి వెళ్లిపోతూ, మునుపు దేవయానికి ఇచ్చివుండిన ప్రతిశాపం – 'నీవు ధర్మవిరోధంబు దలంచితివిగావున, నిన్ను బ్రాహ్మణుండు

వివాహంబుగాకుండెడుగాక!' – అనేది అందుకు బలీయమైన పరోక్ష కారణంగా పనిచేసింది!

ఒకనాడు దేవయాని తనకు దాసియైన శర్మిష్ఠతో, ఆమె చెలికత్తెల పరివారంతో వనంలో విహరిస్తూ, ఒక సెలయేటి తీరాన వినోదిస్తూ, చల్లని చెట్లనీడల్లో విశ్రాంతిగా ఉండగా, యయాతి వేటలో అలసిపోయి, గాలి వాటాన అక్కడకు చేరుకొన్నాడు. తాను రక్షించియుండిన దేవయానిని గుర్తుపట్టి, ఆమెద్వారా వాళ్లందరి వివరాలను తెలిసికొనినాడు. అపుడు దేవయాని తనను వివాహమాడవలసినదిగా యయాతిని అభ్యర్థించింది. ఆ సందర్భంలో వాళ్లిద్దరికి ఈ రీతిగా సంభాషణ సాగింది.

యయాతి : **క్షత్రియ కన్యకల బ్రాహ్మణులు వివాహంబగుదురు గాక; అధర్మోత్తరంబుగా క్షత్రియులు బ్రాహ్మణకన్యకల వివాహంబగుదురే? నీ పలుకులు ధర్మవిరుద్ధంబులు. మఱియు సర్వ వర్ణాశ్రమ ధర్మంబులు సంకరంబులుగాకుండ రక్షించుచున్న యేన యిట్టి యధర్మంబున కొడంబడితినేని, జగత్ ప్రవృత్తి విపరీతంబగు.**

దేవయాని : **వెలయఁగ ధర్మాధర్మంబులు నడపుచు, నిఖిలలోక పూజ్యుండై నిర్మలుఁడగు శుక్రుఁడు పంచిన, నలఘుభుజా! నను వివాహమగుదే?**

యయాతి : **అమ్మహాముని వచ్చి, యిది ధర్మవిరుద్ధంబుగాదని చెప్పెనేని నిన్ను వివాహంబగుదును.**

ఆ మాటకు సంతసించిన దేవయాని తత్క్షణమే శుక్రుణ్ణి అక్కడికి రప్పించింది. యయాతి వెంటనే లేచి నిలిచి, అధికమైన భక్తితో శిరస్సు వంచి శుక్రాచార్యునకు నమస్కరించాడు. అప్పుడు దేవయాని తండ్రితో ఇలా విన్నవించింది –

దేవయాని : **పరమమూర్తీ! ఇన్నరేంద్రుచేత మున్న గృహీతమై యున్న నా కరంబు గ్రన్నన ఇంక నొరున కర్హమగునె? కావున నాకు నీ జన్మంబున**

పతి యయాతియ. ఇతండును భవద్వచనంబున నన్ను వివాహంబగుదు ననియె; నిందు ధర్మవిరోధంబు లేకుండునట్లుగాఁ ప్రసాదింపవలయును.

అనిన శుక్రుండు కరుణించి, దేవయానితో నిట్లనెను –

శుక్రుడు : **యయాతికి, నీకును నయిన యీ వివాహంబునం దపక్రమదోషంబు లేకుండెడుఁగాక!**

అని యిట్లు వరంబిచ్చి, యయ్యిరువురకు పరమోత్సవంబున వివాహంబుచేసి, శర్మిష్ఠం జూపి యయాతితో నిట్లనెను –

శుక్రుడు : **ఇది వృషపర్వుని కూతురు; దీనికిఁ బ్రియంబున నన్నపాన,భూష, ణాచ్ఛాదన, మాల్యానులేపనాదుల సంతోషంబు సేయునది; శయనవిషయంబునఁ బరిహరించునది.**

అని పంచి, కూతు నల్లునిం బూజించిన, నయ్యయాతియు శుక్రుని వీడ్కొని, దేవయానిని, శర్మిష్ఠను, కన్యకా సహస్రంబును తోడ్కొని నిజపురంబునకుఁజని, యంతఃపుర రమ్యహర్మ్యతలంబున దేవయాని నునిచి, తదనుమతంబున అశోకవనికాసమీపంబున నొక్క గృహమునందు కన్యకాసహస్రంబుతో శర్మిష్ఠ నునిచి, దేవయానియందు సుఖోపభోగపరుండై యుండెను. క్రమంగా ఈ దంపతులకు యదువు, తుర్వసుడు అనే కుమారులు కలిగారు.

యయాతి ఒకనాడు విహారాసక్తుడై అశోకవనానికి విచ్చేశాడు. ఆ మహారాజు కదుప్రసన్నుడై ఒంటరిగా వున్న ఆ అదనును గుర్తించి, శర్మిష్ఠ మిగుల వినయంతో కరములు మోడ్చి, ఆయనకు తనయాకాంక్షను వెల్లడించింది.

వారిద్దరి సంభాషణ ఇలా సాగింది –

శర్మిష్ఠ : **నరేశ్వర! నన్నేలిన దేవయానికి భర్తవుగాన, నాకునుం బోలఁగ భర్తవీవ! ఇది ధర్మపథంబు! నిక్కువంబు; ఆలును, దాసియున్, సుతుఁడు నన్నవి పాయని ధర్మములు**

అద్దేవయానిం బరిగ్రహించినప్పుడ తద్ధనంబగుట నేనును భవత్పరిగ్రహంబ కావున నన్నుం గరుణించి, నాకు ఋతు కాలోచితంబుఁ బ్రసాదింపవలయును.

యయాతి : **లలితాంగీ! 'శయన మొక్కటి వెలిగా, రుచిరాన్నపాన వివిధాభర-ణాదుల శర్మిష్ఠకు నిష్టము సొలయకచేయు' మని నన్ను శుక్రుఁ డు పంచెను.**

ఏ నమ్మహాముని వచనంబున కప్పు దొడంబడితిని. ఎట్లు బొంకనేర్తును?

శర్మిష్ఠ : ప్రాణాత్యయమున, సర్వధనాపహరణమున, వధ గావచ్చిన విప్రార్థమున, వధూజన సంగమమున, వివాహసమయము లందును బొంకఁగఁజనును.

ఈ యేనింటియందు నసత్య దోషంబు లేదని మునివచన ప్రమాణంబు గలదు; నీవు వివాహసమయంబున నొడంబతితివి కావున నసత్య దోషంబునం బొందవు.

అని నయ్యయాతి యొడంబడి, శర్మిష్ఠ నభిమతం బొనరించె. శర్మిష్ఠయు నయ్యయాతివలనఁ గ్రమంబున ద్రు, హ్యును, పూరులనగా ముప్పురు కొడుకులం బడసెను.

యయాతి తనకు తెలియకుండా శర్మిష్ఠ వలన సంతానాన్ని పొందిన వైనాన్ని దేవయాని (శర్మిష్ఠ) యొక్క పుత్రులవల్ల తెలిసికొన్నది. చింతిస్తూ వెంటనే శుక్రునివద్దకు వెళ్లి, యయాతి తనకు అవమానం చేశాడని విన్నవించింది. 'యౌవనగర్వంతో రాగాంధుడనై, నాకూతునకు అప్రియం కావించావు గనుక, జరాభారపీడితుడవు క' మ్మని శుక్రుడు యయాతికి శాపమిచ్చాడు.

'ఋతుమతియైన భార్య పుత్రులకొరకై కోరినందువలన శర్మిష్ఠకు సంతానాన్ని అనుగ్రహించా'నని యయాతి తన చర్యను ధర్మబద్ధంగా సమర్థించుకొంటూ, 'ఏ

నిద్దేవయానియందు విషయోపభోగతృప్తుండను గాను, జరాభరంబును దాల్పనోపను' అని ప్రార్థించాడు.

అతని ప్రార్థనను విని శుక్రుడు యయాతిని కరుణించాడు. తన శాపానికి పరిహారోపాయాన్ని ఇలా ప్రసాదించాడు –

శుక్రుడు : **నీముదిమి నీకొడుకులయం దొక్కరునిపయింబెట్టి, వాని జవ్వనంబు నీవు గొని, రాజ్య సుఖంబు లనుభవింపుము. నీవు గొని, రాజ్య సుఖంబు లనుభవింపుము. నీవు విషయోప భోగతృప్తుండవైన, మఱి నీముదిమి నీవ తాల్చి, వాని జవ్వనంబు వానికి నిచ్చునది! నీ ముదిమిఁ దాల్చిన పుత్త్రుండ రాజ్యంబున కర్హుండును, వంశకర్తయు నగును.**

శుక్రాచార్యుడు పలికిన పై శాప పరిహార వచనం యయాతి చరిత్ర కంతటికీ కీలకమైనది. మకుటాయమానమైనది! తదనుగుణంగా, యయాతికి శర్మిష్ఠయందు జన్మించిన కుమారులలో చివరి వాడైన పూరుడు తండ్రిమాటను శిరసావహించాడు; తదనంతర కాలంలో సామ్రాజ్యానికి వారసుడు కాగలిగాడు!

కౌరవ, పాండవుల వంశకర్తలలో పూరుడు ప్రముఖుడై విలసిల్లిన గాథను విశదీకరించటానికే వైశంపాయన మునీంద్రుడు యయాతి చరిత్రను జనమేయ మహీజానికి ఇంత విపులంగా వివరించినాడు!

పూరుని యౌవనాన్ని స్వీకరించిన యయాతి దేవయానితోపాటు వెయ్యేండ్లు అభిమత సుఖాలను అనుభవించాడు. అనంతరం కుమారుని యౌవనదశను అతనికి పునఃప్రసాదించి, తన జరాభారాన్ని తాను ధరించినాడు. శుక్రుని వచనానుసారం, తన అభీష్టానికి అనుగుణంగా పూరుణ్ణి సమస్త సామ్రాజ్యానికి పట్టాభిషిక్తుణ్ణి కావించాడు. అడవుల కేగి, సహస్ర వర్షములు కఠోరమైన తపస్సు ఆచరించాడు. పిమ్మట దివ్య విమానారూఢుడై దేవలోకానికి వెళ్లి, పూజలందుకొని, అటనుండి బ్రహ్మలోకం చేరుకొన్నాడు. అచ్చట అనేక కల్పాల పర్యంతం ఉండి, మరల దేవలోకానికి విచ్చేసినాడు.

యయాతి దేవేంద్రునితో సంభాషిస్తూ ఒక సందర్భంలో తన తీవ్ర తపస్సు మహర్షుల తపములకంటె గొప్పదిగా పొగడుకొనటం కారణంగా, సురపతియొక్క కోపానికి గురి అయ్యాడు! అందువల్ల అక్కడినుండి చ్యుతుడై, నక్షత్రలోకం చేరినాడు. అచ్చటి అష్టకుడు, ప్రతర్దనుడు, వసుమంతుడు, శిబి – అను వారలు ఆతని తేజస్సును గుర్తించి యయాతిని సముచిత రీతిని సన్మానించారు. అనంతరం వారు తన దౌహిత్రులని తెలిసికొని, వారిచ్చిన పుణ్యలోకాల సహాయంతో యయాతి ఆ నలువురితోపాటు మళ్లీ స్వర్గలోకానికి పయనించాడు. ఈ రీతిగా యయాతి మహారాజుయొక్క ఉదాత్త చరిత్ర "కందుకమువోలె సుజనుడు క్రిందంబడి, మగుడ మీదికిన్ ఎగయుఁ జుమీ!" – అనే సూక్తికి అక్షరోదాహరణంగా అలరారుతూవుంది.

ఎంతటివారైనా ప్రారబ్ధకర్మఫలితాన్ని అనుభవింపక తీరదన్న యథార్థం యయాతి మహారాజంతటి వాని విషయంలోనూ నిరూపితమయ్యింది! ప్రారబ్ధకర్మఫలితాన్నే మనవాళ్లు సంక్షిప్తంగా 'ప్రారబ్ధ'మని కూడా వ్యవహరిస్తూ వుంటారు. ఈ ప్రారబ్ధమనేది ప్రధానంగా 1) స్వేచ్ఛాప్రారబ్ధము 2) పరేచ్ఛా ప్రారబ్ధము – అని రెండు రకాలు. 'స్వేచ్ఛాప్రారబ్ధ'మంటే ఇతరులు చేసిన ప్రారబ్ధ కర్మల ఫలితాన్ని వ్యక్తి తాను అనుభవించవలసిరావటం!

యయాతి చరిత్రను పరిశీలిస్తే రెండవ రకపు ప్రారబ్ధమే – అనగా దేవయానివలన తనకు సంప్రాప్తించిన పరేచ్ఛాప్రారబ్ధముయొక్క ఫలితమే ఆ మహారాజుయొక్క ఐహిక జీవితంలో అధికభాగం విస్తరించింది అనే సత్యం వెల్లడౌతున్నది! అదిగాక, ఆ నరపతి స్వయంగా ఆచరించిన ఉత్తమ ప్రారబ్ధమంతా ప్రజారంజకమైన పరిపాలనతో, పెక్కు యజ్ఞ, యాగాదుల నిర్వహణలతో, అనేక దాన, ధర్మాలతో అత్యుత్తమంగా కొనసాగింది!

మొత్తంమీద, సకల ధర్మవిదుడూ, సర్వలోకవర్తనము లెఱిగిన పుణ్యుడూ అయిన యయాతి మహీపతి చరిత్ర ప్రసన్నతా గుణమహితమై, సూక్తిసుందరమై, అక్షర రమ్యమై, మహాభారత ఇతిహాసమనే మహారాజ భవనానికి సమున్నత సింహద్వారంగా విలసిల్లుతూవుంది!

– కె..జె.కృష్ణమూర్తి

యయాతి చరిత్ర

యయాతి మహారాజు చరిత్రము (సం.1-71-3)

తే. **వర్ణధర్మముల్ గాచుచు వసుధ యెల్ల।**
ననఘ చరితుఁ డై యేలిన యయ్యయాతి
భూసురోత్తమ! భార్గవపుత్త్రి యైన।
దేవయానిని దా నెట్లు దేవిఁ జేసె? **1**

ప్రతిపదార్థం: వర్ణ ధర్మముల్= కులం మొదలైన వాటి ధర్మాలను; కాచుచున్= కాపాడుతూ; వసుధ, ఎల్లన్= భూమినంతనూ; అనఘ చరితుఁడు+ఐ= పుణ్యవర్తను డై; ఏలిన= పాలించిన; ఆ+యయాతి= ఆ యయాతిమహారాజు; భూసురోత్తమ!= ఓ వైశంపాయన మహర్షీ! (ఓ బ్రాహ్మణోత్తమా!); బ్రాహ్మణు లందు ఉత్తముడా!; భార్గవపుత్త్రి+ఐన= శుక్రుడికూతు రైన; దేవయానిని= దేవయాని అనే ఆమెను; తాను; ఎట్లు; దేవిన్= భార్యగా; చేసెన్= చేశాడు?

తాత్పర్యం: వర్ణాశ్రమధర్మాలను సంరక్షిస్తూ పుణ్యవర్తను డై భూమండలాన్ని ఏలిన ఆ యయాతిమహారాజు బ్రాహ్మణోత్తము డైన శుక్రుడికూతురును-దేవయానిని భార్యగా ఎట్లా చేసికొన్నాడో ఓ వైశంపాయనమహర్షీ! తెలుప వలసింది.

విశేషం: వర్ణాశ్రమధర్మాలను రక్షించిన యయాతి విలోమవివాహాన్ని ఎట్లా చేసికొన్నా డని ధర్మసందేహం.

తే. **విపులతేజంబునను దపోవీర్యమునను।**
జగదనుగ్రహనిగ్రహశక్తియుక్తుఁ
డయినయట్టి యయాతికి నలిగి యేమి।
కారణంబున శాపంబు కావ్యుఁడిచ్చె? **2**

ప్రతిపదార్థం: విపుల, తేజంబునను= విస్తార మైన తేజస్సుచేతను, తపస్+వీర్యమునను= తపస్సుయొక్క ప్రభావంచేతనున్నూ; జగత్+అనుగ్రహ, నిగ్రహశక్తియుక్తుఁడు= లోకాన్ని అనుగ్రహించటంలోనూ, నిరోధించటంలోనూ శక్తితో కూడిన వాడు, అయిన, అట్టి, యయాతికిన్; అలిగి= కోపించి, కావ్యుఁడు= శుక్రుడు; ఏమి, కారణంబునన్, శాపంబు+ఇచ్చెన్= ఏ కారణంవలన శపించాడు?

తాత్పర్యం: విస్తారమైన తేజస్సుచేతనూ, తపఃప్రభావంచేతనూ లోకాలను అనుగ్రహిం చేందుకు, నిగ్రహించేందుకు సమర్థుడైనట్టి యయాతిమహారాజును కోపించి శుక్రు డేకారణాన అతడిని శపించాడు?

వ. మఱియు నస్మద్వంశకరుం డయిన యయాతిచరితంబు విన వలతుం జెప్పు మని యడిగిన వానికి వైశంపాయనుం డి ట్లనియె. 3

ప్రతిపదార్థం: వినవలతున్= వినగోరెదను.

తాత్పర్యం: అంతేకాక, మావంశాన్ని వృద్ధి చేసిన ఆ యయాతియొక్క వృత్తాంతాన్ని నేను వినగోరుతాను చెప్పు మని అడుగగా జనమేజయుడికి వైశంపాయనుడు ఈవిధంగా అన్నాడు.

క. మనుజాధిప! వృషపర్వుం।
డను దానవపతికి శుక్రుఁ డా చార్యుం డై
యనిమిషవిరోధులకుఁబ్రియ।
మొనరించుచు వివిధ విధినయోపాయ ములన్. 4

ప్రతిపదార్థం: మనుజ+అధిప!= ఓరాజా! (జనమేజయా); దానవపతికిన్= రాక్షసరాజుకు; శుక్రుఁడు; ఆచార్యుండు+ఐ= గురువై; అనిమిష విరోధులకున్= దేవతలకు శత్రువులు ఐన రాక్షసులకు; వివిధవిధి, నయ+ఉపాయములన్= వేర్వేరు ఏర్పాట్లచే నీతులతో, ఉపాయాలతో; ప్రియము+ఒనరించుచున్= సంతోషాన్ని కలిగిస్తూ.

తాత్పర్యం: ఓ రాజా! వృషపర్వు డనే రాక్షసరాజుకు శుక్రుడు ఆచార్యు డై పెక్కువిధాల ఏర్పాట్లతో, నీతులతో, ఉపాయాలతో రాక్షసులకు సంతోషాన్ని కలిగిస్తూ. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. దేవాసుర రణమున గత।
జీవితు లగు నసురవరులఁ జెచ్చెర మృతసం
జీవని యను విద్యఁ బున।
ర్జీవులఁగాఁ బ్రతిదినంబుఁ జేయుచు నుండెన్. 5

ప్రతిపదార్థం: దేవ+అసుర, రణమునన్= దేవదానవుల యుద్ధమందు; గత, జీవితులు+అగు= మరణించినవారైన; అసుర, వరులన్= రాక్షసశ్రేష్ఠులను; చెచ్చెరన్= శీఘ్రంగా; మృతసంజీవని యను విద్యన్= మృతసంజీవని అనే పేరు కలిగిన చనిపోయిన వారిని తిరిగిబ్రతికించే విద్యతో; ప్రతి, దినంబున్; పునః+జీవులన్+కాన్= మరల (తిరిగి) బ్రతికినవా రయ్యేటట్లుగా; చేయుచున్+ఉండెన్= చేస్తూ ఉండేవాడు.

తాత్పర్యం: దేవ దానవ యుద్ధంలో మృతు లైన రాక్షసులను శీఘ్రంగా మృతసంజీవని అనే విద్యచేత వారిని ప్రతిదినం పునర్జీవితులను చేస్తున్నాడు.

వ. దాని నెఱింగి దేవతలెల్ల నతి భీతు లై యసురుల నోర్వ నోపక శుక్రు వలన మృతసంజీవని వడసి తేనోపునట్టి మహాసత్త్వుం డెవ్వం డగునో యని విచారించి బృహస్పతిపుత్త్రుండయిన కచునికడకుం జని యిట్లనిరి. 6

ప్రతిపదార్థం: అతిభీతులు+ఐ= మిక్కిలి భయపడినవారై; అసురులన్= రాక్షసులను; ఓర్వన్+ఓపక= గెలువ జాలక; పడసి= పొంది; తేన్+ఓపునట్టి= తీసుకురాజాలిన; మహాసత్త్వుండు= గొప్పబలవంతుడు; కచునికడకున్= కచుని చెంతకు.

తాత్పర్యం: ఆ విషయం తెలిసికొని దేవతలు భయపడి, రాక్షసులను జయించలేక, శుక్రునివద్దనుండి మృతసంజీవనీ విద్యను పొంది తిరిగి రాగల

గొప్పసమర్థు డెవ్వడో అని విచారించి, బృహస్పతికుమారు డైన కచుడివద్దకు వెళ్ళి ఇట్లా అన్నారు.

క. పోరను మృతసంజీవని ।
కారణమున నిహతు లయ్యుఁ గా రసురవరుల్
వారల నోర్వఁగ మన కతి ।
భారము దుర్వారవీర్యబలయుతు లగుటన్. 7

ప్రతిపదార్థం: పోరను= యుద్ధమందు; మృతసంజీవని, కారణమునన్; నిహతులు+ అయ్యున్= చచ్చినవారయ్యూ; కారు= చావరు; అసురవరుల్= రాక్షస శ్రేష్ఠులు; దుర్వార వీర్యబలయుతులు= నివారించేందుకు శక్యం కాని వీరత్వంతో బలంతో కూడినవారు; అగుటన్= కావటంచేత; ఓర్వఁగన్= జయించటానికి; మనకున్; అతి, భారము= మిక్కిలి బరువు (శక్యం కానిది, మోయలేనిది అని భావం).

తాత్పర్యం: యుద్ధంలో రాక్షసులు చనిపోయినా మృతసంజీవనికారణాన చావకుండా ఉన్నారు. వారు అపార వీర్యబలవంతులు కావటంచేత వారిని జయించటం మనకు అసాధ్య మై ఉన్నది.

క. మనపక్షంబున వా ర ।
ద్దనుజులచే నిహతు లయ్యుఁ దగ మృతసంజీ
వని లేమిఁ జేసి యమసా ।
దనమున కరుగుదురు వీర్యదర్పితు లయ్యున్. 8

ప్రతిపదార్థం: మన పక్షంబునవారు= మనవైపు ఉన్నవారు; (దేవతలు); ఆ+దనుజులచేన్= ఆ రాక్షసులచేత, నిహతులు= చంపబడినవారు; అయ్యున్= అయినప్పటికి; తగన్= ఒప్పారగా; మృతసంజీవని, లేమిన్+చేసి= చనిపోయినవారిని బ్రతికించే మృతసంజీవనీ విద్య లేకపోవటం కారణంగా;

యమసాదనమునకున్= యముడి గృహానికి (నరకానికి లేదా మృత్యువు దగ్గరకు అని భావం); వీర్యదర్పితులు= పరాక్రమం చేత గర్వించిన వారు; అయ్యున్= అయినప్పటికీ; అరుగుదురు= వెడతారు (చనిపోతారు).

తాత్పర్యం: మహాబలగర్వితు లైనా మనపక్షంలోనివారు రాక్షసులచేత చంపబడిన మనకు మృతసంజీవని లేనందువల్ల యముడి నివాసానికే పోతున్నారు.

విశేషం: సదనము (రూ) సాదనము.

క. కావున మృతసంజీవనిఁ ।
దేవలయును శుక్రువలన ధృతిఁ బడసి తప
శ్శ్రీవిభవ! దాని బలమునఁ ।
గావంగావలయు సురనికాయబలంబున్. 9

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; మృతసంజీవనిన్; శుక్రువలనన్= శుక్రునివద్ద నుండి; ధృతిన్+పడసి= ధైర్యంతో పొంది; తేవలయున్= తీసికొని రావలెను, తపస్+శ్రీ విభవ!= తపస్సుయొక్క శోభావిభవం కలవాడా!; ఓకచుడా! సుర, నికాయబలంబున్= దేవతల సమూహం యొక్క బలాన్ని; దాని బలమునన్= ఆమృత సంజీవనియొక్క శక్తిచేత; కావంగాన్, వలయున్= రక్షించవలెను;

తాత్పర్యం: కాబట్టి శుక్రుడినుండి మృతసంజీవనీవిద్యను పొంది తీసికొని రావాలి. ఓతపోధనా! ఆ సంజీవనీ విద్యాబలంతో దేవగణాలబలాన్ని కాపాడాలి.

క. బాలుండవు, నియమవ్రత ।
శీలుండవు, నిన్నుఁ బ్రీతిఁ జేకొని, తద్వి
ద్యాలలనాదానముఁ గరు ।
ణాలయుఁ డై చేయు నమ్మహాముని నీకున్. 10

ప్రతిపదార్థం: బాలుండవు= నీవు గ్రహణధారణ శక్తులు గల చిన్నవాడవు; నియమవ్రత, శీలుండవు= నియమాలు, ఉపాసనాది పుణ్యకర్మలు చేయటం

స్వభావంగా కలవాడవు; నిన్నున్; ప్రీతిన్= ఆదరంగా; చేకొని= దరిచేర్చి; తద్= ఆ మృత సంజీవని అనబడే; విద్యాలలనా, దానమున్= విద్య అనే కన్యాదానాన్ని; కరుణా+ఆలయుఁడు+ఐ= దయకు నివాస స్థాన మైన వాడై; ఆ+మహత్+ముని= ఆ గొప్పవా డైన శుక్రమహర్షి, నీకున్; చేయున్= చేస్తాడు.

తాత్పర్యం: నీవు బాలుడివి. నియమాలు, వ్రతాలు నీకు స్వభావసిద్ధ మైనవి. శుక్రాచార్యుడు నిన్ను శిష్యుడిగా స్వీకరించి, సంతోషంతో నీ కా విద్యాకన్యను దయతో ఇవ్వగలడు.

విశేషం: విద్యాలలనాదానము - అనే రూపక సమాసం భావికథార్థ వ్యంజకం. ముందు కథలో దేవయాని తనమనసును కచుడికి అర్పించుకొనే కథార్థం ఇందులో ధ్వని. విద్యయనే, లలనను - అనీ, విద్యను, లలనను అనీ సమన్వయింపవచ్చును.

వ. ‘దుహితృస్నేహంబునం జేసి యద్దేవయాని పలుకులు శుక్రుం డతిక్రమిం పండు గావున నీనేర్చువిధంబున దాని చిత్తంబు వడసి శుక్రు నారాధించిన నీ కిష్టసిద్ధి యగు’ నని దేవతలు ప్రార్థించి పంచినం, గచుండును దేవ హితార్థంబు వృషపర్వుపురంబునకుం జని యచ్చట వేదాధ్యయనశీలుం డయి సకలదైత్యదానవ గణోపాధ్యాయుం డయి యున్న శుక్రుం గని నమస్కరించి యి ట్లనియె. 11

ప్రతిపదార్థం: దుహితృస్నేహంబునన్+చేసి= కూతురునందలి ప్రేమచేత; అతిక్రమిం పండు= జవదాటడు; దేవహిత+అర్థంబు= దేవతలమేలు కొరకు; సకలదైత్యదానవ గణ+ఉపాధ్యాయుండు= సమస్తదైత్యుల, దానవుల సమూహమునకు గురువు.

తాత్పర్యం: ‘కూతురుపై నున్న ప్రేమచేత దేవయానిమాటలను శుక్రుడు జవదాటడు. కాబట్టి నీ సామర్థ్యంతో ఆమె మనసును లోబరచుకొని, శుక్రుడికి

శుశ్రూష చేస్తే, నీకు కార్యసిద్ధి కలుగుతుంది’ అని దేవతలు వేడుకొని పంపగా కచుడు దేవతలమేలుకొరకై వృషపర్వుడిపట్టణానికి వెళ్ళి అక్కడ నిరంతరవేదాధ్యయనపరుడున్నూ, దైత్య దానవగణానికి గురువున్నూ అయినట్టి శుక్రాచార్యుడిని చూచి నమస్కరించి ఇట్లా పలికాడు.

విశేషం: దేవతలు కచుడికి మృతసంజీవనిని సాధించే మెలకువ ఒకటి చెప్పారు. మంత్రవిద్య శుక్రాచార్యాధీనం; శుక్రుడు ఆతని కుమార్తె అయిన దేవయానిపట్ల ఉన్న స్నేహానికి అధీనుడు. దేవయానిని ప్రసన్నం చేసికొంటే, శుక్రుడు, ఆ తరువాత అతని విద్య అనుకూలిస్తాయి అని చెప్పారు దేవతలు. భావికథాగతిని ఈ వాక్యం ప్రసన్నం చేస్తున్నది. కథలో దేవయానిపాత్రకు కల ప్రాధాన్యానికి ప్రాతిపదిక వేశాడు నన్నయ ఇక్కడ. ప్రసన్న కథాకలితార్థయుక్తికి చక్కని ఉదాహరణం.

క. ఏను గచుం డనువాఁడ, మ ।
హానియమసమన్వితుఁడ, బృహస్పతిసుతుఁడన్,
మానుగ వచ్చితి నీకును ।
భానునిభా! శిష్యవృత్తిఁ బని సేయంగన్. 12

ప్రతిపదార్థం: భానునిభా= సూర్యసన్నిభుడ వైన ఓ మహర్షీ!; ఏను= నేను; మహానియమ, సమన్వితుఁడన్= గొప్ప నియమాలతో కూడినవాడిని; బృహస్పతి, సుతుఁడన్= దేవగురు వైన బృహస్పతికి కుమారుడిని; కచుండు+అను, వాఁడన్= కచుడనే పేరు కలవాడిని; శిష్యవృత్తిన్= శిష్యప్రవర్తనతో; నీకును= నీకు; పని+ చేయంగన్= సేవచేయటానికి; మానుగన్= ఒప్పిదంగా; వచ్చితిన్= వచ్చాను.

తాత్పర్యం: సూర్యసన్నిభుడ వైన ఓమహర్షీ! నేను కచు డనేవాడిని. బృహస్పతికుమారుడిని. మీకు శుశ్రూష చేసి సేవించటానికి వచ్చాను.

విశేషం: విద్యయందు ఆసక్తి, గురువునందు భక్తి, నియమనిష్ఠలయందు ప్రసక్తి కల శిష్యుడే గురువుల ఆదరగౌరవాలను పొందగలడని కచునివర్తనం తెలుపుతున్నది.

వ. అనిన నమ్మునికుమారుని సుకుమారత్వంబును, వినయ ప్రియవచన జూచి మృదుమధురత్వంబును, ననవరత నియమవ్రత ప్రకాశిత ప్రశాంతత్వం బునుం శుక్రం డతిస్నేహంబున 'వీనిం బూజించిన బృహస్పతిం బూజించిన యట్ల' యని యభ్యాగతపూజల వాని సంతుష్టుంగాఁ జేసి శిష్యుంగాఁ జేకొని యున్నంత, నక్కచుండు. 13

ప్రతిపదార్థం: సుకుమారత్వంబును= మృదుత్వమును (చక్కనికౌమార దశను); వినయ, ప్రియ, వచన, మృదు, మధురత్వంబును= వినయంతో కూడిన ప్రియమైన మాటలలోని మెత్తదనమున్నూ, తియ్యదన మున్నూ; అనవరత, నియమ, వ్రత, ప్రకాశిత, ప్రశాంతత్వంబునున్= నిరంతరం నియమాలచేత, ఉపాసనలచేత ప్రకాశించబడిన ప్రశాంతతను; చూచి; శుక్రుండు; అతి, స్నేహంబునన్= అమితమైన వాత్సల్యంతో; వీనిన్= కచుడిని; పూజించినన్= గౌరవిస్తే (ఆదరిస్తే); బృహస్పతిన్, పూజించిన+అట్ల, అని= బృహస్పతిని గౌరవించినట్లే ఔతుం దని; వానిన్= కచుడిని; అభ్యాగత, పూజలన్= అతిథిపూజలతో; వానిన్= కచుడిని; సంతుష్టున్+కాన్, చేసి= తృప్తిపొందినవాడిగా చేసి; (సంతోషపెట్టి); శిష్యున్+కాన్, చేకొని= శిష్యుడయ్యేటట్లు చేసికొని; ఉన్న+అంతన్= ఉండగా; ఆ+కచుండు.

తాత్పర్యం: అని పలికిన కచుడి సౌకుమార్యాన్ని, అతడి వినయప్రియవచనాల లోని మెత్తదనాన్ని, తియ్యదనాన్ని, నిత్యనియమవ్రతాలవలన అతనిముఖంలో వెలిగే ప్రశాంతతను చూచి శుక్రుడు మిక్కిలి ప్రేమతో 'వీడిని పూజిస్తే దేవగురువును పూజించినట్లే' అని తలచి, అతిథిమర్యాదలు చేసి అతడిని సంతృప్తిపరిచి తనశిష్యుడిగా స్వీకరించాడు. అంతట కచుడు. (తరువాతి పద్యంతో అన్వయం.)

సీ. పని యేమి పంచినఁ బదపడి చేసెద ।
నసక తన్ బంచిన యాక్షణంబ
చేయుచు నిజగురు చిత్తవృత్తికిఁ గడు ।
ననుకూలుఁ డై వినయంబుతోడ
మనమునఁ జెయ్వుల మాటలభక్తి నే ।
కాకారుఁ డై, మఱి యంతకంటె
దేవయానికి సువిధేయుఁ డై ప్రియహిత ।
భాషణములఁ బుష్పఫలవిశేష

ఆ. దానములను సంతతప్రీతిఁ జేయుచు,
నివ్విధమునఁ బెక్కులేండ్లు నిష్ఠ
గురుని గురుతనూజఁ గొలిచి యయ్యిరువుర ।
నెమ్మి వడసెఁ దనదునేర్పుపేర్మి. 14

ప్రతిపదార్థం: పని, ఏమి, పంచినన్= పని ఏమి ఆజ్ఞాపించినా; పదపడి= తరువాత; చేసెదను; అనక; తన్, పంచిన= తనను ఆజ్ఞాపించిన; ఆ క్షణంబు+అ= వెంటనే; చేయుచున్= చేస్తూ; నిజగురు, చిత్తవృత్తికిన్= తనగురువుయొక్క మనఃప్రవృత్తికి; కడున్+అనుకూలుఁడు+ఐ= మిక్కిలి అనుకూలంగా ఉన్నవాడై; వినయంబుతోడన్= అణకువతో; మనమునన్, చెయ్వులన్, మాటలన్, భక్తిన్= మనోవాక్కాయకర్మలలో భక్తిలో; ఏక+ఆకారుఁ డై= ఒకేవిధంగా మెలిగి; మఱి; అంతకంటెన్= శుక్రుడిపట్లచూపే భక్తికంటె; దేవయానికిన్; విధేయుఁడు+ఐ= మరింత అనుకూలు డై; ప్రియ, హిత, భాషణములన్= ప్రియాలూ, హితాలూ అయిన మాటలతో; పుష్పఫల, విశేష, దానములను= పూలు, పండ్లు మొదలైనవాటిని విశేషంగా తెచ్చి ఇవ్వటంవలనను; సంతత, ప్రీతిన్, చేయుచున్= ఎల్లప్పుడు సంతోషాన్ని కలిగిస్తూ; ఈ+విధమునన్, పెక్కులు+ఏండ్లు; నిష్ఠన్= నియమాలతోడిదీక్షతో;

గురునిన్, గురుతనూజన్= గురువుగారిని, గురుపుత్రిక అయిన దేవయానిని; కొలచి= సేవించి; ఆ+ఇరువుర, నెమ్మిన్= ఆ ఇద్దరి ప్రీతిని; తనదు, నేర్పు, పేర్మిన్, పడసెన్= తన నేర్పరితనంతో పొందాడు.

తాత్పర్యం: ఏపని చెప్పినా తరువాత చేస్తా నని బదులు చెప్పకుండా వెంటనే చేస్తూ, శుక్రుడి మనఃప్రవృత్తికి చాలా అనుకూలు డై మనోవాక్కాయకర్మలలో ఒకేవిధం కలవా డై; అంతకంటె అధికంగా దేవయానికి మిక్కిలి విధేయుడై, ప్రియవాక్యాలతోను, పుష్పఫలాల నధికంగా తెచ్చి ఇవ్వటంతోను ఆమెకు సంతోషం కలిగిస్తూ ఈతీరుగా ఎన్నో సంవత్సరాలు గురువును గురుపుత్రిని కొలిచి ఎంతోనేర్పుతో వారి ప్రేమను పొందాడు.

వ. ఇట్లు గురుశుశ్రూషాకౌశలంబునఁ గచుండు శుక్రునకుం బ్రియశిష్యుం డై యున్న నెఱింగి, దానవులు సహింపనోపక బృహస్పతితోడి యలుకనక్కచు నొక్కనాఁడు హోమధేనువులం గాచుచు వనంబున నేకతంబ యున్న వాని వధియించి, విశాల సాలస్కంధంబున బంధించి చని; రంత నాదిత్యుం డస్తగిరి శిఖరగతుం డగుడు మగుడి హోమధేనువు లింటికి వచ్చిన, వానితోడన కచుండు రాకున్న, దేవయాని తనమనంబున మలమల మఱుంగుచుం బోయి తండ్రి కి ట్లనియె. 15

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; గురు, శుశ్రూషా, కౌశలంబునన్= గురువును సేవించటంలోని నేర్పరితనంతో; కచుండు; శుక్రునకున్; ప్రియశిష్యుండై, ఉన్నన్= మనసుకెక్కిన శిష్యుడై ఉండగా; ఎఱింగి= తెలిసికొని, గ్రహించి; దానవులు= రాక్షసులు; సహింపన్+ఓపక= ఓర్వలేక; బృహస్పతితోడి, అలుకన్= బృహస్పతియందు ఉన్న కోపంతో; ఒక్కనాఁడు= ఒకరోజు; హోమధేనువులన్= యజ్ఞకార్యాలకు ఉపయోగపడే ఆవులను; కాచుచున్= అరణ్యాలలో మేతమేస్తున్నప్పుడు వాటికి ఎటువంటి ఆపద రాకుండా రక్షిస్తూ;

వనంబునన్= అడవిలో; ఏకతంబు+అ= ఒంటరిగా; ఉన్నవానిన్; వధియించి= చంపి; విశాల, సాల, స్కంధంబునన్= విస్తార మైన చెట్టుబోదెకు; బంధించి= కట్టి; చనిరి= వెళ్ళారు; అంతన్= ఆతరువాత; ఆదిత్యుండు= సూర్యుడు; అస్తగిరి శిఖరగతుండు+అగుడున్= పడమటి కొండ శిఖరాన్ని చేరినవాడు కాగా; మగుడి= తిరిగి; హోమధేనువులు; ఇంటికిన్; వచ్చినన్= రాగా; వానితోడన్+అ= ఆగోవులతోపాటే కలిసి; కచుండు; రాక+ఉన్నన్= రాకుండా ఉండగా; దేవయాని; తన, మనంబునన్= తన మనసులో; మలమల, మఱుంగుచున్= మలమలమని మనస్సు (వేదనపడగా) పోయి= వెళ్ళి; తన, తండ్రికిన్= తన తండ్రియైన శుక్రుడితో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నది.

తాత్పర్యం: ఈవిధంగా కచుడు తన సేవానైపుణ్యంతో శుక్రుడికి ప్రియశిష్యు డై ఉండటం తెలిసికొని రాక్షసులు సహించలేక, దేవగురు వైన బృహస్పతితో తమకు గల వైరాన్ని పురస్కరించుకొని కోపించి, ఆ కచుడు ఒకరోజు హోమధేనువులను కాస్తూ ఒంటరిగా ఉండగా రాక్షసులు అతడిని వధించి, ఒకపెద్దచెట్టుబోదెకు బంధించి వెళ్ళిపోయారు. అప్పుడు సూర్యాస్తమయ మైనది. హోమధేనువులు తిరిగి ఇంటికి వచ్చాయి. వాటివెంబడి కచుడు రాకపోవటాన్ని గమనించి దేవయాని కలవరపడుతూ తనతండ్రి వద్దకు వెళ్ళి యిట్లా అన్నది.

ఉ. వాఁడిమయూఖముల్ గలుగువాఁ డపరాంబుధిఁ గ్రుంకె, ధేనువుల్
నేఁ డిట వచ్చె నేకతమ, నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్
పోఁడిగ వేల్వఁగాఁ బడియెఁ, బ్రొద్దును బోయెఁ, గచుండు నేనియున్
రాఁడు, వనంబులోన మృగరాక్షసపన్నగబాధ నొందెనో! 16

ప్రతిపదార్థం: వాఁడి, మయూఖముల్, కలుగువాఁడు= సూర్యుడు (చురుకు చురుకు మనే కిరణాలు కలవాడు); అపర+అంబుధిన్= పశ్చిమసముద్రంలో; క్రుంకెన్= మునిగాడు (అస్తమించాడు); ధేనువుల్= గోవులు; నేఁడు; ఇట; ఏకతము+అ= ఒంటరి గానే; వచ్చెన్; నిష్ఠమెయిన్= నియమంతో;

భవత్+అగ్ని హోత్రముల్= నీ హోమాగ్నులు; పోఁడిగన్= ఒప్పుగా; వేల్వఁ గాన్, పడియెన్= ఆహుతు లర్పించబడెను; ప్రొద్దును+పోయెన్= ప్రొద్దు కూడా పోయింది; కచుండున్+ఏనియున్, రాఁడు= కచుడు మాత్రం తిరిగిరాలేదు; వనంబులోనన్= అడవిలో; మృగ, రాక్షస, పన్నగబాధన్+ ఒందెనో= క్రూరమృగాలవలన (కాని), రాక్షసులవలన (కాని), సర్పాలవలన (కాని) ఎటువంటి ఇబ్బందినైనా పొందాడేమో!

తాత్పర్యం: సూర్యుడు పడమటిసముద్రంలో క్రుంకాడు. హోమధేనువులు ఒంటరిగా తిరిగి వచ్చాయి. చీకటి పడటం వలన నీ అగ్నిహోత్రాలు చక్కగా ఆహుతులను పొందుతున్నాయి. చాలా ప్రొద్దు పోయింది. కచుడు మాత్రం తిరిగి రాలేదు. అడవిలో మృగ రాక్షస సర్పాలవలన బాధను పొందాడేమో!.

విశేషం: అలం: స్వభావోక్తి. సంధ్యాసమయాన్ని స్వభావోక్తిలో వర్ణిస్తూనే కచుడిపట్ల దేవయానికి గల అభిలాషనుకూడ రమణీయంగా ధ్వనింపజేశాడు నన్నయ. తెలుగులోని మంచిపద్యాలలో ఇది ఒకటి. అందుకు కారణం నన్నయ రచనాశిల్పమే. మాటలవలన మనసులోని అభిలాష ప్రసన్న మౌతున్నట్లుగా చెప్పే ఈపద్యరచనలో ప్రసాదగుణం పోషింపబడటం రసవ్యంజకం. నన్నయ కవితలో ఈపద్యంవంటి ప్రసాదగుణభూయిష్ఠా లైన పద్యాలు విశేషంగా కనబడతాయి. ఇందులో దేవయాని అభిలాష వ్యంగ్యం. దానికి ఆర్తి, అధిక్షేపం, శంక, దైన్యం, నిర్వేదం మొదలైన సంచారులు పోషకాలు. సంచారులు వాక్యాలవలన, అభిలాష తాత్పర్యంవలన అనుగమ్యమానా లౌతున్నాయి. వాక్యాలలోని క్రియాపదాల వలన రసభావవ్యంజనం చేసే శిల్పం మొదట పేర్కొనదగింది. క్రుంకె; వచ్చె; పోయె- అనే భూతార్థక క్రియలు 'వాటిపని అవి కచుడిసంగతి పట్టించుకోకుండానే జరుపుకున్నాయి' అనే ఆర్తిని ధ్వనింపజేస్తున్నాయి. 'వేల్వఁగాఁబడియెఁ' అనే కర్మార్థక ప్రయోగం శుక్రుడుకూడా పట్టించుకోకుండా తనవిధులు తాను యాంత్రికంగా నిర్వర్తించాడనే అమర్షభావాన్ని వ్యక్తంచేస్తున్నది. 'కచుండునేనియున్ రాఁడు' అన్నప్పుడు అన్నీ సవ్యంగా జరిగిపోతున్నప్పుడు కచుడెందుకు రాడో గమనించండి! మీ కెవ్వరికీ

పట్టలేదా? కీడేమైనా జరిగిందేమో! అనే శంక అందులో ధ్వని. 'బాధనొందెనో' అన్నప్పుడు ఆర్తి, దైన్యం, నిర్వేదం ధ్వనింపబడు తున్నాయి. ఇంతేకాదు 'వాఁడిమయూఖముల్ కలుగువాఁడు' అనే విశేషణంలోని 'కలుగు' అనే తద్ధర్మార్థక క్రియకూడా వ్యంజకమే. పగలల్లా కచుడు అడవులలో ఉండటంవలన దేవయానికి ఇంట్లో కచుడి యెడబాటువలన ఎండ తీవ్రంగా ఉన్నట్లు అనిపించేదనీ, ఎప్పుడు సూర్యు డస్తమిస్తాడా అని క్షణాలు లెక్కపెట్టుతూ పగళ్ళు భారంగా గడిపేదనీ, అస్తమయం కాగానే కచుడి దర్శనంవలన చంద్రదర్శనసౌఖ్యాన్ని పొందే దనీ ధ్వని. ఆరోజు బాధకలిగించే సూర్యుడు వెళ్ళాడే కాని సుఖాన్ని ఇచ్చే కచుడు రాలేదు. ఆవులుకూడా కచుడితో కలిసివెళ్ళాయి. కాని, ఒంటరిగానే తిరిగివచ్చాయి. కలిసిఉండటంవలన కచుడిపట్ల వాటికి ఆమాత్రం స్నేహధర్మం ఉండవద్దా? అసలు ఒంటరిగా ఎందుకు వచ్చాయి? వచ్చి ఏమీ పట్టనట్లు ఎట్లా ఉన్నాయి? అని ఆమె వడే ఆవేదన ఆమెకు అతనిపట్ల ఉన్న సాహచర్యమాధుర్యాన్ని వ్యక్తంచేస్తున్నది. తండ్రి సాయంకాలంలో జరిపే అగ్నికార్యాలు యథావిధిగా జరిపాడే కాని, తనవలె తన శిష్యుడుకూడా ఆనాడు చేశాడా లేదా అని గమనించనే లేదు. అనుఁగుశిష్యుడిని ఆయన ఆరోజు ఎందుకుమర్చిపోయాడో? అని ఆమెకు అమర్షం. ప్రొద్దుపోయింది. అందరూ ఇక నిద్రపోతారు. ఆమెవలె ఆసక్తితో అతడికొరకు ఎవరూ అడగటం లేదు. ఆమెకు రతిభావోదయమూలమైన అభిలాష అంకురించింది. అందువల్లనే 'కచుడు ఒక్కడుమాత్రం తిరిగిరాడు' అని కంటతడిపెట్టి దైన్యాన్ని ప్రకటించింది. ప్రొద్దుపోతే, అడవిలో ఒంటరిగా మిగిలిపోతే కచుడికి మృగరాక్షస సర్పబాధ లేర్పడవచ్చును. వాటివలన అతడు చనిపోవచ్చును. అతడు చనిపోయినా ఎవరికీ దిగులు లేనట్లున్నది. పరిస్థితి గమనిస్తే తండ్రి, ఇల్లు, గోసంపద మొదలైన వెన్ని ఉన్నా దేవయానికి వాటిన్నిటికంటె కచుడే ఆత్మీయుడుగా, మనసు కోరేవాడుగా అనిపించాడు. అది అభిలాషయొక్క సమగ్రాభివ్యక్తి, నన్నయ అలంకార, వస్తుధ్వనులను రసధ్వనిలో పర్యవసింపజేసే కావ్యరచనాశిల్పం ఇందులో మకుటాయమానంగా ప్రసన్నమౌతున్నది. (సంపా.)

కచుండు దానవహతుం డై మృతసంజీవనిచే బ్రదుకుట (సం.1-71-30)

వ. అనిన విని శుక్రుండు దనదివ్యదృష్టి నసురవ్యాపాదితుం డైన కచుం గని, వానిం దోడ్కొని తేర మృతసంజీవనిం బంచిన, నదియును బ్రసాదం బని యతి త్వరితగతిం జని, విగతజీవుం డయిన కచు నప్పుడ సంజీవితుం జేసి తోడ్కొని వచ్చినం జూచి శుక్రుండును దేవయానియు సంతసిల్లి యున్నంతఁ, గొన్నిదినంబులకు వెండియు నొక్కనాఁడు. 17

ప్రతిపదార్థం: అనినన్= అని దేవయాని చెప్పగా; విని; శుక్రుండు తన దివ్య, దృష్టిన్= జ్ఞానదృష్టితో; అసుర, వ్యాపాదితుండు+ఐన= రాక్షసులచేత చంపబడిన; కచున్; కని= చూచి; వానిన్= ఆకచుని; తోడ్కొని, తేరన్= పిలుచుకొని తెచ్చేందుకు; మృతసంజీవనిన్= చచ్చిపోయినవారిని బ్రతికించే విద్యను; పంచినన్= పంపగా; అదియును= ఆ విద్యయున్నూ; ప్రసాదంబు+అని= అనుగ్రహ మని; అతి, త్వరిత, గతిన్= మిక్కిలివేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; విగత, జీవితుండు+అయిన= పోయిన ప్రాణం కల; కచున్; అప్పుడు+అ= ఆ క్షణమందే; సంజీవితున్, చేసి= బ్రతికినవాడిని కావించి (చేసి); తోడ్కొని, వచ్చినన్= తనవెంట తీసికొని రాగా; చూచి, శుక్రుండును; సంతసిల్లి= సంతోషించి; ఉన్న+అంతన్= ఉండగా; కొన్ని, దినంబులకున్= కొన్ని రోజులకు; వెండియున్= మరల; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: అని దేవయాని చెప్పగా విని శుక్రుడు తనదివ్యదృష్టితో రాక్షసులచేత చంపబడిన కచుడిని చూచి, అతడిని బ్రదికించి తెచ్చేందుకు మృతసంజీవనీవిద్యను పంపగా, ఆవిద్యకూడ అది తనకు అనుగ్రహ మని తలంచి మిక్కిలివేగంతో కూడిన గమనంతో వెళ్ళి, ప్రాణరహితు డైన కచుడిని తత్క్షణమే బ్రదికించి తన వెంట తీసికొని రాగా చూచి శుక్రుడూ, దేవయానియూ సంతోషించి ఉండగా కొన్నిరోజులతర్వాత మళ్ళీ ఒకరోజున. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: చర్మచక్షువులచూపు బహిఃప్రపంచంలో కొంతవరకు కొన్నివస్తువులను మాత్రమే చూడగలదు. ఇది సామాన్యజీవుల కందే దృష్టి. దివ్యదృష్టి దాని కతీత మైనది. దానితో ఎంతదూరంలో ఉన్నదాని నైనా, ఎక్కడున్నదాని నైనా చూడవచ్చును. ఇది మునులకు, దేవతలకు ఉంటుంది. ప్రసాదంబు+అని= రాజులు దేవతలు మొదలైన వారు ఏదైనా పనిచేయు మని ఆజ్ఞాపించగానే సేవకులు, భక్తులు అనుగ్రహంగా భావించి వినయంతో ప్రసాద మంటారు. తమరు పని చెప్పి మమ్మల్ని అనుగ్రహించా రని విన్నవించుకొంటారు.

క. అడవికిఁ బువ్వులు దేరఁగ ।
వడి నరిగినకచునిఁ జంపి, వారక దనుజుల్
పొడవు సెడఁ గాల్చి, సురతోఁ ।
దడయక యబ్బూది శుక్రుఁ ద్రావించి రొగిన్. 18

ప్రతిపదార్థం: అడవికిన్; పువ్వులు; తేరఁగన్= తెచ్చేందుకు; వడిన్= వేగంగా; అరిగిన= వెళ్ళిన; కచునిన్; చంపి; వారక= ఉడుగక (అంతటితో ఆగక); దనుజుల్; పొడవు= రూపం; చెడన్= చెడిపోయేట్లుగా; కాల్చి; ఆ+బూది= కచుడిని కాల్చగా ఏర్పడిన బూడిద; సురతోన్= మద్యంతో; తడయక= ఆలస్యం చేయక; ఒగిన్= క్రమంగా; శుక్రున్= శుక్రుడిచేత; త్రావించిరి= త్రాగేటట్లుగా చేశారు.

తాత్పర్యం: పూలు తెచ్చేందుకై అడవికి వెళ్ళిన కచుడిని చంపారు. అంతటితో ఆగక రాక్షసులు అతడి రూపులేకుండా కాల్చి, ఆలస్యం చేయకుండా ఆ బూడిదను మద్యంతోకలిపి, క్రమంగా శుక్రుడు త్రాగేటట్లు చేశారు.

విశేషం: తెచ్చు, తుమున్నర్థకము తేరన్ త్రాగు - త్రావు - ప్రేరణార్థకము త్రావించు.

వ. శుక్రుండును సురాపానమోహితుం డయి యున్నఁ, దొల్లింటియట్ల దేవయాని గచుం గానక దుఃఖిత యై 'నేఁడును గచుండు రాక మసలె;

నసురులచేత నిహతుం డయ్యెఁ గావలయు' నని శోకించిన దానిం జూచి శుక్రుం డి ట్లనియె. 19

ప్రతిపదార్థం: శుక్రుండును= శుక్రుడు కూడ; సురా, పాన, మోహితుండు+ అయి= మద్యం త్రాగటంచేత తెలివి తప్పినవా డై; ఉన్నన్= ఉండగా; తొల్లింటి, అట్లు+అ= పూర్వం వలెనే; దేవయాని; కచున్= కచుడిని; కానక= అరయక; దుఃఖిత+ఐ= దుఃఖం పొందినదై; నేఁడును= ఈ దినానకూడ; కచుండు; రాక= రాకుండా, మసలెన్= ఆలస్యం చేశాడు; అసురులచేతన్= రాక్షసులచేత; నిహతుండు= చంపబడినవాడు; అయ్యెన్, కావలయున్= అయ్యెను కాబోలును అని; శోకించినన్= దుఃఖించగా; దానిన్= దేవయానిని; చూచి; శుక్రుండు; ఇట్లు+అనియెన్= ఇట్లా పలికాడు.

తాత్పర్యం: శుక్రుడుకూడ మద్యం త్రాగటంచేత మోహం (మైకం) పొందిన వాడై ఉండగా, పూర్వంవలెనే దేవయాని కచుడిజాడ తెలియక దుఃఖంపొందిన దై, 'ఈనాడుకూడ కచుడు రాకుండా ఆలస్యం చేశాడు. రాక్షసులచేత చంపబడినవా డయ్యాడు కాబోలు' నని చింతించగా ఆమెను చూసి శుక్రుడు ఇట్లా పలికాడు.

విశేషం: కచుడు అడవినుండి తిరిగిరానప్పుడు మొదటిసారి ఏమైనాడో తెలియక కలవరపడింది; రెండవసారి చంపబడి ఉండవచ్చునన్న నమ్మకంతో దుఃఖించింది. మొదటిసారి మనసులోనే వేదనను దాచుకొన్నది. ఇప్పుడు దుఃఖించి బైటపెట్టింది. అభిలాష- చింత అనే దశనందుకొన్న దని ధ్వని. శృంగారస్థాయి యైన రతి దశవిధావస్థలలో పరిణతి పొందుతుందని లాక్షణికుల వివేచన. మొదటిదశనుండి రెండవదశయొక్క పరిణామం ఇందులోని రసధ్వని. (సంపా.)

క. వగవక సంజీవని పెం।
పగణిత గర్వమున నసురు లా కచుతోడం
బగఁ గొని చంపెద; రాతఁడు।
సుగతికిఁ జనుఁగాక; యేల శోకింపంగన్?. 20

ప్రతిపదార్థం: సంజీవని; పెంపు= మృతులైన వారిని బ్రతికించేవిద్యయొక్క మహత్త్వం; వగవక= తలపక; అసురులు= రాక్షసులు; అగణిత, గర్వమునన్= గణింపరాని (అధికమైన) గర్వంతో; ఆ, కచుతోడన్= ఆ కచుడితో; పగన్= వైరాన్ని; కొని= పొంది; చంపెదరు= అతడిని చంపుతారు; ఆతఁడు= ఆ కచుడు; సుగతికిన్= మంచిస్థితికి (మోక్షానికి); చనున్, కాక= పోవుగాక; శోకింపన్, ఏల= దుఃఖించట మెందుకు?

తాత్పర్యం: సంజీవనీవిద్యగొప్పతనాన్ని ఆలోచించక రాక్షసులు అధికగర్వంతో ఆ కచుడితో వైరం పూని అతడిని చంపుతారు. అతడు ఉత్తమగతికి వెళ్ళుగాక. దీనికి దుఃఖించట మెందుకు?

విశేషం: వగచు ధాతువుకు నన్నయకాలాన తలచు అనే అర్థముండేది. తరువాత దానికి దుఃఖించు అన్న అర్థ మేర్పడింది.

వ. అనిన దేవయాని యి ట్లనియె. 21

తాత్పర్యం: శుక్రు డా విధంగా పలుకగా దేవయాని ఇట్లా అన్నది.

మ. మతిలోకోత్తరుఁ డైన యంగిరసుమన్మం, డాశ్రితుం, డాబృహ
స్పతికింబుత్త్రుఁడు, మీకు శిష్యుఁడు, సురూప బ్రహ్మచర్యాశ్రమ
వ్రత సంపన్నుఁ, డకారణంబ దనుజవ్యాపాదితుం డైన న
చ్యుతధర్మజ్ఞు! మహాత్ము! యక్కచున కే శోకింప కె ట్లుండుదున్? 22

ప్రతిపదార్థం: మతి లోక+ఉత్తరుఁడు+ఐన= బుద్ధిలో అసాధారణు డైన, అంగిరసు= అంగీరసు డనే; ముని యొక్క; మన్మండు= పౌత్త్రుడు (మనుమడు); ఆశ్రితుండు= ని న్నాశ్రయించినవాడు; ఆ బృహస్పతికిన్= అంతటి దేవగురువు, సుప్రసిద్ధుడున్నూ అయి బృహస్పతికి; పుత్త్రుఁడు= కొడుకు; మీకున్= శుక్రుడికి; శిష్యుఁడు; సురూప, బ్రహ్మచర్య+ఆశ్రమ+వ్రత సంపన్నుఁడు= మంచి రూపం కలవాడున్నూ, బ్రహ్మచర్యాశ్రమ మనే వ్రతంతో కూడినవాడున్నూ అయిన కచుడు; అకారణంబు+అ= కారణం లేకుండానే;

దనుజ, వ్యాపాదితుండు+ఐనన్= రాక్షసులచేత చంపబడ్డవాడు కాగా; అచ్యుత; ధర్మజ్ఞ= చ్యుతి లేని ధర్మాన్ని ఎరిగినవాడా! (ధర్మమార్గం తప్పనివాడా!); మహత్+ఆత్మ= మహానుభావా! (శుక్రుడికి సంబోధన); ఆ+కచునకున్= ఆ కచుడి కొరకు; ఏన్= నేను; శోకింపక= దుఃఖించక; ఎట్లు ఉండుదున్= ఏ విధంగా ఉంటాను?

తాత్పర్యం: చ్యుతి లేని ధర్మాన్ని ఎరిగిన వాడా! పరమధర్మజ్ఞుడా! మహానుభావా! బుద్ధియందు లోకాతీతు డైన అంగిరసు డనే మునికి మనుమడున్నూ, ని న్నాశ్రయించినవాడున్నూ, ప్రసిద్ధు డైన బృహస్పతికి కుమారుడున్నూ, మీకు శిష్యుడున్నూ, మంచిరూపం కలవాడున్నూ, బ్రహ్మచర్యాశ్రమ మనే వ్రతంతో కూడినవాడున్నూ, అయినటువంటి కచుడు కారణం లేకుండానే రాక్షసులచేత చంపబడినవాడు కాగా అతడికొరకు నే నెట్లా దుఃఖించకుండా ఉంటాను?

విశేషం: దేవయాని కచుడియం దనురక్తురాలయిన దన్న సంగతిని ఈపద్యంలో వ్యంగ్యంగా స్ఫురిస్తున్న స్మృతి, గుణస్తుతి అనే దశలు తెలుపుతున్నాయి. రతిభావ పరిణామదశలలో ఇవి మూడవది, నాల్గవది, అవస్థలు పది. అవి- అభిలాష, చింత స్మృతి, గుణస్తుతి, ఉద్వేగము, ప్రలాపము, ఉన్మాదము, వ్యాధి, జాడ్యము, మరణము. రాత్రికి ఆశ్రమానికి తిరిగిరాని కచుడు తప్పక చనిపోయి ఉంటాడని పూర్వానుభవ స్మృతిచర్వణంవలన నిశ్చయించింది. చనిపోతే దిగులుపడేదే ముంది? అని శుక్రుడు పేర్కొనగానే ఆమె తనశోకానికి కారణం చెప్పింది. ఆ కారణం కచుడి గుణగణప్రశస్తియే. కచుడు ఉత్తమవంశజుడు. తాతతండ్రులు మహామునులు. జగద్విదితులు. ఇక గురువుగారా వారిద్దరికి ఏమాత్రం తీసిపోని మహితాత్ముడు. కచుడు అందగాడు, బ్రహ్మచర్యవ్రతనిష్ఠాపరుడు. అటువంటి యోగ్యుడు రాక్షసులకారణంగా చనిపోయాడంటే శోకించకుండా ఎలా ఉండ గలను? అని పలికింది. ఇందులో కచగుణకీర్తనం వాచ్యం. ఆ కీర్తనంవెనుక ఉన్న దేవయాని విప్రలంభం వ్యంగ్యం. ఉత్తమవంశజుడు, అందగాడు, బ్రహ్మచారి, శుక్రుడి శిష్యుడు అయిన కచుడు అన్నివిధాల తనకు యోగ్యుడైన వరుడని

దేవయాని భావం. దీనిని తండ్రి గ్రహించడేమి? అని కోపం. అంతటి బ్రహ్మచారి పోతే తండ్రి శోకించనందుకు అధిక్షేపం. తండ్రికి ఇష్టంలేకపోయినా దేవయాని అతడి వియోగాన్ని భరించలే నని వ్యంగ్యంగా తండ్రికి చెపుతున్నది. కచుడికి తనకూతురు నివ్వటం ధర్మం కాదు కాబట్టి శుక్రు డామె అభిలాషను గమనింపలేదు. అయినా, కనీసమానవధర్మంతో చూచినా అతడిని రక్షించటం ఉచితం, ధర్మం, ఉత్తమలక్షణం. దానిని ధ్వనింపజేసేటట్లు 'అచ్యుతధర్మజ్ఞ! మహాత్మ!' అని దేవయాని తండ్రిని సంబోధించింది. నన్నయ దేవయాని రతిభావావస్థ (గుణస్తుతి)ను మాధుర్య మనే గుణంతో పోషించాడు. ఉక్తివైచిత్ర్యంతో కూడుకొన్న పృథక్పదత్వం ఈరచనలో గుణం. అదే మాధుర్యం. 'అటువంటి కచుడు నిష్కారణంగా మనరాక్షసులచేత చంపబడితే ముల్లోకాలలో శుక్రుడి శిష్యుడు చంపబడ్డాడనే అపకీర్తి వస్తుంది. అతడి తాతతండ్రులుకూడ లోకత్రయవిదితులు. అన్ని లోకాలలో ఈవార్త గుప్పు మంటుంది. వారందరూ శుక్రుడిని నిందిస్తారు. ఈ గురుబంధువర్గమంతటి కంటె కచుడు నాకు కావలసినవాడు. అందువలన మీకు దుఃఖంలేకపోవచ్చును, నాకుమాత్రం విచారం కలుగుతుంది- అని అనురక్తిని ఉక్తివైచిత్రితో చెప్పింది. 'శోకింప కెట్లుండుదున్' అనటంలో మరొక చమత్కారమున్నది. ఆప్తజనవియోగంవలన, పునస్సమాగమం లేని ప్రియుడి యెడబాటువలన నాయిక పొందేది శోకం. అటువంటి శోకం దేవయాని పొందింది. కచుడు బ్రతికివస్తేనే ఆ శోకం సంచారి అయి రతికి పోషక మయ్యేది. లేదా శోకం కరుణరసంగా మారుతుంది. నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికీ, వస్తుధ్వనిని రసధ్వనిలో పర్యవసింపచేయటానికీ, ఈ పద్యం అమూల్యోదాహరణం. (సంపా.)

వ. 'వానిం జూచి కాని కుడువనొల్ల' నని దేవయాని యేడ్చుచున్నఁ, బెద్దయుం బ్రొద్దునకుఁ బ్రసన్నుం డై శుక్రుండు దనయోగదృష్టిం జూచి లోకాలోకపర్యం తభువనాంతరంబునఁ గచుం గానక సురాసమ్మిశ్ర భస్మ మయుం డై తనయుదరంబున నున్న యక్కచుం గని, సుర సేసిన దోషంబును, నసురులు సేసిన యపకారంబును నెఱింగి. 23

ప్రతిపదార్థం: వానిన్= ఆ కచుడిని; చూచి; కాని= చూసిన తరువాత కాని; కుడువన్+ఒల్లన్= తినటానికి సమ్మతించను; అని; దేవయాని; ఏడ్చుచున్+ఉన్నన్= ఏడుస్తూండగా; పెద్దయున్, ప్రొద్దునకున్= చాలాసేపటికి; ప్రసన్నుండు+ఐ= అనుగ్రహం కలవాడై; శుక్రుండు; యోగదృష్టిన్= యోగాభ్యాసంచేత లభించిన అతీంద్రియదృష్టితో (దివ్యదృష్టితో); చూచి; లోకాలోక, పర్యంత, భువన+అంతరంబునన్= లోకాలోకపర్వతం చేత చుట్టబడిన ప్రపంచంయొక్క నడుమన్; కచున్= కచుడిని; కానక= కనుగొనలేక; సురా, సమ్మిశ్ర, భస్మమయుండు+ఐ= మద్యంలో కలిసిన బూడిదఆకారం కలవాడై; తన; ఉదరంబునన్= పొట్టలో; ఉన్న; ఆ కచున్; కని= చూచి; సుర+చేసిన= మద్యపానం చేసిన; దోషంబునున్= కీడును; అసురులు= రాక్షసులు; చేసిన; అపకారంబునున్= హానిని; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: ఆ కచుడిని చూసినతరువాత కాని అన్నం తినేందుకు అంగీకరించ నని దేవయాని ఏడుస్తుండగా, చాలాసేపటికి అనుగ్రహం కలవాడై శుక్రుడు దివ్యదృష్టితో చూచి, లోకాలోకపర్వతంచేత చుట్టబడిన ప్రపంచం మధ్యలో కచుడిని చూడక మద్యంలో కలిసిన బూడిద రూపాన తన కుక్షిలో ఉన్న ఆ కచుడిని చూచి మద్యపానం చేసిన హానినీ, రాక్షసులు చేసిన కీడునూ తెలిసికొని.

విశేషం: తాము చెప్పిన పని చేయనప్పుడు అన్నం తినేందుకు అంగీకరించకుండా ఏడవటం పిల్లలకు, ఆడవాళ్ళకు సహజం. భూమి చుట్టూ లోకాలోకపర్వతం (చక్రవాళపర్వతం) ఉంటుం దని చెపుతారు. దానికి ఇవతల వెలుతురు, అవతల చీకటి ఉంటుంది.

ఆ. మొదలి పెక్కు జన్మములఁ బుణ్యకర్మముల్ ।
పరఁగఁ బెక్కుసేసి పడయఁబడిన
యట్టి యెఱుక జనుల కాక్షణ మాత్రన ।
చెఱుచు మద్యసేవ సేయ నగునె?. 24

ప్రతిపదార్థం: మొదలి, పెక్కు, జన్మములన్= పూర్వమందలి అనేకజన్మలందు; పుణ్యకర్మముల్= పుణ్యం కలిగించే పనులు; పరఁగన్= ఒప్పుగ; పెక్కు, చేసి= అనేక మైనవి చేసి; పడయఁ బడిన, అట్టి= పొందబడినటువంటి; ఎఱుక= జ్ఞానం; జనులకున్= ప్రజలకు; ఆ క్షణమాత్రన్+అ= ఆ క్షణమందే; చెఱుచు= చెడునట్లు చేయు; మద్య, సేవ= మద్యాన్ని సేవించటం (మద్యపానం) చేయన్+అగున్+ఎ= చేయదగునా; (చేయరా దని భావం).

తాత్పర్యం: పూర్వమందలి అనేక జన్మాలలో పుణ్యకార్యాలను ఒప్పుగా అనేకం చేసి పొందబడిన జ్ఞానం జనాలకు క్షణమాత్రంలోనే పోగొట్టే మద్యపానం చేయదగునా?

విశేషం: మద్యపానం చేస్తే పూర్వజన్మాలలోని పుణ్యకర్మాలవలన లభించిన జ్ఞానంకూడా నశిస్తుం దని సందేశం. మద్యపాన దుష్ఫలితాన్ని తెలిపే రుచిరార్థ సూక్తి ఇది. మద్యపానం పంచమహాపాతకాలలో ఒకటి.

క. భూసురు లాదిగఁ గల జను ।
లీసుర సేవించిరేని యిది మొదలుగఁ బా
పాసక్తిఁ బతితు లగుదురు; ।
చేసితి మర్యాద; దీనిఁ జేకొనుఁడు జనుల్. 25

ప్రతిపదార్థం: భూసురులు+ఆదిగన్= బ్రాహ్మణులు మొదలుగా; కల; జనులు; ఈ సురన్= ఈ మద్యాన్ని; సేవించిరి+ఏని= సేవించారా (త్రాగితే); ఇది మొదలుగన్= నేడు మొదలుకొని; పాప+ఆసక్తిన్= పాపమందలి అపేక్షచేత (పాపమునందే తగులు కొనటంచేత); పతితులు= భ్రష్టులు (పాపలోకమందు పడినవారు); అగుదురు; మర్యాద= కట్టుబాటు; చేసితిన్; దానిని= ఆ కట్టుబాటును; జనుల్= ప్రజలు; చేకొనుఁడు= గ్రహించండి.

తాత్పర్యం: నేడు మొదలుకొని బ్రాహ్మణులు మున్నగు జనులు ఈ మద్యాన్ని పానం చేస్తే పాపమందు తగులుకొని దుర్గతి పొందుతారు. నే నీ కట్టడి చేశాను. ప్రజలు గ్రహించండి.

విశేషం: ఇది మొదలుగా అంటే నేను మద్యపానం చేయటంవలన కీడు జరిగింది మొదలుకొని అని అర్థం. మద్యపానం చేసేవారు అధోలోకాలకు పోతా రని దీనివలన తెలుస్తున్నది.

వ. అని శుక్రుండు సురాపానంబు మహాపాతకంబుగా శపియించి, తనయు దరంబున నున్న కచు నప్పుడ సంజీవితుం జేసిన, నంద యుండి కచుండు శుక్రున కి ట్లనియె. 26

ప్రతిపదార్థం: అని; శుక్రుండు; సురా, పానంబు= మద్యాన్ని త్రాగటం; మహత్+ పాతకంబు, కాన్= గొప్ప పాప మయ్యేటట్లుగా; శపియించి= శపించి (శాపమిచ్చి); తన ఉదరంబునన్= తనపొట్టలో ఉన్న; కచున్; అప్పుడు+అ= వెంటనే; సంజీవితున్, చేసినన్= మరల బ్రతికిన వాడిని చేయగా; అందున్+అ= పొట్టయందే; ఉండి; కచుండు; శుక్రునకున్; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికాడు.

తాత్పర్యం: అని శుక్రుడు మద్యం త్రాగటం గొప్పపాప మౌనట్లుగా శాప మిచ్చి తనపొట్టలో నున్న కచుడిని ఆక్షణమందే మరల బ్రదికినవాడిని చేయగా, కడుపులోనే ఉండి కచుడు శుక్రుడితో ఇట్లా పలికాడు.

క. తనువును జీవము సత్త్వం ।
బును బడసితి నీ ప్రసాదమున; నీయుదరం
బనఘా! వెలువడు మార్గం ।
బొనరింపుము నాకు భూసురోత్తమ! దయతోన్. 27

ప్రతిపదార్థం: అనఘా!= పాపరహితుడా! భూసుర+ఉత్తమ= బ్రాహ్మణ శ్రేష్ఠుడా; తనువును= దేహాన్ని; జీవమున్= ప్రాణాన్ని; సత్త్వంబును= బలాన్ని; నీ ప్రసాదమునన్= నీ అనుగ్రహంచేత; పడసితిన్= పొందాను; నీఉదరంబు= కడుపునుండి; నాకున్; వెలువడు మార్గంబు= బయటికి వచ్చేవిధం (త్రోవ); దయతోన్; ఒనరింపుము= చేయుము.

తాత్పర్యం: పాపరహితుడవు, బ్రాహ్మణశ్రేష్ఠుడవు అయిన ఓ శుక్రుడా! నీ అనుగ్రహంవలన దేహాన్ని, ప్రాణాన్ని, బలాన్ని పొందాను. నాకు దయతో నీకడుపునుండి బయటికి వచ్చే విధం కావించవలసింది.

విశేషం: నీయుదరంబు+వెలువడు మార్గంబు 'ఒకానొకచో నొకవిభక్తికి మరియొక్క విభక్తియు నగును'. ఇచ్చట ఉదరంబు అనగా ఉదరమువలననుండి అని అర్థం. ప్రథమ పంచమ్యర్థమున వాడబడింది.

వ. అనిన 'నాయుదరంబుభేదిల్లినంగాని యిమ్మునికుమారుండు వెలువడ నేరం; డుదరభేదనంబున మూర్ఛితుండ నయిన నన్ను సంజీవితుం జేయు వలయు' నని శుక్రుండు కచునకు సంజీవని నుపదేశించిన. 28

ప్రతిపదార్థం: అనినన్= అని కచుడు పలుకగా; నా+ఉదరంబు= నాకడుపు; భేదిల్లినన్, కాని= బ్రద్దలయితే తప్ప; ~~ఈ~~+మునికుమారుండు= (బృహస్పతి) మునికొడు కయిన ఈకచుడు; వెలువడన్ నేరండు= బయటికి రాజాలడు; ఉదర, భేదనంబునన్= కడుపు బ్రద్దలవటం వలన; మూర్ఛితుండను= మూర్ఛపొందినవాడను; అయిన, నన్నున్; సంజీవితున్= బ్రతికినవాడినిగా, చేయవలయున్= కచుడు చేయాలి; అని; శుక్రుండు; కచునకున్; సంజీవనిన్= మరణించినవారిని బ్రతికించే విద్యను; ఉపదేశించినన్= ఉపదేశం చేయగా (నేర్పుగా).

తాత్పర్యం: అని కచుడు పలుకగా, 'నాకడుపు భేదిల్లితే కానీ (బ్రద్ద లయితే తప్ప) బృహస్పతి కుమారు డైన కచుడు బయటికి రాలేడు. కడుపు బ్రద్దలవటంచేత మూర్ఛ పొందిన నన్ను ఈ కచుడు మరల బ్రతికించాలి' అని శుక్రుడు కచుడికి సంజీవనివిద్యను ఉపదేశించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. ఉదరభిదాముఖమున న ।
భ్యుదయముతో నిర్గమించె బుధనుతుఁడు కచుం

డుదయాద్రిదరీముఖమున।
నుదితుం డగు పూర్ణహిమమయూఖుఁడ పోలెన్. 29

ప్రతిపదార్థం: ఉదర, భిదా, ముఖమునన్= కడుపుయొక్క రంధ్రముయొక్క మొదటినుండి, బుధనుతుఁడు= పండితులచేత స్తుతించబడినవాడు; కచుండు; అభ్యుదయముతోన్= విజయంతో, వాంఛితార్థఫలసిద్ధితో; ఉదయ+అద్రి, దరీ, ముఖమునన్= తూర్పుకొండ గుహారంభాన; ఉదితుండు+అగు= ఉదయించినవా డైన; పూర్ణ, హిమ, మయూఖుఁడు+అ+పోలెన్= నిండు చంద్రుడో యన; నిర్గమించెన్= బయటికి వచ్చాడు.

తాత్పర్యం: పండితులచే స్తుతించబడు కచుడు వాంఛితార్థసిద్ధితో తూర్పుకొండ గుహయొక్క ఆరంభాన ఉదయించే చంద్రుడో యన శుక్రుడి కడుపురంధ్రం మొదటినుండి బయటికి వచ్చాడు.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష. సంజీవనీవిద్యను పొందిన కచుడిని అమృతప్రదుడైన చంద్రుడితో సంభావించటం ఔచిత్యవంతంగా ఉన్నది. కచుడు సంజీవనీవిద్య పొందటానికే వచ్చాడు. అతడికోరిక నెరవేరింది.

వ. అంత. 30

తాత్పర్యం: ఆ తరువాత.

తే. విగతజీవుఁ డై పడియున్న వేదమూర్తి।
యతనిచేత సంజీవితుఁ డై వెలింగె
దనుజమంత్రి యుచ్చారణదక్షుచేత।
నభిహితం బగు శబ్దంబునట్ల పోలె. 31

ప్రతిపదార్థం: విగత, జీవుఁడు+ఐ= పోయిన ప్రాణం కలవాడై; పడి, ఉన్న= నేలమీద పడి ఉన్న; వేద, మూర్తి= రూపు ధరించిన వేద మైన (వేదరూపుడైన); దనుజ, మంత్రి= రాక్షసులమంత్రి అయిన శుక్రుడు; ఉచ్చారణ, దక్షుచేతన్= శబ్దాలను ఉచ్చరించటం (పలకటం) లో సమర్థుడైనవాడిచేత; అభిహితంబు+ అగు= పలుకబడిన; శబ్దంబు+ అట్లు+అ, పోలెన్= పదంవలె; అతనిచేతన్= కచుడిచేత;సంజీవితుఁడు+ఐ= బ్రతికించబడినవాడై; వెలింగెన్= ప్రకాశించాడు.

తాత్పర్యం: ప్రాణం పోయినవాడై పడి ఉన్న, వేదవిగ్రహు డైన, రాక్షసమంత్రి అయిన శుక్రుడు కచుడిచేత బ్రతికించబడినవా డై, పదాలను చక్కగా ఉచ్చరించటంలో నేర్పుకలవాడిచేత పలుకబడిన పదంవలె ప్రకాశించాడు.

విశేషం: అలం: ఉపమ. ఇందులోని ఉపమానం అపూర్వం. శబ్దబ్రహ్మవేత్తలకే అది తెలుస్తుంది. సుష్ఠూచ్చారణదక్షులు పలికే శబ్దాలు వీనులవిందు లై ప్రకాశిస్తాయి. అంతేకాక ఇక్కడ మరొక విశేషం ఉన్నది. శబ్దం కావ్యశరీరంవంటిది. అది సమర్థంగా ఉచ్చరించబడితే సమగ్రంగా ఆవిష్కరించబడినట్లౌతుంది. అట్లాగే కాలి, బూడిద అయి శుక్రుడి కడుపులో జీర్ణించిన కచుడు సంజీవనీ విద్యాప్రభావంచేత చెక్కుచెదరని ఆకారంతో బయలువెడలినాడని భావం. సంజీవనీ మంత్రాన్ని గ్రహించి ఉచ్చరించే సామర్థ్యం అతనియందు సమగ్రంగా ఏర్పడిందని కూడా వ్యంగ్యం. అట్లు, పోలె= అని రెండు ఉపమానవాచకాలను ఉపయోగించటం నన్నయరచనలలో కొన్ని చోట్లను, నన్నెచోడుడి కుమారసంభవంలో పెక్కుచోట్లను కనిపిస్తాయి. శబ్దంబు+అట్లు= షష్ఠీసమాసమున ఉత్తున కచ్చు పరమగునపుడు నుగాగమ మగును'; శబ్దంబునట్లు.

వ. ఇ ట్లతిప్రయత్నంబునఁ గచుండు శుక్రువలన సంజీవని వడసి పెద్దకాలం బుండి, యొక్కనాడు శుక్రుచేత ననుజ్ఞాతుం డయి దేవలోకంబునకుం బోవుచుండి, దేవయాని కతిప్రియపూర్వకంబునం జెప్పిన, నదియును దద్వియోగదుఃఖిత యై కచున కి ట్లనియె. 32

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అతి, ప్రయత్నంబునన్= అధిక మైన ప్రయత్నంచేత; కచుండు; శుక్రువలన; సంజీవని= చచ్చినవారిని బ్రదికించే విద్యను; పడసి= పొంది (పకు వాదేశము); పెద్ద, కాలంబు= చాలకాలం; ఉండి= శుక్రుడిదగ్గర ఉండి; ఒక్కనాడు; శుక్రుచేతన్; అనుజ్ఞాతుండు+అయి= అనుమతించ బడినవాడై; దేవలోకంబునకున్= స్వర్గలోకానికి; పోవుచున్+

ఉండి= వెళ్ళుతూ; దేవయానికి; అతిప్రియ, పూర్వకంబునన్= మిక్కిలి ప్రీతితో; చెప్పినన్= నేను వెళ్ళుతున్నా నని తెల్పగా; అదియును= ఆ దేవయానియున్నూ; తద్+వియోగ, దుఃఖిత+ఐ= అతని ఎడబాటువలన దుఃఖం పొందిన దై; కచునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా అధిక మైన ప్రయత్నంతో (మిక్కిలి కష్టపడి) కచుడు శుక్రుడినుండి మృతులను బ్రదికించే విద్యను పొంది, చాలకాలంఉండి, ఒకరోజున శుక్రుడిఅనుమతి పొంది స్వర్గలోకానికి తిరిగి వెళ్తూ, దేవయానికి అతిప్రీతిపూర్వకంగా ఆవార్త చెప్పగా, ఆమెయు అతని ఎడబాటుకు దుఃఖించి అతనితో ఇట్లా పలికింది.

ఉ. ‘నీవును బ్రహ్మచారివి, వినీతుఁడ, వేనును గన్యకన్; మహీ
దేవకులావతంస! రవితేజ! వివాహము నీకు నాకు మున్
భావజశక్తి నైనయది; పన్నుగ నన్నుఁ బరిగ్రహింపు సం
జీవనితోడ శుక్రుదయఁ; జేయుము నాకుఁ బ్రియంబు’ నావుడున్.33

ప్రతిపదార్థం: మహీదేవ, కుల+అవతంస= బ్రాహ్మణకులానికి సిగబంతియైన వాడా!; రవి, తేజ= సూర్యుడి కాంతివంటి కాంతి కలవాడా!, కచుడా!; నీవును= నీవుకూడ; బ్రహ్మచారివి= అవివాహితుడవు; వినీతుఁడవు= వినయవంతుడివి; (గురువుచే విద్యపొందినవాడివి); ఏనును= నేనుకూడ; కన్యకన్= వివాహం కానిదానను; నీకున్, నాకున్= మన కిద్దరికీ; వివాహము= పెళ్ళి; మున్= ముందే; భావజ, శక్తిన్= మన్మథుడి ప్రభావంచేత; ఐన+అది= అయినది (మన్మథుడి ప్రభావంచేత నిన్ను నేను ప్రేమించాను కాబట్టి మానసికంగా పెండ్లి అయిపోయింది); పన్నుగన్= ఒప్పుగ; శుక్రుదయన్= నాతండ్రి అయిన శుక్రుడియొక్క దయతో; సంజీవనితోడన్= సంజీవనీవిద్యతోపాటుగ; నన్నున్; పరిగ్రహింపు(ము)= స్వీకరించుము, వివాహమాడుము; నాకున్; ప్రియంబు= ప్రీతి; చేయుము= కలిగించుము; నావుడున్= అని దేవయాని చెప్పిన అనంతరం.

తాత్పర్యం: ‘బ్రాహ్మణకులానికి అలంకార మైనవాడా! సూర్యుడికాంతి వంటికాంతి కలిగిన ఓ కచుడా! నీవు వినయవంతుడివి, అవివాహితుడవు. నేనుకూడ కన్యను (పెళ్ళికానిదానిని). నీకూ, నాకూ ఇంతకుముందే మన్మథుడి శక్తిచేత (నేను నిన్ను ప్రేమించటంవలన) పెళ్ళి అయిపోయింది. అందుచేత శుక్రుడిదయతో సంజీవనీవిద్యతోపాటుగా నన్ను స్వీకరించి, వివాహమాడి, నాకు ప్రీతి కలిగించుము’ అని దేవయాని చెప్పిన తరువాత.

విశేషం: నన్నయ రచనలో ప్రసాదగుణానికి ప్రసిద్ధమైన పద్యమిది. దేవయాని తన మనసులోని మాటను అనురాగంతో అకలుషంగా అవక్రంగా సూటిగా చెప్పే ఈపద్యంలో బంధశైథిల్యం, అర్థవైమల్యం పోషించబడటంతో శబ్దార్థ గుణాలను నన్నయ ప్రదర్శించి తన ప్రజ్ఞను చాటుకొన్నాడు. శుక్రుడినుండి సంజీవనీవిద్యను పొందాలంటే, అతడికి ప్రాణమైన దేవయానితో స్నేహంగా ఉండి, ఆమెమనసును మెప్పించాలని బృహస్పతియే ముందుగా కచుడికి సూచించి ఉన్నాడు. కచుడి రూపంతోపాటు, అతడి చనవుకూడా దేవయాని యందు అనురాగాన్ని మొలకెత్తింపచేసింది. ఆ అభిమానంతోనే రెండుసార్లు తండ్రిచేత అతడిని బ్రదికింపజేసింది. మొదట శుక్రుడు నిర్లిప్తంగా ఉండగా అన్నపానీయాలు మాని తండ్రిచేత కచుడి యోగక్షేమాలను ఆలోచించేట్లు చేసింది. దీనిని బట్టి కచుడు మొదట దేవయానిమనసు దోచుకొన్నట్లు, ఆపై శుక్రుడి మనసు గెలుచుకొన్నట్లు కథలోని అర్థాలు ప్రసన్నాలౌతున్నాయి. అయితే ఆమె తనమనసులోని రతిభావాన్ని కచునితో కాని, తండ్రితోకాని ఎన్నడూ చెప్పలేదు. దానికి కారణం కచుడి విద్యాభ్యాసం ముగియక పోవటమే. విద్య ముగిసిన తరువాత బ్రహ్మచారులైన విద్యార్థులు వివాహయోగ్యతను పొందుతారు. కాబట్టి ఆమె తనకోర్కెను కచుడు విద్యాభ్యాసం పూర్తిచేసి దేవలోకానికి బయలుదేరేంతవరకు బయటపెట్టలేదు. కాగా, ఇక కచుడు బయలుదేరేలోపలే తనకోర్కెను అతనికి చెప్పి, వెంటనే అతనిని దక్కించుకోవాలి. ఆ ఆత్రంతో మనసులోనిమాటను సూటిగా చెప్పినట్లు నన్నయ రచించాడు. కచుడి యందు తనమనసు లగ్నమైనది కాబట్టి వివాహమైనట్లే అని నిర్ణయించి చెప్పింది దేవయాని.

కచుడి అంగీకారాన్ని ఆమె అడగలేదు. దానికి కారణం అతడు తిరస్కరిస్తాడని ఆమె ఊహించలేదు. దానికి అతడు చూపుతున్న చనవుకూడ హేతువు కావచ్చును; లేదా- తండ్రిదగ్గర తనమాట అడ్డులేకుండా సాగేమాలిమి ఉన్నది కాబట్టి కచుడుకూడా తనకోర్కెను కాదనకుండా మన్నిస్తాడనే అధికారిక ప్రవృత్తికూడా బలమైనకారణం కావచ్చును. మృతసంజీవనీవిద్యను శుక్రుని దయతో ఏవిధంగా స్వీకరించావో అట్లాగే తననుకూడా స్వీకరించుమని కోరింది. ఇందులో కచుడే శుక్రుడిని అడిగి తనను వివాహమాడాలనీ, అడిగితే తండ్రికాదనకుండా తాను చూచుకుంటాననీ, తండ్రికి మృతసంజీవని ఎంత ప్రాణప్రదమో తానూ అంతేననీ, ఆరెండింటినీ పొందే అర్హత కచుడుమాత్రమే సాధించగలిగాడు కాబట్టి అతడే తనకు భర్త (భరింపదగినవాడు) కాదగినవాడనీ దేవయాని భావించింది. కన్యలో ఉదయించిన యౌవనంకంటె లజ్జ అతిశయించి ఉండటం సహజం. దేవయాని కన్య అయ్యును గడుసరి. తరువాతికథలో ఇది నిరూపింపబడుతుంది. మనసులు కలిసిన పెళ్ళి మన్మథుడే చేశా డని కచుడితో చెప్పిన దేవయాని పాణిగ్రహణం (చేయిపట్టి నూతినుండి లాగావు కాబట్టి) అయిందికాబట్టి నీకూనాకూ ఇదివరకే పెళ్ళి అయిపోయినట్లే అని యయాతితో చెప్పగలిగింది. ఆపెళ్ళిని తండ్రిచేత ఒప్పించి యయాతిచేత అంగీకరింపజేసింది. అంగీకరించని కచుడికి శాప మిచ్చింది; ప్రతిశాపాన్ని కూడా పొందింది. గారాబంగా పెరిగిన గడుసరి పిల్లలలో కానవచ్చే గూఢాహంకారం దేవయాని పాత్రకు జీవం. దానిని బీజంగా నాటాడు నన్నయ ఈపద్యంలో. (సంపా.)

క. ఆ కచుఁ డత్యంతవిషా ।
దాకులుఁ డై 'లోకనింద్య మగు నర్థము నీ
వాకునకుఁ దెచ్చు టుచితమె? ।
నాకు సహోదరివి నీవు నాచిత్తమునన్.' 34

ప్రతిపదార్థం: ఆ కచుఁడు= అత్యంత, విషాద+ఆకులుఁడు+ఐ= మిక్కిలి శోకంచేత కలత పొందిన వాడై; లోక, నింద్యము= లోకంచేత నిందించదగినది; అగు+అర్థము= అగునట్టి కోరిక (పని); నీ వాకునకున్= నీవాక్కునకు; తెచ్చుట+ఉచితము+ఎ= తెచ్చుట తగునా (తగదు); నా చిత్తమునన్= నాహృదయమందు; నీవు, నాకున్ సహోదరివి= గురుపుత్రిక వగుటచే తోడపుట్టిన దానివి, నేను నిన్ను సోదరిగా భావిస్తున్నాను.

తాత్పర్యం: దేవయాని తనను వివాహమాడు మని కోరగా కచుడు శోకంచేత కలత పొందినవాడై 'లోకంచేత నిందించదగినకోరిక నీవాక్కునకు తెచ్చుట తగునా? (పలకటం తగదు). గురుపుత్రివి అవటంచేత నా హృదయంలో నీవు సోదరివి. నేను నిన్ను చెల్లెలుగా భావిస్తున్నాను'.

విశేషం: కచుడు ధర్మబుద్ధికలవాడు కావటంచేత గురుపుత్రిని తోబుట్టువుగా భావించాడు. అగు+అర్థము= 'ఉదంత తద్ధర్మార్థ విశేషణమున కచ్చు పరమగుటచే 'ను' ఆగమము'= అగునర్థము. వాక్కు= 'దీర్ఘము మీది హల్లునకు ద్విత్వము బహుళము' - వాకు ఇచ్చట ద్విత్వము రాలేదు. తెచ్చుట+ఉచితమె= అత్తునకు సంధి ఐనది= తెచ్చుటుచితమె.

క. గురులకు శిష్యులు పుత్త్రులు ।
పరమార్థమ లోకధర్మపథ మిది; దీనిం
బరికింపక యీ పలుకులు ।
తరుణీ! గురుపుత్త్రి! నీకుఁ దగునే పలుకన్. 35

ప్రతిపదార్థం: తరుణీ= యువతీ; గురుపుత్త్రి= గురువుగారి కూతు రైన ఓ దేవయానీ!; గురులకున్; శిష్యులు; పుత్త్రులు= కుమారులు (పుత్ర సమానులు); పరమ+అర్థము+అ= ఉత్తమ మైన సత్యమే; ఇది= శిష్యులు గురువులకు పుత్రులన్నది; లోక; ధర్మ పథము= లోకంలోని ధర్మం యొక్క మార్గం; దీనిన్= ఈధర్మాన్ని; పరికింపక= చూడక; ఈ, పలుకులు= నన్ను వివాహ మాడుమన్న మాటలు; నీకున్, పలుకన్; తగును+ఏ= పలకటం తగునా (తగుదు).

తాత్పర్యం: యువతీ! గురుకుమారీ! గురువులకు శిష్యులు కొడుకులతో సమానులు. ఇది పరమసత్యం. లోక మనుసరించవలసిన ధర్మమార్గం. దీనిని చూడక (ఆలోచించక) నన్ను పరిగ్రహించు మని పలకటం నీకు ఉచితమా!

విశేషం: గురుపుత్రి అనే సంబోధన సాభిప్రాయం. సూక్తి అంటే సుభాషిత మనే అర్థం ఉన్నది. నన్నయ ఒక్కొకసారి పద్యాన్నంతా ఒక సుభాషితంగా రూపొందిస్తాడు. ఒక్కొకసారి పద్యంలోని భాగాన్ని సూక్తిగా చిత్రిస్తాడు. సామెతల వంటి వాక్యాలను పద్య పూర్వార్ధంలోకానీ, ఉత్తరార్ధంలోకానీ నిబంధించటం నన్నయ రచనాశిల్పంలోని ఒకమెలకువ. నిరంతరాధ్యాపకు డైన గురువు శిష్యుడికి తండ్రివంటివాడనే ధర్మం అది. 4.49 పద్యంలో గమనించవచ్చు.

వ. అనిన నా కచునకు దేవయాని కరం బలిగి 'నీవు నా మనోరథంబు విఫలంబుగాఁ జేసిన వాఁడవు; నీకు సంజీవని పని సేయకుండెడు' మని శాపం బిచ్చినఁ, గచుం 'డేను ధర్మపథంబుఁ దప్పనివాఁడను; నీ వచనంబున నాకు సంజీవని పనిచేయదయ్యెనేనియు నాచేత నుపదేశంబు గొన్నవారికిఁ బనిసేయుంగాక; మఱి నీవు ధర్మ విరోధంబు దలంచితివిగావున నిన్ను బ్రాహ్మణుండు వివాహంబు గాకుండెడు' మని దేవయానికిఁ బ్రతిశాపం బిచ్చి తత్‌క్షణంబ. 36

ప్రతిపదార్థం: అనినన్= అని కచుడు పలుకగా; దేవయాని; కరంబు= మిక్కిలి, అలిగి= కోపించి; నీవు; నా, మనోరథంబు= నా కోరిక; విఫలంబుగాన్= ఫలంలేని దానిగా; చేసిన వాఁడవు; నీకున్; సంజీవని= నా తండ్రినుండి నేర్చుకొనిన చనిపోయినవారిని బ్రతికించే సంజీవనీవిద్య; పని; చేయక+ఉండెడున్+అని= ఉపయోగపడకుండు గాక అని; శాపంబు+ ఇచ్చినన్= శాపమివ్వగా; కచుండు; ఏను= నేను; ధర్మపథంబున్= ధర్మమార్గాన్ని; తప్పని వాఁడను= దాటని వాడిని; నీ వచనంబునన్= నీ శాపంవలన; (పలుకుచేత) నాకున్; సంజీవని= సంజీవనీవిద్య; పని, చేయదు+ అయ్యెన్+ఏనియున్= పని చేయకపోయినా (భవిష్యదర్థకాన భూతకాలం); నా చేతన్; ఉపదేశంబు, కొన్న వారికిన్= ఉపదేశం పొందినవారికి; పని, చేయున్, కాక= ఉపయోగపడు గాక; మఱి= ఇంక; నీవు; ధర్మవిరోధంబు= ధర్మానికి వ్యతిరేక మైనపని; తలంచితివి; కావునన్; నిన్నున్; బ్రాహ్మణుండు; వివాహంబు, కాక+ఉండెడున్+అని= పెళ్ళాడకుండుగాక అని; దేవయానికిన్; ప్రతిశాపంబు= ఎదురుశాపం; ఇచ్చి; తత్+క్షణంబు+అ= ఆక్షణమందే (వెంటనే).

తాత్పర్యం: అని కచుడు పలుకగా దేవయాని మిక్కిలికోపించి 'నీవు నాకోరిక నిష్ఫలం చేశావు కాబట్టి నీకు సంజీవనీ విద్య ఉపయోగపడకుండును గాక' అని శాపమిచ్చింది. కచుడు 'నేను ధర్మమార్గాన్ని అతిక్రమించనివాడను. నీ శాపవచనంచేత నాకు సంజీవనీవిద్య పనిచేయక పోయినా నాచేత ఉపదేశం గ్రహించినవారికి పనిచేస్తుంది గాక. ఇంక నీవు ధర్మం కాని పని (సోదర ప్రాయు డైన తండ్రిశిష్యుడిని పెళ్ళాడా లని) తలపోశావు కాబట్టి నిన్ను బ్రాహ్మణుడు పెళ్ళాడకుండుగాక' అని ఎదురు(మారు) శాప మిచ్చి వెంటనే.

విశేషం: పని+చేయు= చకు సాదేశం; పనిసేయు. ఉండెడున్+అని= ఎడుతలద్రుతమున కచ్చుపర మగునపుడు మకారమౌతుంది; ఉండెడు మని. (ఆశీరర్థమున ఎడమ అగు నని కొందరి మతము. అప్పుడు ఎడమని అనే రూపం వస్తుంది.)

క. దేవగురునందనుం డమ ।
రావాసంబునకు నరిగి యమరులకును సం
జీవని యుపదేశించి, సు ।
ధీవినుతుఁ డొనర్చుచుండె దేవహితంబుల్. 37

ప్రతిపదార్థం: సుధీ, వినుతుఁడు= పండితులచేత స్తుతించబడినవాడు; దేవ, గురు, నందనుండు= దేవతలగురు వైన బృహస్పతి కుమారుడు (కచుడు); అమర+ ఆవాసంబు నకున్= దేవతలనివాసమైన స్వర్గానికి; అరిగి= వెళ్ళి;

అమరులకును= దేవతలకు; సంజీవని= సంజీవనీ విద్య; ఉపదేశించి= బోధించి; దేవహితంబున్= దేవతలకొరకు మేలును; ఒనర్చుచున్+ఉండెన్= చేయుచుండెను.

తాత్పర్యం: పండితులచేత స్తుతింపబడువాడూ బృహస్పతికుమారుడూ అయినటువంటి కచుడు దేవతల నివాస మైన స్వర్గానికి వెళ్ళి దేవతలకు సంజీవనీవిద్య ఉపదేశించి దేవతలకు మేలు చేస్తున్నాడు.

వ. ఇట వృషపర్వుకూఁతురు శర్మిష్ఠయను కన్యక యొక్కనాడు కన్యకాసహస్రపరివృతయయి దేవయానీ సహితంబు వనంబునకుం జని, యొక్క సరోవర తీరంబునఁ దమతమ పరిధానంబులు పెట్టి జలక్రీడ లాడుచున్న, నవి సురకరువలిచేతం బ్రేరితంబు లయి కలిసిన నొండొరులం గడవఁ గొలను వెలువడు సంభ్రమంబున నక్కన్యక లన్యోన్యపరిధానంబులు వీడ్వడం గొని కట్టునెడ దేవయానిపుట్టంబు శర్మిష్ఠ గట్టిన, మఱి దాని పరిధానంబు దేవయాని పుచ్చుకొనక రోసి శర్మిష్ఠం జూచి యి ట్లనియె.38

ప్రతిపదార్థం: ఇటన్= శుక్రుడుండే చోట, రాక్షసరాజధానిలో; వృషపర్వు+కూఁతురు= వృషపర్వు డనే రాక్షసరాజుకుమార్తె; శర్మిష్ఠ, అను కన్యక= శర్మిష్ఠ అనే పేరు గల కన్య; ఒక్కనాఁడు= ఒకరోజున; కన్యకా, సహస్ర, పరివృత, అయి= కన్యకల వేలచే, పలువురు కన్యలచేత చుట్టబడిం దై; దేవయానీ, సహితంబు= దేవయానితోకూడ; వనంబునకున్= అడవికి; చని= వెళ్ళి; ఒక్కసరోవర, తీరంబునన్= ఒక సరస్సు ఒడ్డున; తమ, తమ పరిధానంబులు= తమ తమ కట్టుబట్టలు; పెట్టి= ఉంచి; జలక్రీడలు= నీటియందాటలు; ఆడుచున్+ఉన్నన్= చేయుచుండగా; అవి= ఆ బట్టలు; సురకరువలిచేతన్= సుడిగాలిచేత; ప్రేరితంబులు+అయి= ప్రేరేపించబడినవై (ఎగురగొట్టబడినవై); కలిసినన్= కలిసిపోగా; ఒండు+ఒరులన్= ఒకరొకరిని; కడవన్= మించు నట్లుగ; కొలను= సరస్సునుండి (పంచమ్యర్థమున ప్రథమ); వెలువడు= బయటికి వచ్చే; సంభ్రమంబునన్= వేగిరిపాటుతో; ఆ+కన్యకలు= జలకేళిచేసిన కన్యలు; అన్యోన్య, పరిధానంబులు= ఒండొరుల వస్త్రాలు; వీడ్వడన్= మారుపడేటట్లుగా; కొని= గ్రహించి; కట్టు+ఎడన్= కట్టుకొనే సమయాన; దేవయాని పుట్టంబున్= దేవయాని వస్త్రాన్ని; (చీరను); శర్మిష్ఠ= రాక్షసరాజుకూతురు; కట్టినన్= కట్టుకొనగా; మఱి= అనంతరం; దాని, పరిధానంబు= ఆశర్మిష్ఠ వస్త్రాన్ని; దేవయాని; పుచ్చుకొనక= గ్రహించక; రోసి= అసహ్యించుకొని; శర్మిష్ఠన్; చూచి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పలికింది.

తాత్పర్యం: కచుడు వెళ్ళిపోయినతర్వాత శుక్రుడు ఉన్నచోట రాక్షసరా జైన వృషపర్వుడికూతురు శర్మిష్ఠ అనే పేరు గల కన్య వేలకొద్ది కన్యలచేత చుట్టబడి దేవయానితోకూడ అడవికి వెళ్ళింది. (ఉద్యానవనానికి వెళ్ళి) ఒక కొలనుఒడ్డున వారు తమ తమ కట్టుబట్టలు పెట్టి జలకేళి చేస్తుండగా ఆ బట్టలు సుడిగాలిచేత ఎగురగొట్టబడి కలిసిపోయాయి. ఆ కన్యలు ఒండొరులను మీరునట్లుగా సరస్సునుండి బయటికి వచ్చే తొందరలో ఒండొరుల చీరలు మారుపడేటట్లు గ్రహించి కట్టుకొనే సమయాన దేవయానిచీర శర్మిష్ఠ కట్టుకొన్నది. అప్పుడు ఆ శర్మిష్ఠ వస్త్రాన్ని దేవయాని గ్రహించక ఏవగించుకొని శర్మిష్ఠను చూచి ఇట్లా పలికింది.

విశేషం: మూలంలో ఆకన్యలవస్త్రాలను ఇంద్రుడు కలిపివేసిన ట్లున్నది. నన్నయ మార్చి సురకరువలిచే నవి కలిపివేయబడిన వని వ్రాయటం ఔచిత్యశోభితంగా ఉన్నది.

క. లోకోత్తరచరితుం డగు।
నా కావ్యతనూజ; నీకు నారాధిత; నేఁ
బ్రాకట భూసురకన్యక;।
నీకట్టిన మైల గట్ట నేర్తునె చెపుమా. 39

ప్రతిపదార్థం: లోక+ఉత్తర, చరితుండు+అగు= అసామాన్యచరిత్ర కలవా డైన; ఆ, కావ్య, తనూజన్= ఆ శుక్రుడి కూతురిని; నీకున్= శర్మిష్ఠకు; ఆరాధితన్= పూజింపబడిన (తగిన) దానిని; నేన్= నేను; ప్రాకట, భూసుర, కన్యకన్= ప్రసిద్ధి పొందిన బ్రాహ్మణ కన్యకను; నీకట్టిన= (కర్తృపద ప్రథమకు షష్ఠి) నీవు కట్టుకొన్న; మైల= మలిన వస్త్రాన్ని; కట్టన్, నేర్తున్+ఎ= కట్టుకో గలనా; చెపుము+ఆ= చెప్పుమా.

తాత్పర్యం: అసాధారణచరిత్రు డైన శుక్రుడికూతురిని, నీకు పూజనీయురాలిని, ప్రసిద్ధ మైన బ్రాహ్మణకులాన పుట్టినకన్యను అయిన నేను నీవు కట్టుకొన్న మలినవస్త్రాన్ని కట్టుకోగలనా? చెప్పుము.

విశేషం: అగు+ఆ= ఉదంత తద్ధర్మ విశేషణమున కచ్చు పర మైనప్పుడు నుగాగమం ఔతుంది; అగు నా కావ్య- అనుట వల్ల శుక్రుడి లోకోత్తరచరితత్వం వ్యక్తం చేయబడింది.

వ. అనిన శర్మిష్ఠ యి ట్లనియె. 40

తాత్పర్యం: దేవయాని అట్లా పలుకగా శర్మిష్ఠ ఇట్లా అన్నది.

క. మా యయ్యకుఁ బాయక పని ।
సేయుచు దీవించి ప్రియము సెప్పచు నుండున్
మీయయ్యఁ వెండి మహిమలు ।
నా యొద్దన పలుక నీకు నానయు లేదే?. 41

ప్రతిపదార్థం: మా అయ్యకున్= మాతండ్రి అయిన వృషపర్వుడికి; మీ అయ్య= మీ తండ్రి అయిన శుక్రుడు; పాయక= విడువక; పని, చేయుచున్, దీవించి= ఆశీర్వదించి; ప్రియము= ఇష్టము; చెప్పుచున్+ఉండున్= చెప్పుతూఉంటాడు; వెండి= మరియు; మహిమలు= గొప్పతనాలు; నా; ఒద్దన్+అ= నా దగ్గరే; పలుకన్= చెప్పటానికి; నీకున్; నానయున్= సిగ్గుకూడ; లేదు+ఏ= లేదా!

తాత్పర్యం: మీతండ్రి అయిన శుక్రుడు మాతండ్రి అయిన వృషపర్వుడిని విడువక సేవిస్తూ ఆశీర్వదించి ప్రియవాక్యాలు పలుకుతూ ఉంటాడు. మరి మీ గొప్పతనాలు నాదగ్గరే పలికేందుకు (పలకటానికి) నీకు సిగ్గుకూడ లేదా?

వ. 'నాకట్టిన పుట్టంబు నీకుం గట్టంగాదు గా కేమి' యని గర్వంబున నెగ్గులాడి దేవయాని నొక్కనూతం ద్రోచి, శర్మిష్ఠ కన్యకాసహస్రపరివృత యయి క్రమ్మఱి వచ్చి నిజనివాసంబున నుండె; నంత. 42

ప్రతిపదార్థం: నా, కట్టిన= నేను కట్టుకొన్న (కర్తృపద ప్రథమకు షష్ఠి); పుట్టంబు= వస్త్రం; నీకున్; కట్టన్, కాదు, కాక+ఏమి= కట్టుకొనరాదా ఏమి; అని; గర్వంబునన్= గర్వంతో; ఎగ్గులు+ఆడి= నిందలు పలికి; దేవయానిన్= దేవయానిని; ఒక్కనూతన్= ఒకనూతిలో; త్రోచి= త్రోసిపడేసి; శర్మిష్ఠ; కన్యకా, సహస్ర, పరివృత, అయి= కన్యలయొక్క వేయిచేత (పలువురు కన్యలచేత) చుట్టబడిన దై; క్రమ్మఱి వచ్చి= తిరిగివచ్చి; నిజనివాసంబునన్= తనయొక్క ఇంటిలో; ఉండెన్; అంతన్= పిమ్మట.

తాత్పర్యం: 'నేను కట్టుకొన్నవస్త్రం నీవు కట్టుకోరాదా ఏమిటి?' అని గర్వంతో నిందలాడి, దేవయానిని ఒక నూతిలో త్రోసివేసి, శర్మిష్ఠ వేయిమందికన్యకలతో కూడిన దై తిరిగివచ్చి తన గృహమందు ఉన్నది. పిమ్మట.

విశేషం: సహజంగా జరుగుతున్నట్లు చిత్రించే కథాసన్నివేశాలు కొన్ని భావికథార్థ వ్యంజకాలుగా నిబంధింపబడటం వస్తుధ్వని శిల్పం. సుడిగాలిచేత శర్మిష్ఠా దేవయానుల చీరలు కలిసిపోయినవి. దేవయానిచీర శర్మిష్ఠ ధరించటం, శర్మిష్ఠచీరను దేవయాని తిరస్కరించటం ఆ పాత్రల చిత్తవృత్తులకు నిదర్శనాలు. విశేష మేమంటే చీరెలు మారుపడిన ఇరువురూ భావికథలో యయాతికి భార్యలు(సవతులు) కానున్నారు. క్షత్రియవనిత పెండ్లాడదగిన యయాతిని శర్మిష్ఠకు దక్కకుండా దేవయాని తాను పొందగలుగుతుంది బలీయ మైన విధివలన (లేదా శాపంవలన). శర్మిష్ఠ వేయిమంది చెలికత్తెలతోసహా తనకు

దాస్యంచేసేటట్లు సాధించగలుగుతుంది. ఈ కథార్థాలకు బీజాలు ఇక్కడ ఉన్నాయి. చీరెలను కలిపిన గాలి విధి. వారిరువురు సవతు లయ్యే యోగం అందులో ధ్వని. చీరెలు యయాతికి భార్యలుగా ఉండే సతీత్వాలకు సంకేతాలు. క్షత్రియవనిత కట్టుకొనే చీరను తాను ధరించలేదు దేవయాని. భావికథలో శర్మిష్ఠ వలె దేవయాని యయాతి మనసు నాకర్షించలేదు. శుక్రుడి భయంవలన, దేవయాని గడుసరితనంవలన యయాతి ఆమెను కట్టుకొన్నాడే కాని సహజమైన వలపువలన కాదు. దేవయాని జాత్యహంకారవతి; శర్మిష్ఠ అభిమానవతి. పట్టింపువస్తే నూరుగురు చెలికత్తెలసాయంతో దేవయానిని పాడుబడినబావిలో పడవేయగలిగిన సమర్థురాలు శర్మిష్ఠ. తరువాతి కథలో తాను యయాతిని పెండ్లాడి, తనకుమారుడైన పూరుని గుణౌన్నత్యంవలన రాజమాత అయి తన బలాన్నీ బలగాన్నీ ప్రదర్శించుకొన్నది. దేవయానికిగల కోపం, అహంకారం, అసహనం, ఈర్ష్య, ప్రతీకారప్రవృత్తి అనేవి క్రమంగా ఆమెను గార్హస్థ్యసుఖాలకూ, భర్తకూ దూరంచేస్తాయి. ఈకథలో చీరెకట్టి సహనంతో, స్థైర్యంతో, అభిమానంతో నిలిచిన శర్మిష్ఠ చివరకు క్షత్రియోచిత విజయాన్ని సాధిస్తుంది. జాత్యహంకారం వలన దేవయాని రెండింటికి చెడ్డ రేవడి ఔతుంది. భర్తను తిరిగిపొందిన దేవయాని ఓడిపోయిన అహంకారిణి. ఆ భావికథార్థాలకు ఇప్పటి కథా సన్నివేశాలను వ్యంజకాలుగా సంయోజనచేయటం నన్నయ ప్రసన్నకథాకలితార్థ యుక్తి. (సంపా.)

యయాతి నూతంబడిన దేవయాని నుద్ధరించుట (సం. 1-73-14)

ఉ. ఆనహుషాత్మజుం డగు యయాతి యధిజ్యధనుస్సహాయుఁ డై
యానతశాత్రవుండు మృగయారసలోలనిబద్ధబుద్ధిఁ ద
త్కానన మెల్లఁ గ్రుమ్మఱి నికామధృతశ్రముఁ డేగుదెంచె నం
దానలినాక్షి యున్న విపినాంతర కూపతటంబునొద్దకున్. 43

ప్రతిపదార్థం: ఆనత, శాత్రవుండు= విధేయులైన శత్రువులు కలవాడు (శత్రువులను జయించిన వాడు); ఆ, నహుష= ఆత్మజుండు+అగు= ప్రసిద్ధుడైన నహుషుడి కుమారుడైన; యయాతి= మహారాజు; అధిజ్య, ధనుస్+సహాయుఁడు+ఐ= ఎక్కుపెట్టబడిన నారి కల విల్లు సహాయంగా గలవాడై; మృగయా, రసలోల, నిబద్ధ, బుద్ధిన్= వేట అనే వినోదమందు ఆసక్తి కలదియున్నూ, కట్టబడినదియున్నూ అయిన బుద్ధిగలవాడై; తద్, కాననము+ఎల్లన్= ఆ అడవిఅంతా; క్రుమ్మఱి= తిరిగి; నికామ, ధృత, శ్రముఁడు= మిక్కిలిగా పొందబడిన బడలిక గలవాడై; అందున్= ఆ అడవిలో; ఆ, నలిన+అక్షి= పద్మాలవంటి నేత్రాలు కలిగిన ఆదేవయాని; ఉన్న= పడియున్న; విపిన+అంతర, కూప, తటంబు, ఒద్దకున్= అడవినడుమ నున్న నూతి ఒడ్డు దగ్గరకు; ఏగుదెంచెన్= వచ్చెను.

తాత్పర్యం: ఓడించబడి విధేయులైన శత్రువులు కల ప్రసిద్ధుడైన నహుషుడి కుమారు డైన యయాతిమహారాజు వేట అనే వినోదమందు ఆసక్తిగల బుద్ధి కలవాడై, ఆ అడవి అంతా తిరిగి అధికంగా పొందబడిన శ్రమకలవాడై అక్కడ దేవయాని పడియున్న అడవిమధ్యలోని నూతిగట్టుదగ్గరకు వచ్చాడు.

విశేషం: ఆ, అను పదం ప్రసిద్ధ డనే అర్థాన్ని సూచిస్తుంది. తటంబు+ఒద్దకున్= షష్ఠీ సమాసమందు ఉకార ఋకారములకు అచ్చుపరమైనపుడు నుగాగమ మౌతుంది. తటంబు నొద్దకున్.

సీ. చనుదెంచి, యమ్మహాజనపతి జల మపే।
క్షించి, యచ్చో విశ్రమించి, చూచి,
తత్కూపమున విలసత్కూలఘనవల్లి।
యన్నిష్టసఖి నూఁదియున్న దాని,
గురుకుచయుగముపైఁ బరువడిఁ దొరఁగెడు।
కన్నీరు పూరించుచున్న దానిఁ,
దనసమీపమునకు జనుల యాగమనంబు।
పన్నుగాఁ గోరుచునున్న దాని,

ఆ. వరుణదేవుతోడఁ గర మల్గి జలనివా।
సంబు విడిచి భూస్థలంబువలని
కరుగుదేర నున్న వరుణేంద్రుదేవియ।
పోనిదాని దేవయానిఁ గనియె. 44

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; ఆ+మహత్, జనపతి= ఆ గొప్పరాజు (యయాతి); జలము= నీరు; అపేక్షించి= కోరి; అచ్చోన్= అచ్చట; విశ్రమించి= బడలిక తీర్చుకొని; చూచి; తద్+కూపమునన్= ఆనూతియందు; విలసత్, కూల, ఘన, వల్లి= ప్రకాశిస్తున్న ఒడ్డునందలి గొప్పతీగ; అను, ఇష్టసఖిన్= అనెడి ఇష్టురా లైన చెలికత్తెను; ఊఁది, ఉన్నదానిన్= పట్టుకొని ఉన్నదానిని; గురు, కుచయుగముపైన్= పెద్దస్తనాల జంటపై; పరువడిన్= క్రమంగా; తొరఁగెడు= కారెడు; కన్నీరు= బాష్పజలం; పూరించుచున్+ ఉన్నదానిన్= నిండిస్తున్నదానిని; తన సమీపమునకున్= తన దగ్గరకు; జనుల= జనాల యొక్క; ఆగమనంబు= రాక; పన్నుగాన్= ఒప్పుగా; కోరుచున్+ఉన్నదానిన్= కోరుతున్న దానిని; వరుణదేవుతోడన్= పడమటి దిక్కునకు రా జైన వరుణదేవుడితో (వరుణదేవుడు జలాధిదేవత); కరము= మిక్కిలి; అల్గి= కోపించి; జలనివాసంబు= జలమందు నివసించటం విడిచి; భూస్థలంబు, వలనికిన్= భూప్రదేశం దిక్కుకు; అరుగుదేరన్, ఉన్న= వచ్చేందుకు సిద్ధంగా ఉన్న; వరుణ+ఇంద్రు, దేవి+అ= వరుణదేవుడి భార్యనే (వరుణుడి పట్టమహిషిని); పోనిదానిన్= పోలినదానిని; దేవయానిన్; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: వచ్చి, ఆ యయాతిమహారాజు నీరు కోరి, అక్కడ విశ్రాంతి గైకొని, చూచి, ఆనూతిలో ఒప్పుతున్న ఒడ్డునం దున్న గొప్పలత అనే ఇష్టసఖిని (రూపకాలంకారం) పట్టుకొన్న దానిని, పెద్దవైనస్తనయుగ్మంపై క్రమంగా జారు కన్నీటిని నింపుతున్నదానిని తనవద్దకు జనులరాకను ఒప్పుగా కోరుతున్నదానిని, వరుణదేవుడితో మిక్కిలి కోపించి జలమందలి నివాసాన్ని విడిచి భూప్రదేశందిక్కుకు రానున్న వరుణుడిపట్టమహిషిని పోలినదానిని దేవయానిని చూచాడు.

విశేషం: అలం: ఉపమాలంకారం: ఉత్ప్రేక్ష అనికూడ చెప్పవచ్చును. వరుణుఁడు జలాలకు రాజు. అందుచేత అతడిభార్య జలంలోనే నివసిస్తుంది. తీగను పట్టుకొని యున్న దేవయాని- భర్తమీద కోపించి భూప్రదేశందిక్కుకు రానున్న వరుణుడి పట్టమహిషేమో అన్నట్లున్నది. ఆ+చోటన్= అచ్చోట= త్రికసంధి. ఉత్తర పదమగు చోట శబ్దము టాక్షరము లోపంబు విభాష నగును. చోటుశబ్దము యొక్క సప్తమీ విభక్తి చోటన్. అను+ఇష్టసఖి= అను అనెడి ఉదంత తద్ధర్మ విశేషణమునందలి ఉకారము లోపించగా 'అన్' ఔతుంది. ఇచ్చట ఈ నకారానికి అచ్చుపరమైనందువలన నకారానికి ద్విత్వం వచ్చింది. కొందరు ఇది ద్రుతద్విత్వ సంధి అని చెప్తారు. కాని అన్ లోని నకారం ద్రుతం కాదు - మరి కొందరు అన్న+ఇష్టసఖి అని విడదీస్తారు. 'అరుగుదెంచు' ధాతువుకు తుమున్నర్థకం అరుగుదేరన్, నన్నయ వర్ణించేటప్పుడు విశేషణాలతర్వాత దాని, దాని అని ఉపయోగించటం పెక్కుచోట్ల కానవస్తుంది. ఈ పద్యం చూచి చిత్రకారుఁడు చిత్రాన్ని గీయవచ్చును. నన్నయవర్ణనలు చిత్రకారుడిచిత్రం వలె ఏకైకవిన్యాసాన్ని సూచిస్తా యని విమర్శకులు చెప్తారు. రసపోషకంగా అలంకారాన్ని ప్రయోగించటం, నిర్వహించటం, విడవటం, అవసరం వస్తే మిక్కిలిగా నిర్వహించకపోవటం అనే పద్ధతులు ధ్వనిమార్గవర్తులైన కవులు పాటిస్తారు. నన్నయ ఇక్కడ శోకిస్తున్న శృంగార విభావాన్ని వర్ణిస్తూ అలంకారాన్ని మిక్కిలిగా నిర్వహింపకపోవటం గమనార్హం. 'విలసత్కూపఘనవల్లి యన్నిష్టసఖి నూఁదియున్నదాని' అన్నచోట రూపకం వాడి, దానిని వదలి ఆమెరూపంకంటె దుఃఖాన్ని ఎక్కువగా వర్ణించి, ఎత్తుగీతలో 'వరుణదేవేంద్రుదేవియపోనిదాని' అని ఉపమాలంకారాన్ని నిర్వహించాడు నన్నయ. ఇక్కడ అలంకారం క్రమంగా వస్తువును భావాన్నీ ధ్వనింపచేస్తున్నది.

వ. కని 'నీ వెవ్వరిదాన? వి ట్లేల యేకతంబ యివ్విపినాంతరకూపంబున నున్న దాన?' వనిన విని దేవయాని యెప్పుడుం దమ విహరించుచున్న యవ్వనంబునకు మృగయావినోదార్థంబు యయాతి వచ్చుటంజేసి తొల్లియుఁజూచినది కావున నాతని నెఱింగి యి ట్లనియె. 45

ప్రతిపదార్థం: కని= దేవయానిని చూచి; నీవు; ఎవ్వరిదానవు= ఎవరికి సంబంధించిన దానివి; ఇట్లు= ఈవిధంగా; ఏల= ఎందుకు; ఏకతంబు+అ= ఒంటరిగా; ఈవిపిన+ అంతర, కూపంబునన్= ఈ అడవిమధ్య ఉన్న నూతియందు; ఉన్నదానవు; అనినన్= అని యయాతి అడుగగా; విని; దేవయాని; ఎప్పుడున్= ఎల్లప్పుడును (అంతకు ముందు); తమ, విహరించుచున్+ఉన్న= తాము విహారం చేస్తూఉండే; ఆ+ వనంబునకున్= ఆ అడవికి; మృగయా, వినోద+అర్థంబు= వేట అనే వినోదం (వేడుక) నిమిత్తం; యయాతి, వచ్చుటన్ చేసి= వస్తూ ఉండటంచేత; తొల్లియున్= పూర్వం కూడ; చూచినది; కావునన్; అతనిన్= యయాతిని; ఎఱింగి= తెలిసికొని, గుర్తించి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: యయాతి దేవయానిని చూచి 'నీవు ఎవతెవు? ఈవిధంగా ఒంటరిగా ఈ అడవినడుమ ఉన్న నూతియందు ఎందుకు పడియున్నావు?' అని అడుగగా దేవయాని విని ఎప్పుడూ తాము విహరించే ఆ అడవికి వేటవేడుక కొరకు వస్తూ ఉండ టంవలన, అంతకుముందుకూడ అతడిని చూచిఉన్నది కాబట్టి గుర్తించి ఇట్లా పలికింది.

తరలము.

> **అమరసన్నిభ! యేను ఘోరసురాసురాహవభూమి న**
> **య్యమరవీరులచేత మర్దితు లైన దానవులన్ గత**
> **భ్రములఁగాఁ దన విద్యపెంపునఁ బ్రాప్తజీవులఁ జేసి య**
> **త్యమితశక్తిమెయిన్ వెలింగినయట్టి భార్గవుకూఁతురన్.** **46**

ప్రతిపదార్థం: అమర, సన్నిభ= దేవతలతో సమానమైనవాడా!; ఏను= నేను; ఘోర, సుర+అసుర+ఆహవభూమిన్= భయంకరమైన దేవరాక్షసుల యుద్ధరంగంలో; ఆ+అమరవీరులచేతన్= వీరు లైన ఆ దేవతలచేత; మర్దితులు+అయిన= చంపబడిన; దానవులన్= రాక్షసులను; గత, భ్రములన్, కాన్= పోయినభ్రమ కలవా రగునట్లుగా; తన విద్య పెంపునన్= సంజీవని అనే తనవిద్యయొక్క గొప్పతనంచేత; ప్రాప్తజీవులన్; పొందబడిన జీవం (ప్రాణం) కలవారినిగా; చేసి; అతి+అమిత, భక్తిమెయిన్= మిక్కిలి అధిక మైన శక్తితో; వెలింగిన+అట్టి= ప్రకాశించినట్టి; భార్గవు= శుక్రుడియొక్క; కూఁతురన్= కుమార్తెను.

తాత్పర్యం: దేవతాసమానుడి మైన ఓ యయాతీ!. నేను భయంకర మైన దేవరాక్షసుల యుద్ధరంగంలో వీరు లైన దేవతలచేత చంపబడిన రాక్షసులను తన సంజీవనీ విద్యాప్రభావంచేత భ్రమతొలగినవారినిగాను, ప్రాణవంతులను గాను చేసి అత్యధిక మైన శక్తితో ప్రకాశించిన శుక్రుడికుమార్తెను.

విశేషం: గతభ్రములఁగా అనేచోట జితశ్రములఁగా అన్న పాఠ మున్నది. అనగా జయించబడినశ్రమ కలవారినిగా అని అర్థం: ఈ పాఠంకూడా ఉచితంగానే ఉన్నది. అతి+అమిత= అత్యమిత- యణాదేశసంధి. కూఁతు శబ్దము ప్రథమైక వచనమునకు రు వర్ణ మగును. కూఁతురు. ఇది అస్మద్విశేషణ మగుటచే ను అంతాగమముగా వచ్చినది. ఈ ఆగమానికి ముందు ఉత్వం అత్వమైనది. కూతురన్. తరలవృత్తానికి ప్రతిపాదంలోనూ న-భ-ర-స-జ-జ-గ అనే గణా లుంటాయి. 12వ అక్షరం యతిస్థానం. ఇందలి మొదటి రెండులఘువులను ఒకగురువుగా చేస్తే మత్తకోకిలపాదమౌతుంది. అప్పుడు గణాలు "ర,స,జ,జ,భ,ర" అవుతాయి.

వ. 'దేవయాని యనుదానఁ బ్రమాదవశంబున నిన్నూతం బడి వెలువడ నేరకున్నదానను; న న్నుద్ధరించి రక్షింపు' మనిన నవ్విప్రకన్యకయందుఁ దద్దయు దయాళుం డై. **47**

ప్రతిపదార్థం: దేవయాని యనుదానన్; ప్రమాదవశంబునన్= ఏమరుపాటు కారణాన; ఈ+నూతన్= ఈ నూతియందు; పడి; వెలువడన్, నేరక+ ఉన్నదానను= పైకి రాజాలకున్నాను (రాలేకపోతున్నాను); నన్నున్, ఉద్ధరించి= పైకి తీసి; రక్షింపుము= కాపాడుము; అనినన్= అని పలుకగా; ఆ+విప్రకన్యక,

అందున్= బ్రాహ్మణుడి (శుక్రుడి) కుమార్తె అయిన ఆ దేవయానియందు; తద్దయున్= మిక్కిలి; దయాళుండు+ఐ= దయకలవా డయి.

తాత్పర్యం: నేను దేవయాని అనే పేరుకలదానిని. ఏమరుపాటు కారణాన ఈ నూతిలో పడి పైకి రాలేకున్నాను. నన్ను పైకి తీసి రక్షించు మని పలుకగా ఆ బ్రాహ్మణకన్య అయిన దేవయానియెడల మిక్కిలిదయ కలవాడై.

విశేషం: 'అది శబ్దమునకు వునులు పరంబగునపుడును సంబోధనంబునందు దాన అన్న దాదేశం బగును'. అను+అది+ను= అనుదానను. దేవయాని ప్రమాదవశాన నూతిలో పడలేదు; శర్మిష్ఠ ఆమెను త్రోసింది. కాని, ఆమె ఈవిధంగా చెప్పటం ఆమె గడుసుతనాన్ని సూచిస్తుంది. శుక్రాచార్యుడికూతుర నని చెప్పుకొని ఆమె తన అభిజాత్యాన్ని చెప్పుకొన్నది. తన పాటుకు కారణంచెప్పకుండ, యయాతిపై కలిగిన అభిలాషకు ప్రతిఫలంగా అతని ఆదరాభిమానాలను పొందాలనుకోవటం అట్లా మాటాడటంలో కల వస్తుధ్వని.

చ. జలధివిలోలవీచి విలసత్కలకాంచి సమంచితావనీ
తలవహనక్షమం బయిన దక్షిణహస్తమునం దదున్నమ
ద్గళదురఘర్మవారికణక్రమకరాబ్జము వట్టి నూతిలో
వెలువడఁ గోమలిం దిగిచె విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్. 48

ప్రతిపదార్థం: విశ్రుతకీర్తి= ప్రసిద్ధమైనకీర్తి కల యయాతి; జలధి, విలోల, వీచి, విలసత్, కల, కాంచి, సమంచిత+అవనీ, తల, వహన, క్షమంబు+అయిన= సముద్రంయొక్క చలించే తరంగా లనబడే ప్రకాశిస్తున్న మధురంగా మ్రోగే ఒడ్డాణంతో కూడిన భూతలాన్ని భరించటంలో సమర్థ మైన; దక్షిణ హస్తమునన్= కుడిచేతితో; తద్+ ఉన్నమత్+గళత్+ఉరు, ఘర్మ, వారి, కణ, క్రమ, కర+అబ్జము= ఆ దేవయాని యొక్క పైకెత్తబడు తున్నట్టియూ, జారుతున్న అధికమైన చెమట బిందువులచేత సుందరమై నట్టియూ పద్మము వంటిచేతిని; పట్టి= గ్రహించి; నూతిలోన్= నూతినుండి; వెలువడన్= బయటికి

వచ్చునట్లుగా; కోమలిన్= మృదు వైన శరీరం కల దేవయానిని; ప్రీతితోన్= ప్రేమతో; తిగిచెన్= లాగెను (పైకిలాగాడు).

తాత్పర్యం: ప్రసిద్ధ మైన కీర్తి గల యయాతి సముద్రంయొక్క చలించే తరంగాలనే మధురమైన ధ్వని కలిగిన ఒడ్డాణంతో కూడిన ధరణీతలాన్ని వహించే శక్తి గల కుడిచేతితో పైకెత్తబడినదియూ, జారుతున్న అధికమైన చెమటబిందువులతో అంద మైనదీ అయిన దేవయాని పద్మంవంటిచేయిని పట్టుకొని నూతినుండి పైకి వచ్చేటట్లుగా ప్రీతితో పైకి తీశాడు.

విశేషం: అలం: వృత్త్యనుప్రాసం, రూపకం. యయాతి దేవయానియొక్క కరాబ్జము పట్టుకొనటం ముందు జరుగబోతున్న పాణిగ్రహణాన్ని సూచిస్తుంది. దేవయాని హస్తం చెమటబిందువులతో తడిసి ఉండటంవలన పద్మంగా రూపించటం సముచితం. యయాతి కుడిచేయి భూభారవహనక్షమ మైనది కాబట్టి దిగ్గజముయొక్క తుండంవలె నున్నదని భావించటానికి వీలున్న 'హస్త' శబ్దం వాడటం సార్థకం. దేవయానియందు ఉదయించిన అభిలాషవలన కలిగిన సాత్త్వికభావోదయంగా హస్తంమీది స్వేదాన్ని నన్నయ వర్ణించి ధ్వనింపజేశాడు. అది కరగ్రహణంచేత పరిపుష్టి చెందింది. వర్ణ్యవస్తు స్వరూపస్వభావ వ్యంజకాలైన అక్షరాలను రచనలో వాడి శయ్యాసౌందర్యాన్ని పోషించే అక్షరరమ్యతకు ఈ పద్యం రమణీయోదాహరణం. నూతిలో వెలువడ= నూతినుండి బయటికి వచ్చేటట్లు ఇక్కడ షష్ఠీవిభక్తి పంచమ్యర్థంలో వాడబడింది.

వ. ఇట్లు దేవయాని నుద్ధరించి నిజపురంబున కరిగె; నిట దేవయానియు శర్మిష్ఠసేసిన యెగ్గువలన విముక్తయయి తన్ను రోయుచు వచ్చుదాని ఘూర్ణిక యను పరిచారికం గని 'యేను వృషపర్వుపురంబు సొర నొల్ల; శర్మిష్ఠ చేత నా పడిన యవమానంబు మదీయ జనకున కెఱింగింపు' మని పంచిన, నదియును నతిత్వరితగతిం జని తద్వృత్తాంతం బంతయు శుక్రునకుం జెప్పిన, శుక్రుండును నాక్షణంబ వచ్చి కోప ఘూర్ణిత బాష్ప పూరితనయన యై యున్న దేవయానిం గని యి ట్లనియె. 49

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; దేవయానిన్; ఉద్ధరించి= పైకి తీసి; నిజపురంబు నకున్= తన పట్టణానికి; అరిగెన్= యయాతి వెళ్ళాడు. ఇటన్= ఇచ్చట; దేవయానియున్= దేవయానికూడ; శర్మిష్ఠ, చేసిన= వృషపర్వుడి కూతు రైన శర్మిష్ఠ చేసిన; ఎగ్గువలనన్= కీడువలన; విముక్త+అయి= విడువబడినదై; తన్నున్= దేవయానిని; రోయుచున్+వచ్చు, దానిన్= వెదకుతూ వస్తున్న దానిని; ఘూర్ణిక అను పరిచారికన్= ఘూర్ణిక అన్న పేరు కల సేవకురాలిని; కని= చూచి; ఏను= నేను; వృషపర్వు, పురంబు= వృషపర్వు డనే రాక్షస రాజు పట్టణాన్ని; చొరన్+ఒల్లన్= ప్రవేశించటానికి అంగీకరించను; శర్మిష్ఠచేతన్; నా పడిన= (కర్తృపదప్రథమ కుషష్ఠి) నేను పొందిన; అవమానంబు= పరాభవం; మదీయ జనకునకున్= నాతండ్రి యైన శుక్రుడికి; ఎఱింగింపుము= తెల్పుము; అని, పంచినన్= అని పంపగా; అదియునున్= ఆ ఘూర్ణికయును; అతి త్వరితగతిన్= మిక్కిలి వేగంతో కూడిన గమనంతో; చని= వెళ్ళి; తద్, వృత్తాంతంబు+ అంతయున్= దేవయానికి జరిగిన అవమాన విషయమంతా; శుక్రనకున్; చెప్పగా; శుక్రుండునున్= శుక్రుడు కూడ; ఆ క్షణంబు+అ= ఆక్షణ మందే; వచ్చి; కోప, ఘూర్ణిత, బాష్ప, పూరిత, నయన, అయి, ఉన్న= కోపంచేత తిరుగుడు పడినట్టియున్నూ, కన్నీటితో నిండినట్టియున్నూ నేత్రాలు కలదై ఉన్న; దేవయానిన్; కని= చూచి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఈవిధంగా దేవయానిని నూతినుండి పైకి తీసి యయాతి తనపట్టణానికి వెళ్ళాడు. ఇక్కడ దేవయాని కూడా శర్మిష్ఠ తనకు చేసిన కీడువలన విడువబడినదై తనను వెదకుతూ వస్తున్న ఘూర్ణిక అనే పేరు కలదానిని చూచి 'నేను వృషపర్వుడి పట్టణంలో ప్రవేశించటానికి అంగీకరించను; శర్మిష్ఠచేత నేను పొందిన అవమానం నా తండ్రికి తెలుపుము' అని పంపగా, ఘూర్ణికకూడా మిక్కిలివేగంతో కూడిన గమనంతో వెళ్ళి జరిగిన వృత్తాంతమంతా శుక్రుడికి చెప్పింది. శుక్రుడుకూడ తత్క్షణమే

వచ్చి, కోపంచేత తిరుగుడు పడినట్టి, కన్నీటితో నిండినట్టి నేత్రాలు కలదై ఉన్న దేవయానిని చూచి యిట్లా పలికాడు.

క. **అనుపమ నియమాన్వితు లై।**
యనూనదక్షిణలఁ గ్రతుసహస్రంబులు సే
సినవారికంటె నక్రో।
ధనుఁడ గరం బధికుఁ డండ్రు తత్త్వవిధిజ్ఞుల్. 50

ప్రతిపదార్థం: అనుపమ, నియమ+అన్వితులు+అయి= సాటిలేని నియమంతో కూడిన వా రై; అనూన, దక్షిణలన్= అధికము లయిన దక్షిణలతో (సంభావనలతో); క్రతు, సహస్రంబులు= యజ్ఞములు వేలు; చేసిన వారికంటెన్; అక్రోధనుఁడు+అ= కోపశీలం లేనివాడే; కరంబు= మిక్కిలి; అధికుఁడు= గొప్పవాడు; అని; తత్త్వవిధిజ్ఞుల్= పరమార్థ మెఱిఁగినవారు; అండ్రు= అందురు (అంటారు).

తాత్పర్యం: సాటి లేని నియమంతో కూడినవా రై గొప్పదక్షిణలతో వేలకొద్దీ యజ్ఞాలు చేసినవారికంటెకూడ కోపం లేనివాడే మిక్కిలిగొప్పవా డని పరమార్థం తెలిసినవారు చెప్తారు.

విశేషం: నన్నయ సూక్తులలో ఇది ఒకటి. అను+దురు, తిదుటలు పరంబు లగునపుడు అన్వాదుల'ను' స్థానమున సున్న యగును- అందురు. ఇట బిందువు మీది తదలకు నిత్య వైకల్పికంబులయి టడ లగును- అందురు. ఉత్వలోపము- అండ్రు.

క. **అలిగిన నలుగక, యెగ్గులు।**
పలికిన మఱి విననియట్ల ప్రతివచనంబుల్
వలుకక, బన్నము వడి యెడఁ।
దలఁపక యు న్నతఁడె చూవె ధర్మజ్ఞుఁ డిలన్. 51

ప్రతిపదార్థం: అలిగినన్= ఇతరులు కోపించగా; అలుగక= కోపించక; ఎగ్గులు, పలికినన్= నిందావాక్యాలు పలుకగా; మఱి= అనంతరం, విని, అట్లు+అ= ఆ నిందావాక్యాలు వినని విధంగానే; ప్రతివచనంబుల్= మారుమాటలు; పలుకక; బన్నము= అవమానము; పడి= పొంది; ఎడన్= హృదయమందు; తలఁపక= దానిని తలపకుండగనే; ఉన్న+అతఁడు+అ+చూవె= ఉన్నవాడే సుమా; ఇలన్= భూమియందు; ధర్మజ్ఞుఁడు= ధర్మం తెలిసినవాడు.

తాత్పర్యం: ఇతరులు కోపిస్తే కోపించకుండా, ఇతరులు నిందలు పలికితే మరి వాటిని విననట్లే మారుపలుకక, అవమానం పొందికూడా హృదయమందు తలవకుండా ఉన్నవాడే సుమా భూమియందు ధర్మ మెరిగినవాడు.

విశేషం: ఇదికూడ నన్నయ సూక్తులలో ఒకటి. చూవె - చుమా యొక్క సంక్షిప్తరూపం.

వ. 'కావున బుద్ధి గలవారికిఁ గ్రోధంబు గొనియాడం దగదు; శర్మిష్ఠ రాచకూఁతురు; గొండుక యది; దానితోడి దేమి ర' మ్మనిన దేవయాని యిట్లనియె. 52

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; బుద్ధి, కలవారికిన్= బుద్ధిమంతులకు; క్రోధంబు= కోపము; కొని, ఆడన్, తగదు= పొగడుట యుక్తం కాదు; శర్మిష్ఠ; రాచకూఁతురు= రాజుగారి కూతురు; కొండుక+అది= చిన్నది; దానితోడి+అది+ఏమి= దానితో ఏమి; రమ్ము; అనినన్= అని శుక్రుఁడు పిలువగా; దేవయాని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'కాబట్టి బుద్ధిమంతులకు కోపాన్ని పొగడటం తగదు. అంటే కోపం మంచి దని పొగడటం యుక్తం కాదు. శర్మిష్ఠ; రాజకుమారి, వయసులో చిన్నది. దానితో ఏమిటి! (అంటే అది చేసిన పని లెక్కచేయ కూడదు) ఇంటికి రా' అని శుక్రుడు పలుకగా దేవయాని ఇట్లా అన్నది.

విశేషం: తోడన్+అదితోడిది= 'సమాసముల చేత తోడ వలనల కిత్వమగును. అది, శబ్దముల అత్తునకు వృత్తిని లోపంబు బహుళముగా నగును.

క. కడు ననురక్తియు నేర్పును।
గడఁకయు, గలవారి నుఱక కడవఁగ నెగ్గుల్
నొడివెడు వివేకశూన్యుల।
కడ నుండెడు నంతకంటెఁ గష్టము గలదే. 53

ప్రతిపదార్థం: కడున్= మిక్కిలి; అనురక్తియున్= ప్రేమయు; నేర్పును; కడఁకయున్= యత్నమును (పూనికయును); కల, వారిన్; ఉఱక= లక్ష్యము చేయక, కడవఁగన్= మేర మీరునట్లుగ; ఎగ్గుల్= నిందలు; నుడివెడు= పలికెడి; వివేకశూన్యుల కడన్= జ్ఞానహీనులవద్ద; ఉండెడు, అంతకంటెన్= నివసించేదానికంటె; కష్టము= నీచత్వం; కలదు+ఏ= ఉన్నదే; లేదని భావం.

తాత్పర్యం: మిక్కిలి అనురాగమూ, నేర్పూ, పూనికయు, కలవారిని లక్ష్యపెట్టక మేరమీరేటట్లుగా నిందలు పలికేజ్ఞాన హీనులవద్ద నివసించటంకంటె నైచ్యం వేరుగా గలదా! లేదు.

వ. 'ఈవృషపర్వుపురం బేను జొరనొల్ల; నెట యేనియుం బోదు' ననిన శుక్రుండు 'నాకు నీవ గతివి. నీతోడ నేనును వత్తు' ననుచుఁగూఁతుం బట్టువఱుచు చున్నంత, నంతయుఁజారులవలన నెఱింగి వృషపర్వుండు శుక్రునొద్దకు వచ్చి నమస్కరించి యి ట్లనియె. 54

ప్రతిపదార్థం: ఈ, వృషపర్వు, పురంబు= ఈ వృషపర్వుడి యొక్కపట్టణం; ఏను= నేను, చొరన్+ఒల్లన్= ప్రవేశించ నంగీకరించను; ఎట, ఏనియున్= ఎక్కడికైనా, పోదున్= వెళతాను; అని= అని దేవయాని పలుకగా; శుక్రుండు; నాకున్; నీవు+అ= నీవే; గతివి= దిక్కు; నీతోడన్; నేనును= నేనుకూడా; వత్తున్= వస్తాను; అనుచున్= అని పలుకుతూ; కూఁతున్= కూతురిని; పట్టువఱుచుచున్; ఉన్న, అంతన్= అను నయిస్తుండగా (ఓదారుస్తుండగా);

అంతయున్= జరిగిన విషయమంతా; చారులవలనన్= వేగులవారివలన; ఎఱింగి= తెలిసికొని; వృషపర్వుండు= రాక్షసరాజు; శుక్రు+ఒద్దకున్= శుక్రుడి దగ్గరకు; వచ్చి; నమస్కరించి= మ్రొక్కి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'ఈ వృషపర్వుడిపట్టణంలో నేను ప్రవేశించటానికి అంగీకరించను. మరి ఎక్కడికైనా వెడతాను' అని దేవయాని పలుకగా శుక్రుడు 'నాకు నీవే దిక్కు, నీతో నేను కూడా వస్తా' నని కూతురిని ఓదారుస్తుండగా, ఈ విషయమంతా వేగులవారివలన తెలిసికొని, రాక్షసరాజైన వృషపర్వుడు శుక్రుడివద్దకు వచ్చి నమస్కరించి ఇట్లా పలికాడు.

ఉ. దేవతలన్ జయించుచు నతిస్థిరసంపదలం ద్వదీయవి
ద్యావిభవంబు పెంపునన దానవు లుద్ధతు లైరి; కానినాఁ
డీ వనరాశిలోఁ జొరరె యింతకు నంతకకోపు లైన య
ద్దేవపతాకినీపతుల దివ్యనిశాతమహాయుధాహతిన్. 55

ప్రతిపదార్థం: దేవతలన్= దేవతలను; జయించుచున్; అతిస్థిర, సంపదలన్= మిక్కిలి స్థిరమైన సంపదలతో; త్వదీయ, విద్యావిభవంబు, పెంపునన్+అ= నీయొక్క విద్యయొక్క వైభవం యొక్క గొప్పతనం చేతనే; దానవులు= రాక్షసులు; ఉద్ధతులు+ఐరి= గర్వించినవా రైనారు; కాని, నాఁడు= అది లేనప్పుడు; అంతక, కోపులు+అయిన= యముడియొక్క కోపం వంటి కోపం కలవారైన; ఆ+దేవ, పతాకినీ, పతుల= ఆ దేవతలసేనా నాయకుల యొక్క; దివ్య, నిశాత, మహత్, ఆయుధ, ఆహతిన్= దేవతా సంబంధులూ, వాడివియూ అయిన గొప్పఆయుధాల దెబ్బచేత, ఇంతకున్= ఈ పాటికే; ఈవన రాశిలోన్= ఈ సముద్రంలో; చొరరు+ఎ= ప్రవేశించరా! ప్రవేశిస్తా రని భావం.

తాత్పర్యం: నీ విద్యా మహత్త్వంయొక్క గొప్పతనం చేతనే దేవతలను జయిస్తూ మిక్కిలి స్థిరమైన సంపదలతో రాక్షసులు గర్వం కలవా రైనారు కానిచో, (ఆ విద్యలేనపుడు) యముడికోపంవంటి కోపం కలవా రైన ఆ

దేవతా సేనాపతుల దివ్య మైనవీ, వాడి అయినవీ అయిన గొప్పఆయుధాల దెబ్బలచేత ఈసముద్రంలో ప్రవేశించి ఉండరా! అంటే మరణించి ఉండరా? అని భావం.

విశేషం: ఇంతకు నంతక కోపులు - ఇచ్చట ఛేకానుప్రాసం కలదు. వృషపర్వుడు చెప్పిన దంతా సత్యమే. శుక్రుడి మృతసంజీవనీ విద్య లేకుంటే దేవతలు రాక్షసులను చంపి ఉండేవారే; లేకుంటే భయంతో రాక్షసులు సముద్రంలో దాగి ఉండేవారే. వస్తు స్వభావస్ఫుటత్వంతో కూడుకొన్న ఝటిత్యర్థప్రతిపత్తికి హేతు వైన రచన కల ఈపద్యంలో అర్థవ్యక్తి అనే శబ్దగుణం పోషించబడింది. (సంపా.)

క. వారణ ఘోటక భాండా।
గారంబులు మొదలుగాఁగఁ గల ధనములతో
సూరినుత! యిందఱము నీ।
వారకములు గాఁగ మమ్ము వగవుము బుద్ధిన్. 56

ప్రతిపదార్థం: సూరి, నుత= పండితులచేత స్తుతించబడినవాడా! శుక్రుడా!; వారణ, ఘోటక, భాండాగారంబులు= ఏనుగులు, గుఱ్ఱాలు, ధనాలు ఉండేచోట్లు; మొదలు, కాఁగన్= మొదలయ్యేటట్లుగా; కల, ధనములతోన్= ఉన్న ధనాలతో; ఇందఱము= ఈ రాక్షసులమందరమూ; నీ వారకములు, కాఁగన్= నీ సొమ్ములౌనట్లుగా; మమ్మున్= రాక్షసులను; బుద్ధిన్= మనస్సులో; వగవుము= తలచుము.

తాత్పర్యం: ఏనుగులు గుఱ్ఱాలు మొదలుగా గల ధనాలతో ఈ రాక్షసులందరమున్నూ నీ సొమ్ములుగానే మనస్సునందు తలచవలసింది.

విశేషం: వారకం= లేనికాలమునందు ఉపయోగార్థ మొకరి కిచ్చి, కలిగిన కాలమునందు మరల పుచ్చుకొనే ధనం మొదలయినది - అని నిఘంటువులోని అర్థం. నన్నయకాలంలో 'వగచు' ధాతువుకు 'తలచు' అని అర్థం.

శర్మిష్ఠ దాసి యై దేవయానిం గొలుచుట (సం.1-75-13)

వ. 'ఈ దేవయాని కెద్ది యిష్టంబు దానిన యిత్తు, నడుగు' మనిన దేవయాని సంతసిల్లి 'యట్లేని శర్మిష్ఠ గన్యకా సహస్రంబుతో నాకు దాసి గావలయు, నిదియ నా కిష్టంబు; దీనిన యిచ్చునది' యనిన వృషపర్వుం డప్పు డక్కూఁతు రావించి, కన్యకాసహస్రంబుతో దేవయానికి దాసిగా నిచ్చి శుక్రునకు మనఃప్రియంబు సేసిన, శర్మిష్ఠయు నగ్గురువచనంబునఁ గన్యకా సహస్రంబుతో నిత్యంబును దేవయానిం గొలుచుచుండె; నంత నొక్కనాఁడు. 57

ప్రతిపదార్థం: ఈ దేవయానికిన్= నీకూతు రైన దేవయానికి; ఎద్ది= ఏది; ఇష్టంబు= ప్రియమో; దానిన్+అ= దానినే; ఇత్తున్= ఇచ్చెదను; అడుగుము+ అనినన్= అడుగు మని వృషపర్వుడు పలుకగా; దేవయాని; సంతసిల్లి= సంతోషించి; అట్లు+ఏని= అట్లైతే; అంటే నేనడిగిన దానినే (నా కిష్టమైన దానినే, నీ విచ్చేటట్లయితే); శర్మిష్ఠ= నీకూతురైన శర్మిష్ఠ; కన్యకా, సహస్రంబుతోన్= కన్యకలు వేయిమందితో; నాకున్, దాసి, కావలయున్= సేవకురాలు కావాలి; ఇది+అ= ఇదే; నాకు; ఇష్టంబు= ప్రియం (ఇష్టం); దీనిన్+అ= దీనినే; ఇచ్చునది= ఇమ్ము; అనినన్= అని దేవయాని పలుకగా; వృషపర్వుండు; అప్పుడు+అ= ఆ క్షణమే; ఆ+కూఁతున్= తన కూతురైన శర్మిష్ఠను; రావించి= రప్పించి; కన్యకా, సహస్రంబుతోన్= కన్యలు వేయి మందితో; దేవయానికిన్; దాసి+కాన్= దాసి అయ్యేటట్లుగా; ఇచ్చి; శుక్రునకున్; మనస్+ప్రియంబు= మనసుకు ప్రీతి; చేసినన్= చేయగా; శర్మిష్ఠయున్; ఆ+గురువచనంబునన్= ఆ తండ్రి యైన వృషపర్వుడి మాటచేత; కన్యకాసహస్రంబుతోన్= కన్యకలు వేయిమందితో; నిత్యంబును= ఎల్లప్పుడున్నూ; దేవయానిన్; కొలుచుచున్; ఉండెన్= సేవిస్తూ ఉన్నది; అంతన్= అటుతరువాత; ఒక్కనాఁడు= ఒక్కరోజున.

తాత్పర్యం: 'ఈ దేవయాని కేది ఇష్టమో (ప్రియమో) దానినే ఇస్తాను' అని వృషపర్వుడు పలుకగా దేవయాని సంతోషించి 'అట్లా అయితే, శర్మిష్ఠ వేయిమందికన్యలతో నాకు దాసి కావాలి; ఇదే నాకు ఇష్టం. దీనినే నాకు ఇవ్వాలిసింది' అని పలుకగా వృషపర్వుండు తత్క్షణమే తనకూతు రైన శర్మిష్ఠను రప్పించి, వేయిమంది కన్యలతో దేవయానికి దాసిగా ఇచ్చి, గురువైన శుక్రుడికి మనఃప్రీతి కావించాడు. శర్మిష్ఠకూడా తండ్రివాక్యాలను అనుసరించి వేయిమంది కన్యలతో ఎల్లప్పుడూ దేవయానిని సేవిస్తూ ఉన్నది. అటుతర్వాత ఒక్కరోజున. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'విధియందు లూట్టునకు అదియను తచ్ఛబ్దమును ముందు ను గాగమంబును నగును'. ఇచ్చు+అది= ఇచ్చునది= ఇమ్ము.

క. వనకేళీ కౌతుకమునఁ।
జనియెను శర్మిష్ఠఁ దొట్టి సఖులెల్ల ముదం
బునఁ గొలిచిరాఁగ విభవము।
దన కమరఁగ దేవయాని తద్వనమునకున్. 58

ప్రతిపదార్థం: దేవయాని; వన; కేళీ, కౌతుకమునన్= వనమందలి క్రీడయందలి కుతూహలంతో; శర్మిష్ఠన్+తొట్టి= శర్మిష్ఠ మొదలైన; సఖులు+ఎల్లన్= చెలికత్తెలందరూ; ముదంబునన్= సంతోషంతో; కొలిచి= సేవించి; రాఁగన్= తనతో రాగా; విభవము= వైభవం; తనకున్; అమరఁగన్= ఒప్పగా; తద్+వనమునకున్= ఆ అడవికి (యయాతి తనను నూతినుండి వెలికితీసిన వనానికే); చనియెను= వెళ్ళెను.

తాత్పర్యం: దేవయాని శర్మిష్ఠ మొదలైన చెలులంతా సంతోషంతో సేవించి రాగా, తనకు వైభవం ఒప్పగా, పూర్వపు వనానికే, వనమందు క్రీడించే కుతూహలంతో వెళ్ళింది.

విశేషం: తొట్టు ధాతువునకు క్త్వార్థకరూప మొక్కటే కానవస్తున్నది. పూర్వం వనాని కేగినపుడు రాచకూతు రైన శర్మిష్ఠకు అధిక వైభవ మున్నది. ఇప్పు డామె దేవయానికి దాసి అవటంచేత దేవయానికి అధికవైభవం కలిగింది.

వ. ఇ ట్లరిగి యవ్వనంబునఁ గన్యకలుం దానును బుష్పాపచయంబు సేయుచు, విమలజలప్రవాహ విలసితం బైన యొక్కసెలయేటి కెలన, నవవికచ కుసుమ సుకుమార కోరక నికర భరిత సహకార కురవక వకు ళాశోక తమాల సాల చ్ఛాయాశీతల సికతాతలంబున నిష్టవినోదంబుల నున్న యవసరంబున. 59

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అరిగి= వెళ్ళి; ఆ+వనంబునన్= ఆ అడవిలో; కన్యకలున్= చెలికత్తెలయిన కన్యకలున్నూ; తానును; పుష్ప+ అపచయంబు= పువ్వులను కోయటం; చేయుచున్; విమల, జల ప్రవాహ విలసితంబు+ఐన= నిర్మలమైన నీటిప్రవాహంతో ప్రకాశించేదైన; ఒక్క, సెలయేటి, కెలనన్= ఒక కొండనదిపక్క; నవ, వికచ కుసుమ= క్రొత్తగా వికసించిన పువ్వులయొక్క; సుకుమార, కోరక, నికర= మృదువైన పూమొగ్గల యొక్క సమూహంతో; భరిత= నిండిన; సహకార= తియ్యమామిడిచెట్లయొక్క; కురవక= గోరంట చెట్లయొక్క; వకుళ= పొగడచెట్లయొక్క; అశోక= అశోకవృక్షాలయొక్క; తమాల= చీకటిచెట్లయొక్క; సాల= మద్దిచెట్ల యొక్క; ఛాయా= నీడచేత; శీతల= చల్లనైన; సికతా, తలంబునన్= ఇసుకప్రదేశమందు; ఇష్ట, వినోదంబులన్= ప్రియా లైన వేడుకలతో; ఉన్న; అవసరంబునన్= సమయంలో.

తాత్పర్యం: ఈవిధంగా వెళ్ళి ఆవనంలో చెలికత్తె లైన కన్యలున్నూ, తానున్నూ, పూలు కోస్తూ నిర్మల మైన నీటిప్రవాహంతో ప్రకాశించే ఒక్క కొండనదిప్రక్క క్రొత్తగా వికసించిన పూలతోను, మృదువు లైన మొగ్గలయొక్క సమూహంతోను, నిండిన తియ్యమామిడిచెట్ల గోరంటచెట్ల పొగడచెట్ల

అశోకవృక్షాల చీకటిమాకుల మద్దిచెట్ల నీడలచేత చల్ల నైన ఇసుకప్రదేశంలో తమ కిష్ట మైనవేడుకలతో ఉన్న సమయాన. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: సాల మంటే వృక్ష మని అర్థం కూడ కలదు. అపుడు సహకారాది వృక్షాలయొక్క నీడచేత అని అర్థం చెప్పాలి. సాల+ఛాయా= సాలచ్ఛాయా. హ్రస్వ మైన అచ్చు తరువాతి ఛకారం ద్విరుక్త మౌతుంది.

సీ. అంగనాజనుల యుత్తుంగ సంగత కుచ।
కుంకుమ చందన పంకములయు
వారివ ధమ్మిల్లభారావకలిత ది।
వ్యామోద నవపుష్పదామములయు
వారివ ముఖ సకర్పూరతాంబూలాది।
వాసిత సురభి నిశ్వాసములయు
వారివ పరిధాన చారుధూపములయు।
విలసిత సౌరభావలులు దాల్చి

తే. యనిలుఁ డను దూత వోయి తోడ్కొనుచు వచ్చె।
దేవయానిపాలికి మృగతృష్ణఁజేసి
కాననంబునఁ గ్రుమ్మరువాని వీరు।
నతిపరిశ్రాంతుఁ డైన యయాతి నంత. 60

ప్రతిపదార్థం: అంగనా, జనుల= స్త్రీలయొక్క; ఉత్తుంగ= ఎత్తైన, సంగత= ఒకదానికొకటి మిక్కిలి దగ్గరగా నున్న; కుచ= స్తనాలయందలి; కుంకుమ, చందన, పంకములయున్= కుంకుమయొక్క, మంచిగంధం యొక్క, బురదల యొక్క; (కుంకుమ చందన ద్రవాలయొక్క; వారివి+అ= ఆ స్త్రీలవే అయిన; ధమ్మిల్లభార= పెద్దకొప్పుల నుండి; అవకలిత= జారిన; దివ్య+ఆమోద= మంచిసువాసన కల; వన పుష్ప దామములయున్= క్రొత్త పూలదండలయొక్క;

వారివి+అ= ఆ స్త్రీలవే అయిన; ముఖ= ముఖాలనుండి వెలువడు; సకర్పూర, తాంబుల+ఆది= కర్పూరంతో కూడిన తాంబూలం మొదలైనవాట చేత; వాసిత= సువాసన కలవిగా చేయబడిన; సురభి, నిశ్వాసములయున్= పరిమళాలు కల నిట్టూర్పులయొక్క; వారివి+అ= ఆ స్త్రీలవే అయిన; పరిధాన= వస్త్రాల యొక్క; చారు, ధూపములయున్= ఒప్పయిన ధూపాల యొక్క; విలసిత, సౌరభ+ఆవలులు= ప్రకాశించే వాసనల సముదాయాలు; తాల్చి= ధరించి; అనిలుఁడు+అను, దూత= గాలి అనే దూత; పోయి= వెళ్ళి; మృగతృష్ణన్, చేసి= ఎండమావులచేత; కాననంబునన్= అడవిలో; క్రుమ్మరువానిన్= తిరిగేవాడిని; వీరున్= వీరు డైన వాడిని; అతిపరిశ్రాంతుఁడు+అయిన= మిక్కిలి అలసినవా డైన; యయాతిన్= యయాతిమహారాజును; దేవయాని, పాలికిన్= దేవయాని సమీపానికి; తోడ్కొనుచున్, వచ్చెన్= తీసికొని వచ్చాడు; అంతన్= అటు పిమ్మట.

తాత్పర్యం: స్త్రీజనాల ఎత్తైనట్టి, అందమైనట్టి స్తనాలయందలి కుంకుమ గంధ ద్రవాలయొక్క సుగంధాలను ఆ స్త్రీలకే సంబంధించిన పెద్ద కొప్పులయం దుంచబడిన మంచివాసనలతో కూడిన క్రొత్తపూలదండలయొక్క సువాసనలను, ఆ స్త్రీలకే సంబంధించిన ముఖాలనుండి వెలువడే కర్పూరంతో కూడిన తాంబూలం మొదలైన వాటిచేత సువాసన కలవిగా చేయబడిన పరిమళవంత మైన నిట్టూర్పులయొక్క సౌగంధ్యాలను, ఆ స్త్రీలకే సంబంధించిన వస్త్రాల ఒప్పైనధూపాలయొక్క ప్రకాశించే సువాసనలసముదాయాన్ని వహించి వాయు వనే దూత వెడలి ఎండమావులచే అడవిలో తిరుగుతున్నట్టియూ, వీరుడైనట్టియూ, మిక్కిలి అలసినట్టియూ అయిన యయాతిమహారాజును దేవయాని చెంతకు తీసికొని వచ్చాడు.

విశేషం: అవకలిత శబ్దానికి జారిన అని కాని, వ్రేలాడుతున్న అని కాని అర్థాలు చెప్పవచ్చును. వాసిత, సురభి అనే పదాలు పునరుక్తులవలె తోచవచ్చును కాని సురభి శబ్దానికి సహజ మైన సౌరభం కల అని అర్థం చెప్పుకుంటే వారినిశ్వాసాలు సహజ పరిమళ భరిత మైనవనీ, తాంబూలాది సుగంధద్రవ్యాలవలన ఆ సౌరభం

మరింత అధిక మైనదనీ ఊహించవచ్చును. వస్త్రాలకు సువాసన కలిగేందుకు సుగంధాలతో ధూపాలు వేసేవా రని గ్రహించవచ్చును. మృగతృష్ణ అంటే ఎండమావులు. ఇక్కడ మృగాలను వేటాడుటయందు కోరిక లేక దప్పి అని అర్థం చెప్పుకొనటం యుక్తంగా ఉంటుంది. లేక మృగతృష్ణను చూచి నీరున్న దనుకొని భ్రమించి దప్పిక కలవాడవటంచేత యయాతి తిరుగుతున్నా డని భావించవచ్చును. గాలి అనే దూత యయాతిని తీసికొని వచ్చాడు అంటే గాలిలోని పరిమళంచేత ఆకర్షించబడి యయాతి దేవయానిదగ్గరకు వచ్చా డని భావం. అలం: రూపకం.

క. తరళనయనాబ్జదళములు -
నెరయఁగఁ బై మున్న చల్లి నృపసుతుఁ బూజిం
చిరి నవకుసుమమయాలం -
కరణ విశేషముల నచటి కాంతలు ప్రీతిన్. 61

ప్రతిపదార్థం: అచటికాంతలు= అక్క డున్న దేవయాని మొదలైన స్త్రీలు; తరళ, నయన+అబ్జ, దళములు= చలించే నేత్రాలనుండి వెలువడే చూపులనెడి తామరరేకులు; నెరయఁగన్= నిండునట్లుగా; పైన్= యయాతి మీద; మున్ను+అ= మొదటనే చల్లి; నవ, కుసుమ మయ+అలంకరణ విశేషములన్= క్రొత్తపూలతో నిండిన అలంకార విశేషాలచేత; ప్రీతిన్= ప్రీతితో; నృపసుతున్= రాజకుమారు డైన యయాతిని; పూజించిరి= గౌరవించారు.

తాత్పర్యం: అక్కడ ఉన్న దేవయాని మొదలైన స్త్రీలు రాజకుమారు డైన యయాతిపై మొదటే చంచలాలయిన నేత్రాలనుండి వెలువడే చూపులనే పద్మదళాలు నిండేటట్లుగా చల్లి, తరువాత క్రొత్తపూలమాలలు మొదలైన అలంకారాలచేత అతడిని ప్రీతితో పూజించారు.

విశేషం: అలం: రూపకాతిశయోక్తి. యయాతి తమదగ్గరకు రాగానే ఆ స్త్రీలు మొదట తమచూపులను ప్రసరింపచేశా రనీ, తరువాత పుష్పమయాలైన అలంకారాలచేత పూజించా రనీ భావం.

యయాతిమహారాజు దేవయానిని వివాహం బగుట (సం.1-76-8)

వ. అయ్యయాతియుఁ దత్ప్రదేశంబున సుఖోపవిష్టుం డై దేవయానిం దొల్లి యెఱింగినవాఁ డై యతిశయరూప లావణ్యగుణసుందరి యయిన శర్మిష్ఠ నెఱుంగ వేఁడి, 'మీ రెవ్వరివారలు మీకులగోత్ర నామంబు లెఱుంగ వలతుం జెప్పుం' డనిన నారాజునకు దేవయాని యి ట్లనియె. 62

ప్రతిపదార్థం: ఆ+యయాతియున్= ఆ యయాతియు; తద్, ప్రదేశంబునన్= అక్కడ; సుఖ+ఉపవిష్టుండు+ఐ= సుఖంగా కూర్చున్నవాడై; దేవయానిన్= దేవయానిని; తొల్లి= అంతకుముందే; ఎఱింగినవాఁడు+ఐ= నూతినుండి తీసినప్పుడే ఎఱిగినవాడు కాబట్టి; అతిశయ, రూప, లావణ్య, గుణసుందరి, అయిన= అధికమైన రూపంతోను, సౌందర్యం తోను, గుణాలతోను అందమైన; శర్మిష్ఠను; ఎఱుంగన్, వేఁడి= తెలుసుకొన కోరి; మీరు; ఎవ్వరి, వారలు= ఎవరికి సంబంధించిన వారు; మీ, కుల, గోత్ర, నామంబులు= మీ యొక్క కులాన్ని గోత్రాన్ని, పేరును; ఎఱుంగన్, వలతున్= తెలిసికొనకోరుతాను; చెప్పుండు; అనినన్= అని అడుగగా; ఆ రాజునకున్= యయాతికి; దేవయాని; ఇట్లు= ఈవిధంగా, అనియెన్= పల్కింది.

తాత్పర్యం: ఆ యయాతికూడ అక్కడ సుఖంగా కూర్చుండి, అంతకు ముందే నూతినుండి బయటికి తీసినపుడు దేవయానిని ఎరిగియున్నవా డవటంవలన అధిక మైన రూపంతోను, సౌందర్యంతోను, గుణాలతోను ఒప్పుతున్న శర్మిష్ఠ ఎవరో తెలుసుకొన కోరి 'మీరు ఎవరికి సంబంధించినవారు, మీకులాలను, గోత్రాలను, పేరులను తెలిసికొనకోరుతున్నాను చెప్పు' డని అడిగాడు. అప్పుడు దేవయాని యయాతితో ఇట్లా పలికింది.

విశేషం: యయాతి శర్మిష్ఠను ఇప్పుడే మొదటిమారు చూచాడు. ప్రథమదర్శనం లోనే ఆమెసౌందర్యాదులచేత ఆకర్షింపబడినాడు. ఆమెను ఒక్కదాన్నిగురించే అడగటం యుక్తంగా ఉండ దని అతడు అందరినిగురించీ అడిగాడు.

తే. నన్ను మున్న యెఱుంగు; దిన్నాతి నాకు।
దాసి, వృషపర్వుఁ డను మహాదానవేంద్రు
కన్య; నాయొద్ద నెప్పుడుఁ గదలకుండు।
ననఘ! మఱి దీని శర్మిష్ఠ యండ్రు జనులు. 63

ప్రతిపదార్థం:అనఘ= పాపరహితుడా; నన్నున్= నన్నుగురించి; మున్ను+అ= ముందే; ఎఱుంగుదు (తద్ధర్మ క్రియ అవటంచేత వకారం లోపించింది); ఈ+నాతి= ఈకన్య; నాకున్, దాసి= సేవకురాలు; వృషపర్వుఁడు+అను= వృషపర్వు డనే పేరు కల; మహత్+దానవ+ఇంద్రు= గొప్పరాక్షసరాజుయొక్క; కన్య= కూతురు; నాఒద్దన్= నాచెంత; ఎప్పుడున్= ఎల్లప్పుడూ; కదలక+ఉండున్= వదలక నివసిస్తూ ఉంటుంది; మఱి= ఇంక; జనులు; దీనిన్= ఈమెను; శర్మిష్ఠ; అండ్రు= శర్మిష్ఠ అని అంటారు. (పిలుస్తారు.)

తాత్పర్యం: పాపరహితుడ వైన ఓయయాతీ! నీవు నన్నుగురించి ఇంతకు ముందే తెలిసికొన్నావు. ఈమె నాకు సేవకురాలు. వృషపర్వు డనే పేరు కలిగిన గొప్పరాక్షసరాజుకూతురు. నాచెంతనే ఎప్పుడూ విడువకుండా సేవ చేస్తూ ఉంటుంది. ఇక ఈమెను ప్రజలు శర్మిష్ఠ అంటారు.

విశేషం: అను - దురు. సూ: 'తిదుటలు పరంబు లగునపుడు అను మొదలగువాని స్థానంబున పూర్ణబిందు వగును' - అందురు. సున్నమీది దకారానికి డకారాదేశం- అండురు - ఉత్వలోపం - అండ్రు. ఇక్కడ దేవయాని తన గొప్పతనం ప్రదర్శించేందుకై రాక్షసరాజుకుమార్తెతనకు దాసి అని చెప్పింది. శర్మిష్ఠ తనంతటతాను పరిచయంచేసికొంటే మహాదానవేంద్రు కన్యగా చెప్పుకొంటుంది. అందువలన దేవయాని తానే చొరవతీసికొని ఆరాజుకూతురు దాసి అనీ ఆమెకు (చివరకు తనపెళ్లి తానే చేసికొనే) స్వాతంత్ర్యంకూడా లేదని స్పష్టంచేస్తుంది. 'రత్నహారీతుపార్థివః అనే న్యాయంతో కన్యారత్నాన్ని తానే నని వ్యంగ్యంగా సూచిస్తుంది.

ఉ. నిగ్రహ మేది నన్నుఁ దరణిప్రభ! కూపము వెల్వరించునాఁ
డుగ్రమయూఖసాక్ష్యముగ నున్నతదక్షిణపాణిఁ జేసి భూ
పాగ్రణి! నాదు దక్షిణకరాగ్రము వట్టితి కాన మున్న పా
ణిగ్రహణంబు సేసి; తది నీయెడ విస్మృతిఁ బొందఁ బాడియే. 64

ప్రతిపదార్థం: తరణి, ప్రభ!= సూర్యుడికాంతివంటి కాంతి గలవాడా!; నిగ్రహము= మేర, నింద (లేదా అవమానం); ఏది= నశించి (ఇక్కడ ఏద అనే పాఠాంతర మున్నది. అదే ఉచితం. నాకు కలిగిన అవమానం నశించేటట్లుగా); కూపము. వెల్వరించునాఁడు= నూతినుండి బయటికి తీసేటప్పుడు; భూప+అగ్రణి= రాజశ్రేష్ఠుడా; ఉగ్రమయూఖ, సాక్ష్యముగన్= తీక్ష్ణ మైన కిరణాలు కలిగిన సూర్యుడి సాక్ష్యం కలిగేటట్లు; ఉన్నత, దక్షిణ, పాణిన్, చేసి= ఎత్తైన (పొడవైన) కుడిచేతితో; నాదు; దక్షిణ, కర+అగ్రము= కుడిచేతి అగ్రభాగాన్ని; పట్టితి(వి)= గ్రహించావు; కాన= కాబట్టి; మున్ను+అ= ఇంతకుముందే; పాణి, గ్రహణంబు చేసితి(వి)= చేతిని పట్టుకొనటం చేశావు. (పెళ్ళాడావు); అది= ఆవిషయం; నీఎడన్= నీహృదయంలో; విస్మృతిన్= మరపును; పొందన్= పొందటం; పాడి+ఏ= న్యాయమా?

తాత్పర్యం: సూర్యుడియొక్కకాంతివంటి కాంతి గల ఓ రాజశ్రేష్ఠుడా! నాకు కలిగిన చెర (శిక్ష) నశించేటట్లుగా (మేరమీరి) నన్ను నూతినుండి బయటికి తీసిననాడే సూర్యుడి సాక్షిగా దీర్ఘమైన నీకుడిచేతితో నాకుడి ముంజేతిని గ్రహించావు. కాబట్టి ఇంతకుముందే నన్ను పెళ్ళాడినావు (నాచేయి పట్టుకున్నావు). ఆ విషయం నీహృదయంలో మరవటం న్యాయమా!

విశేషం: నిగ్రహ మంటే అదుపులో ఉండటం. ఇంద్రియనిగ్రహాదులలో ఈఅర్థం సరిపోతుంది. ఇక్కడ శిక్ష, నింద, మేర, చెఱ అనే అర్థాలు చెప్పుకోవటం యుక్తంగా ఉంటుంది. శర్మిష్ఠ దేవయానిని శిక్షించేందుకై ఆమెను నూతిలో త్రోసింది. అది చెఱవలె ఉన్నది. యయాతి పైకి తీయటంచేత ఆమె కాశిక్ష

తొలగింది. ఈ పద్యంలో దేవయాని గడుసరితనం మరొకసారి స్పష్టమౌతుంది. యయాతి శర్మిష్ఠయొక్క 'అతిశయరూపలావణ్య సౌందర్యాన్ని' చూచాడు. ఆకర్షితుడైనాడు. అంతకుముందు దేవయానిని చూచాడు కాని ఆసక్తుడు కాలేదు. ఆమెకంటె అతిశయించిన రూపలావణ్యాలు శర్మిష్ఠకు ఉన్నాయని ధ్వని. యయాతి చూపులలోని మర్మాన్నీ, ఆమెనుగురించి తెలిసికోవాలనే ఆకాంక్షనూ దేవయాని పసికట్టింది. మనసులో కోర్కెకలిగితే వివాహమైనట్లే అని దేవయానిభావం. కచుడితో ఆమె ఆవిధంగానే పేర్కొన్నది. ఇప్పుడు యయాతి శర్మిష్ఠపై ఆసక్తికలిగి ఉండటంవలన, అది వివాహమయ్యే అవకాశం ఉన్నది. తా నుండగా తనదాసి అయిన శర్మిష్ఠపై యయాతి ఆసక్తిని ప్రకటించటం ఆమె సహించలేకపోయింది. అందుకే తనకూ యయాతికీ అంతకుముందే పాణిగ్రహణమైపోయిందని మనోధర్మాన్ని ప్రతిపాదించింది. యయాతిని తానే దక్కించుకొనవలెనని భావించింది. ఈవిధంగా ఆత్మాభిమానాన్ని శర్మిష్ఠముందు నిలుపుకొనటానికి యయాతిని వివాహమాడే నిర్ణయాన్ని మెరుపువలె తీసికొనటంలో ఆమెగడుసరితనం, సద్యఃస్ఫూర్తి, చాకచక్యం వెల్లడి అవుతున్నాయి. నన్నయ శిల్పంతో తీర్చిదిద్దినపాత్రలలో దేవయాని ఒకతె. ఉక్తివైచిత్ర్యంతో కూడికొనిన పృథక్పదత్వం గల ఈరచన మాధుర్యగుణవిశిష్టం. అభిలాషను ధ్వనింపచేయటంలో మాధుర్యం మహనీయం. (సంపా.)

ఉ. 'నన్ను వివాహ మై నహుషనందన! యీలలితాంగిఁ దొట్టి యీ
కన్నియలందఱున్ దివిజకన్యలతో నెన యైనవారు నీ
కున్నతిఁ బ్రీతి సేయఁగ నృపోత్తమ! వాసవుఁ బోలి లీలతో
నిన్నరలోకభోగము లనేకము లందుము నీవు' నావుడున్. 65

ప్రతిపదార్థం: నహుషనందన= నహుషుడి కొడుకువైన యయాతీ!; నన్ను; వివాహము+ఐ= పెళ్ళాడి; ఈ, లలిత+అంగిన్, తొట్టి= సుందరాంగి యైన ఈశర్మిష్ఠ మొదలుకొని; దివజకన్యలతోన్= దేవతాకన్యలతో; ఎన, అయినవారు= సాటి అయినవారు; ఈ, కన్నియలు, అందఱున్= ఈకన్యలంతా; నీకున్; ఉన్నతిన్= పెంపుతో, గౌరవంతో; ప్రీతి, చేయఁగన్=

ప్రియం చేకూర్చగా; నృప+ఉత్తమ= రాజశ్రేష్ఠుడా!; వాసవున్= ఇంద్రుడిని; పోలి; లీలతోన్= విలాసంతో; నీవు; ఈ+నరలోక, భోగములు= ఈ మానవలోకానికి సంబంధించిన సౌఖ్యాలు; అనేకములు= పెక్కులు; అందుము= పొందుము; నావుడున్= అని దేవయాని పలుకగా.

తాత్పర్యం: 'నహుషుడి కుమారుడివైన ఓ యయాతి మహారాజా! నన్ను పెళ్ళాడి సుందరాంగి యైన శర్మిష్ఠ మొదలుగా గల దేవకన్యకలతో సాటి యైన ఈకన్యలంతా నీకు గౌరవంతో ప్రియం చేకూర్చగా ఇంద్రుడిని పోలి విలాసంతో నీవు మానవలోకానికి సంబంధించిన పెక్కుభోగా లనుభవించుము' అని దేవయాని పలికిన అనంతరం.

విశేషం: తొట్టుధాతువుకు తొట్టి అనే క్త్వార్థకరూపం ఒక్కటే ప్రయోగాలలో కనవస్తోంది. తనను వివాహమాడితే దేవకన్యలతోసాటివచ్చే శర్మిష్ఠాది కన్యలందరూ యయాతిని సేవించి ప్రీతి కలిగిస్తారని చెప్పటంలోకూడా దేవయాని గడుసరితనం కనబడుతుంది. శర్మిష్ఠ మీద నీకు మక్కువ ఉంటే ముందు నన్ను వివాహమాడాలని సూచించింది. అయినా తాను రాణిగా, శర్మిష్ఠ దాసిగా మాత్రమే యయాతికి సేవలందించగలదని వ్యంగ్యంగా నిర్దేశించింది. ఈ పద్యరచనలోని మాధుర్యగుణం రసభావానుగుణం. (సంపా.)

వ. 'క్షత్త్రియకన్యకల బ్రాహ్మణులు వివాహం బగుదురు గాక; యధర్మోత్తరంబుగా క్షత్త్రియులు బ్రాహ్మణకన్యకల వివాహం బగుదురే? నీపలుకులు ధర్మ విరుద్ధంబులు; మఱియు సర్వవర్ణాశ్రమధర్మంబులు సంకరంబులు గాకుండ రక్షించుచున్న యేన యిట్టి యధర్మంబున కొడంబడితినేని జగత్ప్రవృత్తి విపరీతం బగు' ననిన నయ్యయాతికి దేవయాని యి ట్లనియె. 66

ప్రతిపదార్థం: క్షత్త్రియ కన్యకలన్= క్షత్రియుల కూతుళ్ళను; బ్రాహ్మణులు; వివాహంబు+ అగుదురు, కాక= వివాహ మాడతారు కాని; అధర్మ+

ఉత్తరంబు+కాన్= అధర్మం మీది దగునట్లుగా (ఇక్కడ, అధర్మ మార్గమున, ధర్మేతరంబుగా, అధర్మంబుగా అనే పాఠాంతరా లున్నాయి) అనే అర్థం వస్తుంది; క్షత్రియులు; బ్రాహ్మణ, కన్యకలన్= విప్రుల కూతుళ్ళను; వివాహంబు+అగుదురు+ఏ= పెళ్ళాడుతారా? నీ పలుకులు= నీ మాటలు; ధర్మవిరుద్ధంబులు= ధర్మానికి వ్యతిరేకమైనవి; మఱియున్= అదీకాక; సర్వవర్ణ+ఆశ్రమ ధర్మంబులు= సకలములయిన బ్రాహ్మణక్షత్రియ వైశ్యశూద్రాది వర్ణాలయొక్క, బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ సన్న్యాసాశ్రమాలయొక్క ధర్మాలు; సంకరంబులు= ఒకదానితో ఒకటి కలిసినవి; కాక+ఉండన్= కాకుండగా; రక్షించుచు; ఉన్న= పాలిస్తున్న; ఏను+అ= రాజునైన నేనే; ఇట్టి, అధర్మంబునకున్= ఇట్టి ధర్మం కాని కార్యానికి; ఒడంబడితిన్+ఏనిన్= అంగీకరిస్తే; జగత్, ప్రవృత్తి= జగత్తుయొక్క వ్యాపారం (స్థితి); విపరీతంబు= వ్యత్యస్తం; అగున్; అనినన్= అని యయాతి పలుకగా; ఆ+యయాతికిన్; దేవయాని; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'క్షత్రియులకూతుళ్ళను బ్రాహ్మణులు పెళ్ళాడుతారు కానీ అధర్మంగా క్షత్రియులు విప్రులకూతుళ్ళను పెళ్ళాడుతారా? నీ మాటలు ధర్మానికి వ్యతిరిక్తాలు. అదిగాక అన్నివర్ణాలయొక్క ఆశ్రమాల యొక్క ధర్మాలు సంకీర్ణాలు కాకుండా కాపాడుతున్న రాజు నైన నేనే ఇటువంటి అధర్మానికి అంగీకరిస్తే లోకవ్యాపారం వ్యత్యస్త మైపోతుంది' అని పలుకగా యయాతికి దేవయాని ఇ ట్లన్నది.

క. 'వెలయఁగ ధర్మాధర్మం ।
బులు నడపుచు నిఖిలలోకపూజ్యుండై ని
ర్మలుఁ డగు శుక్రుఁడు పంచిన ।
నలఘుభుజా! నను వివాహ మగుదే?' యనినన్. 67

ప్రతిపదార్థం: అలఘుభుజా!= గొప్ప బాహువులు కలవాడా! (పరాక్రమ వంతుడా); వెలయఁగన్= ప్రసిద్ధికెక్కేటట్లుగ; ధర్మ+అధర్మంబులు= ధర్మాన్నీ,

అధర్మాన్నీ; నడపుచున్= జరిగిస్తూ, నిర్ణయిస్తూ; నిఖిల, లోకపూజ్యుండు+ఐ= సకలలోకాలచేత (ప్రజలచేత) పూజనీయుడై; నిర్మలుఁడు+అగు= అనఘు డైన; శుక్రుఁడు= నాతండ్రి శుక్రాచార్యుఁడు; పంచినన్= ఆజ్ఞాపిస్తే; ననున్ వివాహము అగుదువు+ఏ= నన్ను పెళ్ళాడుతావా; అనినన్= అని దేవయాని పలుకగా.

తాత్పర్యం: 'గొప్పబాహుపరాక్రమం కలవాడా! ప్రసిద్ధమయ్యేటట్లుగా ధర్మాన్నీ అధర్మాన్నీ నిర్ణయిస్తూసకలలోకాలకు పూజనీయు డై పాపరహితు డైన నాతండ్రి శుక్రు డాజ్ఞాపిస్తే నన్ను పెండ్లాడుతావా?' అని దేవయాని పలుకగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: ధర్మాధర్మ నిర్ణయం శాస్త్రప్రకారం చేయబడుతుంది లోకంలో. ఇక్కడ శాస్త్రకారుడివంటి శుక్రాచార్యుడిని ప్రమాణంగా ప్రతిపాదిస్తున్నది దేవయాని, శుక్రుడు రాక్షసాచార్యుడు. అతడు చెప్పింది ధర్మవిరుద్ధంగా ఉండదని లోకులు విశ్వసిస్తారు. శుక్రుడు దేవయాని అభిమతానికి విరుద్ధమైన ధర్మం చెప్పడు. ఆచార్యప్రమాణం చూపి తన అభిమతాన్ని తీర్చుకోదలచటంలో దేవయాని గడుసరితనం ప్రకటితమౌతున్నది.

వ. 'అమ్మహాముని వచ్చి యిది ధర్మవిరుద్ధంబు గా దని చెప్పెనేని నిన్ను వివాహం బగుదు' నని యయాతి యొడంబడిన దేవయాని యప్పుడ శుక్రు రావించిన. **68**

ప్రతిపదార్థం: ఆ, మహత్+ముని= ఆ గొప్పముని శుక్రుడు; వచ్చి; ఇది= ఈ వివాహం; ధర్మ, విరుద్ధంబు, కాదు+అని= ధర్మానికి వ్యతిరేకం కాదని; చెప్పెన్+ఏని= చెప్పినట్లైతే; నిన్నున్ వివాహంబు+అగుదున్+అని= నిన్ను పెండ్లాడుతా నని; యయాతి; ఒడంబడినన్= అంగీకరింపగా; దేవయాని; అప్పుడు+అ= వెంటనే (ఆ క్షణంలోనే); శుక్రున్= శుక్రాచార్యుడిని; రావించినన్= వచ్చేటట్లు చేయగా.

తాత్పర్యం: 'మహాముని యైన ఆ శుక్రుడు వచ్చి ఈ వివాహం ధర్మానికి విరుద్ధం కా దని చెప్పినట్లైతే నిన్ను పెళ్ళాడుతా' నని యయాతి అంగీకరించగా దేవయాని వెంటనే తండ్రి యైన శుక్రుడిని అక్కడికి రప్పించగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. తనదివ్యతేజమున న।
వ్వన మెల్ల వెలుంగుచుండ వచ్చెను భృగునం
దనుఁడు నిజనందనకుఁ బ్రియ।
మొనరింపఁగఁదలఁచి దానియొద్దకుఁ బ్రీతిన్. **69**

ప్రతిపదార్థం: తన, దివ్య, తేజమునన్= తనయొక్క దేవతాసంబంధ మైన కాంతిచేత; ఆ+వనము, ఎల్లన్= ఆ అడవిఅంతా; వెలుంగుచుండన్= ప్రకాశిస్తుండగా; నిజనందనకున్= తనకూతురికి; ప్రియము= ప్రీతి; ఒనరింపఁగన్+తలఁచి= చేయదలచి; భృగునందనుఁడు= భృగుకుమారు డైన శుక్రుడు; దాని, ఒద్దకున్= దేవయానిచెంతకు; ప్రీతిన్= ప్రీతితో; వచ్చెను.

తాత్పర్యం: దేవతాసంబంధ మైన కాంతిచేత ఆ అడవిఅంతా ప్రకాశిస్తుండగా భృగుకుమారు డైన శుక్రుడు తనకూతురైన దేవయానికి ప్రీతిచేయదలచి ప్రేమతో ఆమెవద్దకు వచ్చాడు.

క. అతిసంభ్రమమున నవనీ।
పతి విహితోత్థానుఁ డై తపశ్శక్తిఁ బ్రజా
పతినిభుఁ డగు భార్గవునకు।
నతిభక్తిం బ్రణమితోత్తమాంగుం డయ్యెన్. **70**

ప్రతిపదార్థం: అవనీపతి= రాజైన యయాతి; అతి సంభ్రమమునన్= అధికమైన వేగిరపాటుతో; విహిత+ఉత్థానుఁడు+ఐ= చేయబడిన లేచుట కలవాడై (లేచినవాడై); తపః, శక్తిన్= తపస్సుయొక్క శక్తిచేత; ప్రజాపతినిభుఁడు+అగు= బ్రహ్మతో సమానుడైన; భార్గవునకున్= శుక్రుడికి; అతిభక్తిన్=

మిక్కిలిభక్తితో; ప్రణమిత+ఉత్తమాంగుండు= మిక్కిలి వంచిన శిరస్సు కలవాడు (శిరస్సు మిక్కిలి వంచి నమస్కరించిన వాడు); అయ్యెన్.

తాత్పర్యం: రాజైన యయాతి మిక్కిలి వేగిరపాటుతో లేచి నిలబడి తపస్సు యొక్కశక్తియందు బ్రహ్మతో సమానుడైన శుక్రుడికి అధిక మైన భక్తితో నమస్కరించాడు.

విశేషం: ఈపద్యం యయాతికి గురువులయెడ ఉండే భక్తిని సూచిస్తున్నది. ఇందులో 'అతి' అనే విశేషణాలు, ప్రాదివర్ణాలు వ్యంజకాలై అక్షరరమ్యతను కల్పిస్తున్నాయి.

వ. మఱియు దేవయానియు శర్మిష్ఠయుం గన్యకాసహస్రంబును నత్యంతభక్తితోఁ గ్రమంబున నమస్కరించి; రంత దేవయాని శుక్రున కి ట్లనియె. 71

ప్రతిపదార్థం: మఱియున్= ఇంకను; దేవయానియున్, శర్మిష్ఠయున్; కన్యకాసహస్రంబున్= వేయిమంది కన్యలున్నూ; అత్యంత భక్తితోన్= అధికమైన భక్తితో; క్రమంబునన్= వరుసగా; (దేవయానీ పురస్సరంగా) నమస్కరించిరి; అంతన్= అటుపిమ్మట; దేవయాని; శుక్రునకున్, ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: తరువాత దేవయానియూ, శర్మిష్ఠయూ, చెలికత్తె లయిన వేయిమంది కన్యకలునూ, మిక్కిలి భక్తితో శుక్రుడికి నమస్కరించారు. అటుపిమ్మట దేవయాని శుక్రుడితో ఇట్లా పలికింది.

విశేషం: క్రమంబున అన్న పదంచేత ముందు దేవయాని, తరువాత శర్మిష్ఠ, ఆ తరువాత కన్యకలు నమస్కరించా రని గ్రహించవచ్చును. దీనివలన దేవయాని ప్రాముఖ్యం వెల్లడి అవుతున్నది.

ఆ. ఇన్నరేంద్రుచేత మున్న గృహీత మై।
యున్న నాకరంబు గ్రన్న నింక

నొరున కర్హ మగునె పరిణయ విషయ మై।
ధరఁ బరిగ్రహింప బరమ మూర్తి!. 72

ప్రతిపదార్థం: పరమమూర్తి= పరమమైన ఆకారం కలవాడా!; ఈ+నర+ ఇంద్రుచేతన్= ఈరాజశ్రేష్ఠుడిచేత; మున్ను+అ= పూర్వమే; గృహీతము+ అయి, ఉన్న= గ్రహించబడి యున్న; నాకరంబు= నాచేయి; పరిణయ, విషయము+ఐ= వివాహానికి వస్తువై (వివాహ సంబంధాన); క్రన్నన్= శీఘ్రంగా; ధరన్= భూమియందు; పరిగ్రహింపన్= గ్రహించ టానికి; ఇంకన్, ఒరునకున్= మరి ఇతరుడికి; అర్హము+ అగును+ఎ= తగిన దౌ తుందా?; (కాదని భావం).

తాత్పర్యం: పరబ్రహ్మస్వరూపుడి వైన ఓతండ్రీ! ఈ రాజశ్రేష్ఠుడిచేత ఇంతకు పూర్వమే గ్రహించబడి యున్న నాచేతిని వివాహవిషయాన ఇంకొకరికి గ్రహించటానికి తగునా?

వ. 'కావున నాకు నీ జన్మంబునఁ బతి యయాతియ; యితండును భవద్వచనం బున నన్ను వివాహం బగుదు ననియె; నిందు ధర్మవిరోధంబు లేకుండు నట్లుగాఁబ్రసాదింపవలయు' ననిన శుక్రుండు గరుణించి 'యయాతికి నీకును నయిన యీ వివాహంబునం దపక్రమదోషంబు లేకుండెడు' మని వరం బిచ్చి యయ్యిరువురకుం బరమోత్సవంబున వివాహంబు సేసి, శర్మిష్ఠం జూపి 'యిది వృషపర్వుని కూఁతురు; దీనికిఁ బ్రియంబున నన్నపాన భూషణాచ్ఛాదన మాల్యానులేపనాదుల సంతోషంబు సేయునది; శయనవిషయంబునఁ బరిహరించు నది' యని పంచి, కూఁతు నల్లునిం బూజించిన; నయ్యయాతియు శుక్రుని వీడ్కొని దేవయానిని శర్మిష్ఠను గన్యకా సహస్రంబును దోడ్కొని నిజపురంబునకుం జని యంతఃపురరమ్యహర్మ్య తలంబున దేవయాని నునిచి,

తదనుమతంబున నశోకవనికాసమీపంబున నొక్క గృహంబునందుఁ
గన్యకాసహస్రంబుతో శర్మిష్ఠ నునిచి, దేవయానియందు సుఖోపభోగపరుం
డై యున్నఁ; గొండొకకాలంబు నకు దేవయానికి యదుతుర్వసు లను
కొడుకులు పుట్టి; రంత శర్మిష్ఠ సంప్రాప్తయౌవనయు ఋతుమతియు నై
యాత్మగతంబున. 73

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; నాకున్; ఈ జన్మంబునన్= ఈపుట్టుకయందు; పతి= భర్త; యయాతి+అ= యయాతియే; ఇతండును= ఈయయాతికూడ; భవత్+వచనంబునన్=నీమాట ననుసరించి; నన్నున్; వివాహంబు+అగుదున్+అనియెన్= పెళ్ళాడుతా నని పలికాడు; ఇందున్= ఈ వివాహంలో; ధర్మ, విరోధంబు= ధర్మానికి వ్యతిరేకం; లేక+ఉండు+అట్లుగాన్= లేకుండే విధంగా; ప్రసాదింపవలయున్= అనుగ్రహించవలెను; అనినన్= అని దేవయాని పలుకగా; శుక్రుండు; కరుణించి= దయతాల్చి; యయాతికిన్; నీకునున్, అయిన; ఈ వివాహంబునందున్= ఈ పెళ్ళిలో; అపక్రమ, దోషంబు= క్రమం తప్పటం అనే దోషం; లేక, ఉండెడున్, అని= లేకుండు గాక, అని; వరంబు+ఇచ్చి; ఆ+ఇరువురకున్= ఆ దేవయానీ యయాతు లిద్దరికిని; పరమ+ఉత్సవంబునన్= గొప్పవేడుకతో; వివాహంబు, చేసి= పెళ్ళిచేసి; శర్మిష్ఠన్; చూపి= యయాతికి చూపించి; ఇది= ఈమె; వృషపర్వుని కూతురు; దీనికిన్= ఈ శర్మిష్ఠకు; ప్రియంబునన్= ప్రీతితో; అన్న, పాన, భూషణ, అచ్ఛాదన, మాల్య+అనులేపన+ఆదులన్= అన్నం, పానం, అలంకారాలు, వస్త్రాలు, దండలు, శరీరానికి పూసుకొనే అనులేపనాలు మొదలైనవాటిచే; సంతోషంబు, చేయు+అది= ఆనందం కలిగించవలసింది; శయన, విషయంబునన్= పడకవిషయాన; పరిహరించు+అది= వర్జించవలసింది; అని; పంచి= ఆజ్ఞాపించి; కూఁతున్= కూతురైన దేవయానిని; అల్లునిన్= అల్లుడైన యయాతిని; పూజించినన్= గౌరవించగా; ఆ+యయాతియున్= ఆ యయాతికూడ; శుక్రునిన్; వీడ్కొని= విడిచి

(శుక్రుడి వద్ద సెలవుతీసికొని); దేవయానిని, శర్మిష్ఠను, కన్యకా సహస్రంబును= కన్యకలు వేయిమందిని; తోడ్కొని= తనతో తీసికొని; నిజ, పురంబునకున్= తన పట్టణానికి; చని= వెళ్ళి; అంతఃపుర, రమ్య, హర్మ్యతలంబునన్= అంతఃపుర మందలి అందమైన ప్రాసాద ప్రదేశమందు; దేవయానిన్; ఉనిచి= ఉంచి; తద్, అనుమతంబునన్= ఆమె అంగీకారంతోనే; అశోక, వనికా సమీపంబునన్= అశోక వృక్షాలతో కూడిన వనంచెంత; ఒక్క గృహమందున్= ఒక ఇంటియందు (ఇంట్లో); కన్యకా సహస్రంబుతోన్= కన్యలు వేయిమందితో; శర్మిష్ఠన్, ఉనిచి; దేవయానియందున్, సుఖ+ఉపభోగ, పరుండు+ఐ= సుఖాలను అనుభవించటంలో ఆసక్తి కలవాడై; ఉన్నన్= ఉండగా; కొండొకకాలంబునకున్= కొంతకాలానికి; దేవయానికిన్; యదు, తుర్వసులు+ అను= యదువు తుర్వసుడు అనే; కొడుకులు; పుట్టిరి; అంతన్= ఆ తరువాత, శర్మిష్ఠ; సంప్రాప్త, యౌవనయున్= పొందబడిన యౌవనం కలదీ ఋతిమతియున్+ఐ= పుష్పవతియూ అయి; ఆత్మగతంబునన్= తనలో.

తాత్పర్యం: 'నా కీ పుట్టుకయందు (జన్మలో) యయాతియే భర్త. ఈ యయాతియు నీమాటను అనుసరించి నన్ను పెళ్ళాడుతా నని పలికాడు. ఈ మా వివాహంలో ధర్మానికి వ్యతిరేకం లేకుండేటట్లుగా అనుగ్రహించాలి (అనుగ్రహించవలసింది)' అని దేవయాని పలుకగా శుక్రుడు దయతాల్చి 'యయాతికీ నీకూ అయ్యే ఈ పెళ్ళిలో అధర్మదోషం లేకుండు గాక' అని వర మిచ్చి, వారిద్దరికీ అధిక మైన వేడుకతో పెళ్ళి చేసి యయాతికి శర్మిష్ఠను చూపించి 'ఈమె వృషపర్వు డనే రాక్షసరాజుకూతురు. ఈమెకు భోజనం, పానీయాలు, అలంకారాలు, వస్త్రాలు, దండలు, శరీరానికి పూసుకునే లేపనాలు మొదలైనవాటిచేత ఆనందం కల్పించుము. పడకవిషయంలో మాత్రం ఈమెను వర్జించవలసింది' అని ఆజ్ఞాపించి కూతు రైన దేవయానిని, అల్లు డైన యయాతిని గౌరవించాడు. ఆ యయాతికూడ శుక్రుడి దగ్గరసెలవు తీసుకొని దేవయానిని శర్మిష్ఠను వేయిమందికన్యలను వెంటతీసికొని తనపట్టణానికి

వెళ్ళి అంతఃపురమందలి అందమైన మేడలో దేవయానిని ఉంచి, ఆమె అంగీకారంతో అశోకవృక్షాలవనానికి చెంత నున్న ఒకయింట్లో వేయిమంది కన్యలతో శర్మిష్ఠను ఉంచి, దేవయానితో సుఖాలను అనుభవిస్తూ ఉన్నాడు. కొంత కాలానికి దేవయానికి యదువు, తుర్వసుడు అనే కొడుకులు పుట్టారు. తరువాత శర్మిష్ఠ యౌవనవతీ, పుష్పవతియు, అయి, ఆత్మలో.

విశేషం: ఉండెడున్= అని 'సూ:- ఎడుతల ద్రుతమునకు అచ్చు పరంబగునపుడు మకారము. ఉండెడు మని. దేవయాని కడుగడుసరిగా తండ్రితో మాటాడింది. తనకూ యయాతికీ వివాహం కావటం ధర్మమా అధర్మమా అని ఆమె తండ్రి నడుగలేదు. యయాతిచేత ముందే కరగ్రహణం చేయబడిన దేవయానిని మరొకరు పాణిగ్రహణం చేయడానికి వీలులేదనీ, అట్లా జరిగితే అది ధర్మ విరుద్ధమనీ, ఆధర్మవైరుద్ధ్యాన్ని తొలగించటమంటే ఈజన్మకు దేవయానికి యయాతియే భర్త' అని నిర్ణయించటమనిన్నీ, శుక్రాచార్యుడు అంగీకరిస్తే యయాతి దేవయానిని స్వీకరించటానికి అంగీకరించాడనీ దేవయాని సూచించింది. కూతురు స్వయంగా స్వీకరించిన వరుడిని అంగీకరించి, ఆశీర్వదించి, ధర్మవిరుద్ధం కాకుండా దారిచూపించటం తప్ప మరొకదారి శుక్రుడికి మిగిలించకుండా మాటాడటంలోనే దేవయాని గడుసరితనం ఉన్నది. శుక్రుడు కూడ దేవయానికి యయాతితో కరగ్రహణం కారణంగా వివాహమైనట్లుగానే నిర్ణయించి, దానివలన కలిగే అపక్రమదోషం లేకుండా వరమిచ్చాడు. తనయకు హితం చేద్దామనే ఉద్దేశంతోనే వచ్చిన శుక్రుడు దేవయానిపక్షంలోనే తీర్పిచ్చాడు. కాదు. ఆయనచేత ఆ తీర్పు దేవయాని ఇప్పించింది. నన్నయ దేవయాని పాత్రను మెలకువతో చిత్రించి ప్రసన్నకథాకలితార్థయుక్తిని ప్రదర్శించాడు. శుక్రుడు యయాతితో శర్మిష్ఠ కన్ని సౌకర్యాలూ కలిగించుమని పలికి శయనవిషయాన ఆమెను వర్జించాలి అనగా ఆమె సంగమం పరిహరించాలి అని ఆజ్ఞాపించాడు. ఈ విషయం చాలా ముఖ్య మైనది. యయాతి అట్లా చేయక శర్మిష్ఠతో భోగించి శుక్రుడిశాపానికి గురి అయ్యాడు.

చ. అసదృశయౌవనం బిది యనన్యధనం బగు నొక్కొ! నాకు ని
క్కుసుమ సముద్గమంబును నగోచర దుర్గమ దుర్గవల్లరీ
కుసుమ సముద్గమం బగు నొకో! పతిలాభము లేమిఁ జేసి; యొ
ప్పెసఁగఁగ దేవయాని పతి నేమి తపం బొనరించి కాంచెనో! 74

ప్రతిపదార్థం: అసదృశ యౌవనంబు+ఇది= సాటిలేని నా యీ యౌవనం; అనన్యధనంబు= ఎవరిచేతను అనుభవించబడని సొమ్ము; (ఇతరుల భోగాలకు పాత్రమవక నాయందే జీర్ణించేది); అగున్+ఒక్కొ= అవునేమో; నాకున్; ఈ+కుసుమ, సముద్గమంబును= ఈరజో దర్శనమున్నూ; పతి, లాభము, లేమిన్ చేసి= భర్తృప్రాప్తి లేకపోవటంచేత; అగోచర, దుర్గమ, దుర్గవల్లరీ, కుసుమ, సముద్గమంబు= ఇతరులకు వెళ్ళటానికి శక్యంకాని, దుర్గమందలి లతకు పూవులపుట్టుక; అగున్+ఒకో= దుర్గఅగునా ఏమి; ఒప్పు+ఎసఁగఁ గన్= అందమతిశయించగా; దేవయాని; ఏమి తపంబు= ఏ గొప్పతపస్సు; ఒనరించి= చేసి; పతిన్= భర్తను; కాంచెన్+ఓ= పొందెనో.

తాత్పర్యం: సాటిలేని నా యీ యౌవనం అన్యులకు ఉపభోగ్యం కాక నాయందే జీర్ణించిపోవునా ఏమి! నాకు ఈ రజోదర్శనం (ఋతుమతీత్వం) భర్తృప్రాప్తి లేకపోవటంచేత ఇతరులకు ప్రవేశించేందుకు (వెళ్ళేందుకు) శక్యంకాని కోటలోని లతలకు పూచిన పుష్పాలపుట్టుక అగునా ఏమి? అంద మతిశయించగా దేవయాని ఏమి గొప్పతపం చేసి భర్తను పొందిందో!

విశేషం: కుసుమం అంటే పువ్వు. స్త్రీ రజస్సు అని అర్థాలు ఉన్నాయి. స్త్రీకి కుసుమ సముద్గమం అయింది అంటే ఆమె ఋతుమతి అయినది అని అర్థం. మనుష్యులు చొరలేని దుర్గంలోని లతలపూవులు వికసించి, వాడి వత్త లై పోవటమే కానీ వాటిని ఇతరులు ఉపయోగించేందుకు వీలుండదు. అట్లాగే భర్తృలాభం లేకపోవటంచేత తన ఋతుమతీత్వం కూడ అన్యోపభోగ్యం కాకుండా వ్యర్థ మై పోతుం దని శర్మిష్ఠ విచారిస్తున్నది. అన్యులయొక్కధనం అన్యధనం.

దానికి వ్యతిరేకం అనన్యధనం. స్త్రీయౌవనాన్ని భర్త అనుభవించాలి. అప్పు డది స్వధనం. భర్త అనుభవించకపోతే అది అనన్యధనమై వ్యర్థమై పోతుంది. అలం: కావ్యలింగం. 'కుసుమ' శబ్దంలో శ్లేష. పాత్ర స్వగతాన్ని వాక్యసుందరంగా నాటకీయంగా నన్నయ చిత్రించాడు. దీప్తరసత్వం కలిగిన ఔజ్జ్వల్యం రచనలోని శబ్దగుణం. వాక్యాలచివర క్రమంగా ఒక్కొ, ఒకో, ఓ అనే శబ్దాలు ప్లుతాలయి ఆమె భావతీవ్రతను ధ్వనింపజేస్తున్నాయి. 'అగోచరదుర్గమదుర్గవల్లరీ కుసుమసముద్గమం బగునొకో' అన్న వాక్యం ఆమె దాసీత్వంలో పొందుతున్న బాధయొక్క గాఢత్వాన్ని వ్యక్తంచేస్తుంది. ఏనాటి కైనా తాను పొందదలచుకొన్న యయాతి తన యౌవనాన్ని ఉపభోగించే అవకాశం లభించదేమో అన్న శంక, నిర్వేదం వ్యక్తంచేసింది. యయాతిని భర్తగా పొందిన దేవయాని అదృష్టాన్ని అసూయతో ప్రశంసించింది. శబ్దగుణంచేత రసభావధ్వని ఇందులో గమ్యమానం. (సంపా.)

క. పతిఁ బడసి సుతులఁ బడయఁగ ।
నతివలు గోరుదురు; గోరినట్టుల తనకుం
బతిఁ బడసి సుతులఁ బడసెను; ।
సతు లీభార్గవికి భాగ్యసంపద నెనయే. 75

ప్రతిపదార్థం: పతిన్= భర్తను; పడసి= పొంది; అతివలు= స్త్రీలు, సుతులన్= కొడుకులను; పడయఁగన్= పొందటానికి; కోరుదురు; కోరిన+అట్టులు+అ= కోరినట్లే; తనకున్; పతిన్= భర్తను; పడసి= పొంది; సుతులన్= కొడుకులను; పడసెను= పొందింది; ఈభార్గవికిన్= శుక్రుడి కూతు రైన ఈ దేవయానికి; సతులు= ఇతరకాంతలు; భాగ్య, సంపదన్= అదృష్ట సంపదయందు; ఎన+ఏ= సాటియా? (కారని భావం).

తాత్పర్యం: స్త్రీలు భర్తను పొంది కుమారులను పొందగోరుతారు. ఈ దేవయాని తాను కోరినట్లే భర్తను పొంది కొడుకులను కూడ పొందింది. అదృష్ట సంపదలో ఈమెకు ఇతరకాంతలు సాటి కారు.

విశేషం: కందపద్యంలో పూర్వ, ఉత్తరార్ధాల నిర్వహణలో (అంటే మొదటి, మూడవ చరణాల నిర్మాణంలో) సమత అనే శబ్దగుణం పోషింపబడింది. లోకంలో అందరు వనితలు కోరుకొనే పతిసౌఖ్యాన్నీ, పుత్రలాభాన్నీ దేవయాని పొందగలిగిందని చెప్పటంలో ఉన్న సమత్వం ఈగుణం వ్యంజింపజేస్తున్నది. అయితే సతులందరూ దేవయానికి సమానం కారు అన్న వాక్యంలో ఈర్ష్య, దైన్యం గోచరిస్తాయి. లోకంలో సతులు తాముకోరుకొన్న పతులను తాము పొందారు. కాని, దేవయాని శర్మిష్ఠ పొందవలసిన పతిని పొందటమేకాకుండా సర్వసతులకు సాధారణధర్మమైన పతిపొందును తాను పొందకుండా నిరోధించింది. నిజానికి ఆపని క్షత్రియవనిత అయిన తాను చేయగలిగిఉండాలి. కాని, ఆ అదృష్టం దేవయానికి దక్కిందని శర్మిష్ఠ దైన్యం. రసభావవ్యంజకమైన గుణవాక్యవిన్యాసం ఇందులోని శిల్పం. (సంపా.)

తరువోజ.

ఈ రాజునంద నా హృదయంబు దవిలి యెప్పుడు నుండు; న న్నీతఁడు గరము
కారుణ్యమునఁ బ్రీతిగలయట్లు సూచుఁ; గమలాక్షి భార్గవకన్య దా నెట్లు
గోరి యీతనిఁ దనకును బతిఁ జేసికొనియె నటుల యేను గోరి లోకైక
భారధురంధరుఁ బరహితు ధర్మపరు నహుషాత్మజుఁ బతిఁ జేసికొందు. 76

ప్రతిపదార్థం: ఈ రాజునందున్+అ= ఈయయాతి మహారాజునందే; నాహృదయంబు= నా చిత్తము; ఎప్పుడున్= ఎల్లప్పుడును; తవిలి ఉండున్= ఆసక్తికలిగి ఉంటుంది; నన్నున్; ఈతఁడు= ఈయయాతి; కరము= మిక్కిలి; కారుణ్యమునన్= దయతో; ప్రీతి, కల, అట్లు= ప్రేమ ఉన్న విధాన; చూచున్; కమల+అక్షి= పద్మాలవంటి నేత్రాలు కలిగిన; భార్గవకన్య= శుక్రుడికూతు రైన దేవయాని; తాన్, ఎట్లు= తా నేవిధంగా; కోరి; ఈతనిన్= ఈయయాతిని; తనకును; పతిన్= భర్తను; చేసికొనియెన్= చేసికొన్నదో; అటులు+ఆ= అట్లే (అలాగే); ఏను= నేను కూడ; కోరి; లోక+ఏక+భార ధురంధరున్= లోకంయొక్క మొత్తం బరువును (భారాన్ని) వహించే వాడిని;

పరహితున్= ఇతరులకు మేలు చేసేవాడిని; ధర్మపరున్= ధర్మమందు ఆసక్తికలవాడిని; నహుష+ఆత్మజున్= నహుషుడి కుమారు డైన యయాతిని; పతిన్= భర్తను; చేసికొందున్.

తాత్పర్యం: ఈ యయాతిమహారాజునందే నాచిత్త మెప్పుడూ ఆసక్తి కలిగి ఉన్నది. న న్నా రాజు మిక్కిలి దయతో, ప్రేమ తో చూస్తాడు. పద్మాలవంటి నేత్రాలు కల శుక్రుడికూతు రైన దేవయాని తా నేవిధంగా వాంఛించి యయాతిని తనకు భర్తగా చేసికొన్నదో అట్లాగే నేనుకూడ కోరి లోకంయొక్క మొత్తంభారం వహించే వాడూ, ఇతరులకు మేలు చేసేవాడూ, ధర్మమం దాసక్తి కలవాడూ, నహుషుడి కుమారుడూ అయినట్టి ఈ యయాతిని భర్తగా చేసికొంటాను.

విశేషం: లోక+ఏక= లోకైక - వృద్ధిసంధి. తరువోజ దేశీవృత్తం: రెండు ద్విపదపాదము లైతే ఒక్క తరువోజపాద మౌతుంది. అనగా ఒక్కొక్క పాదానికి మూడింద్రగణాలు ఒక సూర్య గణం, మరల మూడింద్రగణాలు ఒక సూర్యగణం ఉంటాయి. ప్రాసనియమం కలదు. యతిమైత్రి పూర్వోత్తరార్ధములందు మొదటి గణం మొదటి అక్షరానికీ, మూడవగణం మొదటి అక్షరానికీ. నన్నయప్రసన్న కథాకలితార్థయుక్తి కీపద్యము చక్కని ఉదాహరణం. పాత్ర సంభాషణ ద్వారా పూర్వాపర కథార్థాలను భావింపజేయటం వలన కథను ప్రసన్నం చేసే ప్రక్రియను ఇందులో నన్నయ ప్రదర్శించాడు. అలనాడు వనంలో యయాతి' అతిశయ రూపలావణ్యగుణసుందరి (3.158)'గా శర్మిష్ఠను దర్శించాడు. తొలిచూపును వర్ణించి వదలిన నన్నయ ఆ అంశాన్ని చెప్పటానికి వీలులేక మానివేశాడు. కాని, ఇక్కడ శర్మిష్ఠ తలపులో ఆ కథను పూరిస్తున్నాడు. ప్రథమ వీక్షణంలో శర్మిష్ఠ యయాతిని వలచింది. నాటినుండి ఆమె అతడిని ఎల్లప్పుడు మనస్సులో స్మరిస్తున్నది. యయాతికూడ ఆమెను చూచినప్పుడెల్లా మనసులో ప్రీతి ఉన్నట్లు చూస్తాడు. ఇరువురు అనురక్తులైనట్లు ఆ చూపులే సాక్షులు. అయితే, యయాతిని భర్తగా పొందిన అదృష్టం మాత్రం దేవయానికి దక్కింది. దేవయాని ఏవిధంగా తనంతట తాను కోరి యయాతిని భర్తగా పొందిందో, శర్మిష్ఠకూడా ఆవిధంగానే

పొందాలని ఉవ్విళ్లూరింది. అంటే శర్మిష్ఠా యయాతుల హృదయాలలో ప్రణయబీజం గూఢంగానే ఉండిపోయింది. అది అంకురించి, పుష్పించి, ఫలించటానికి అదను రావలసి ఉన్నదని వ్యంగ్యార్థ సంయోజనంవలన తెలిసికొనాలి. (సంపా.)

యయాతి శర్మిష్ఠకుఁ బుత్రదానంబు సేయుట (సం.1-77-10)

వ. అని విచారించుచున్న యవసరంబున దాని పుణ్యస్వరూపంబు సన్నిహితం బైన య ట్లొక్కనాఁడు యయాతి యశోకవని కాలోకన తత్పరుండైవచ్చువాఁ డేకతంబ యున్న శర్మిష్ఠం గనిన, నదియును సంభ్రమ వినయావనత యై తనవలన నమ్మహీపతి ప్రసన్నచిత్తుం డగుట యెఱింగి కరకమలంబులు మొగిచి యి ట్లనియె. 77

ప్రతిపదార్థం: అని; విచారించుచున్+ఉన్న= తలపోస్తున్న; అవసరంబునన్= సమయమందు; దాని= శర్మిష్ఠయొక్క; పుణ్యస్వరూపంబు= పుణ్యంయొక్క స్వరూపం; సన్నిహితంబు+ఐన, అట్లు= దగ్గరగా వచ్చినట్లు; ఒక్కనాఁడు= ఒకరోజున, యయాతి; అశోక, వనికిన్= అశోక వనానికి; ఆలోకన, తత్పరుండు+ఐ= చూడటంలో ఆసక్తికలవా డై (అశోకవనికా+ఆలోకన తత్పరుండు+ఐ- అన్న సమాసంకూడ చేయవచ్చు.); వచ్చువాడు; ఏకతంబు+ అ= ఒంటరిగా (ఆలోచనకు తగినచోట) ఉన్న; శర్మిష్ఠన్; కనినన్= చూడగా; అదియును= ఆ శర్మిష్ఠ కూడ; సంభ్రమ, వినయ+అవనత+ఐ= వేగిరపాటుతో కూడిన వినయంతో వంగినదై; తన వలనన్= తనపై (ఎడ); ఆ+మహీపతి= ఆ రాజు; ప్రసన్న, చిత్తుండు+అగుట= ప్రసన్న మైన హృదయం కలవా డవటం, దయతో (ప్రసాదంతో) కూడిన హృదయం కలవా డవటం; ఎఱింగి= తెలిసికొని; కరకమలంబులు= పద్మాలవంటిచేతులు; మొగిచి= మోడ్చి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా పలికింది.

తాత్పర్యం: అని శర్మిష్ఠ భావిస్తున్న సమయంలో మూర్తీభవించిన ఆమెపుణ్యం దగ్గరకు వచ్చిందా (సమీపించిందా) అన్నట్లు ఒకరోజు యయాతి అశోకవనాన్ని

చూడటానికి ఆసక్తి కలవాడై వచ్చి ఒంటరిగాఉన్న శర్మిష్ఠను చూడగా ఆమె కూడా వేగిరపాటుతోను, వినయంతోను నమ్రయై తనయెడ ఆ రాజు అనుగ్రహంతో కూడిన హృదయం కలవా డవటం తెలిసికొని హస్తపద్మాలు మోడ్చి యిట్లా పలికింది.

విశేషం: అలం: ఉత్ప్రేక్ష.

ఉ. నీలగళోపమాన! కమనీయగుణోన్నతిఁ జెప్పఁ జాలు న
న్నేలిన దేవయానికి నరేశ్వర! భర్తవు గాన నాకునుం
బోలఁగ భర్త వీవ; యిది భూనుత! ధర్మపథంబు; నిక్కువం;
బాలును దాసియున్ సుతుఁడు నన్నవి వాయనిధర్మముల్ మహిన్78

ప్రతిపదార్థం: నీలగళ+ఉపమాన= నల్లనికంఠం కలిగిన శివుడు ఉపమానంగా కలవాడా (శివునితో సమానుడా!); నర+ఈశ్వర= రాజా!; కమనీయ, గుణ+ఉన్నతిన్= అందమైనగుణాలయొక్క మహిమయందు; చెప్పన్+చాలు= చెప్పటానికి తగిన (అంటే గొప్పగుణాలు కలవారిలో పరిగణించదగిన); నన్నున్+ఏలిన= నన్ను పాలించే; దేవయానికిన్; భర్తవు; కాన= కాబట్టి; నాకునున్= సేవకురాలైన నాకుకూడ; పోలఁగన్= తగినట్లుగా; భర్తవు+ఈవు+అ= మగడివి నీవే; భూనుత= భూమిచే (లోకులచేత) నుతింపబడువాడా; ఇది= స్వామినికి భర్త అయినవాడు సేవకురాలికి కూడ భర్త కావటం; ధర్మపథంబు= ధర్మమార్గం; నిక్కువంబు= యథార్థం. ఆలును= భార్యయు; దాసియున్= సేవకురాలును; సుతుఁడున్= కుమారుడును; అను+అవి= అనేవి; మహిన్= భూమియందు; పాయని; విడువని; ధర్మముల్.

తాత్పర్యం: శివసమానుడ వైన ఓరాజా! అందము లైన గుణాలమహత్త్వంచేత పరిగణించదగిన నాకు యజమానురా లైన దేవయానికి భర్తవు కాబట్టి, నాకు కూడా తగినట్లుగా నీవే భర్తవు. లోకులచేత నుతించబడేవాడా! ఇది

ధర్మమార్గం; యథార్థం. ఈ లోకంలో భార్య, సేవకురాలు, కుమారుడు అనేటటువంటివి విడువని (పరస్పరం విడదీయరాని) ధర్మాలు (విధులు).

విశేషం: ధర్మములు అన్నచోట అర్థములు అనే పాఠాంతర మున్నది. అర్థములు= సొమ్ములు. ఈ పద్యంలో శర్మిష్ఠను వివేకవతిగా నన్నయ చిత్రించాడు. దేవయానివలె తానుకూడ యయాతికి భార్య కావటానికి యోగ్యత ధర్మబద్ధంగా ఉన్న దని శర్మిష్ఠ వివరించి చెప్పింది. భార్యతోపాటు, దాసి, సంతానం అనేవి విడదీయలేని ధర్మాలని లోకధర్మంతో సమర్థించింది. దానివలన యజమానురాలైన దేవయానికి భర్తవు అయినట్లే దాసికి కూడ భర్తవౌతావని సూచించింది. ఈధర్మంవలన దేవయాని నియమానికి భంగంరాదు. యయాతి కాదనలేని ధర్మసూక్ష్మాన్ని ప్రతిపాదించి సుముఖుడైన యయాతిని సమ్మతింపచేసే వివేకాన్ని ప్రదర్శించింది. ఈవాక్యాలన్నీ ఒకయెత్తు. 'నీలగళోపమాన!' అన్న సంబోధనం ఒక్కటీ ఒక్కయెత్తు. ఇది భావనారమణీయమైన సూక్తి. విషాన్ని కంఠంలో తాల్చి లోకహితం కొరకు పాటుపడిన శివుడు (మంగళప్రదుడు) నీలకంఠుడు. ఇష్టంలేకపోయినా కష్టమని చెప్పకుండా దేవయానిని భార్యగా స్వీకరించిన ధీరుడు యయాతి. మనస్సు లగ్నమైనా శర్మిష్ఠను స్మరించకుండా ఉదాసీనంగా ఉండిపోయిన ఉదాత్తుడు యయాతి. శర్మిష్ఠపైగల అనురాగాన్ని గూఢంగా దాచుకొన్న లోకపతియైన యయాతి యొక్క తత్కాల హృదయస్థితిని స్ఫురింపజేసే సంబోధనం నిబంధించటంలో ఉన్నది నన్నయ వాగనుశాసనత్వం, రుచిరార్థసూక్తి నిధిత్వం. ఇందలి గుణం మాధుర్యం సార్థకం. (సంపా.) అలం: అర్థాంతరన్యాసం. వ్యా.వి: అనిన, 'ఏడు మొదలగు వాటి సవర్ణమునకు అత్వమును కడహల్లునకు ద్విత్వమును విభాషనగును' అనిన అన్న+అవి: అత్సంధిచే - అన్నవి. అవిలోనిఅకారమునకులోపము, అన్నవి.

వ. 'అద్దేవయానిం బరిగ్రహించినప్పడ తద్ధనం బగుట నేనును భవత్పరి
గ్రహంబ కావున నన్నుం గరుణించి నాకు ఋతుకాలోచితంబుఁ బ్రసాదింప
వలయు' ననిన నయ్యయాతి యి ట్లనియె. 79

ప్రతిపదార్థం: ఆ+దేవయానిన్= ఆ దేవయానిని; పరిగ్రహించిన+అప్పుడు+అ= వివాహమాడినప్పుడే; తద్+ధనంబు+అగుటన్= ఆమెకు సంబంధించిన ధనాన్ని (సేవకురాల నవటంచేత); ఏనును= నేనుకూడ; భవత్+పరిగ్రహంబు+అ= మీ భార్యనే; కావున; నన్నున్; కరుణించి= దయదలచి, నాకున్; ఋతుకాల+ఉచితంబున్= ఋతుకాలానికి తగిన దానిని (సంగమాన్ని); ప్రసాదింపవలయున్= అనుగ్రహించవలసింది; అనినన్= అని శర్మిష్ఠ పలుకగా; ఆ+యయాతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'మీ రా దేవయానిని పెళ్ళి చేసికొన్నప్పుడే ఆమె దాసినవటం చేత ఆమె సొత్తునైన నేను కూడ మీ భార్యనే. కాబట్టి దయదలచి నాకు ఋతుకాలానికి తగిన సంగమాన్ని అనుగ్రహించవలసిం' దని పలుకగా, ఆ యయాతి ఇట్లా అన్నాడు.

విశేషం: దేవయానివలెనే శర్మిష్ఠకూడ యయాతిని భర్తగా పొందటం విశేషం. దేవయాని భార్య కాబట్టి ఆమె సొత్తైన శర్మిష్ఠకూడ ఆమెవలెనే భోగింపదగినది. కావున శర్మిష్ఠకూడ భార్యయే. భార్యకు భర్త ఋతుకాలోచిత ధర్మాన్ని నిర్వహించటం అవశ్యకర్తవ్యం. క్షత్రియకన్యయైన శర్మిష్ఠ వివాహప్రసక్తి తేకుండా ఉండటం వివేకం. ఆమెను యయాతి గ్రహిస్తే అది గాంధర్వవివాహం అవుతుంది. పెండ్లితంతు లేని సతీపతిధర్మాన్ని ప్రతిపాదించిన శర్మిష్ఠ గడుసరి.

క. **లలితాంగి! శయన మొక్కఁడు ।**
వెలిగా రుచిరాన్నపాన వివిధాభరణా
దుల శర్మిష్ఠకు నిష్టము ।
సొలయక చేయు మని నన్ను శుక్రుఁడు పంచెన్. 80

ప్రతిపదార్థం: లలితాంగి!= సుందరమైన శరీరం కలదానా; శయనము+ఒక్కఁడు= పడక ఒక్కటి మాత్రం; వెలిగాన్= బాహ్యమయ్యేటట్లుగా (విడిచి); రుచిర+అన్నపాన, వివిధ+ఆభరణ+ఆదులన్= రుచిగల భోజన పానీయాలు, పలువిధాలైన అలంకారాలు మొదలైన వాటిచేత; శర్మిష్ఠకున్; ఇష్టము= ప్రియం;

సొలయక= వెనుదీయక; చేయుము; అని; నన్నున్; శుక్రుడు; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: సుందరాంగి వైన ఓ శర్మిష్ఠా! పడక ఒక్కటే తప్ప రుచిగల భోజనపానీయాలు, పలువిధా లైన అలంకారాలు మొదలైనవాటిచేత శర్మిష్ఠవిషయంలో వైముఖ్యం చూపకుండా ప్రీతి కలిగించుమని శుక్రుడు నన్నాజ్ఞాపించాడు.

వ. **'ఏ నమ్మహామునివచనంబున కప్పు డొడంబడితి; నెట్లు బొంకనేర్తు' ననిన శర్మిష్ఠ యి ట్లనియె.** 81

ప్రతిపదార్థం: ఏను; ఆ+మహత్, ముని= గొప్పముని యైన శుక్రుడియొక్క; వచనంబునకున్= మాటకు; అప్పుడు= అతడాజ్ఞాపించినపుడు; ఒడంబడితిన్= అంగీకరించాను; ఎట్లు= ఏవిధంగా; బొంకన్, నేర్తున్= అసత్య మాడగలను? అనినన్= అని యయాతి పలుకగా; శర్మిష్ఠ; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: నేను గొప్పముని అయిన శుక్రుడిమాటకు అప్పుడే అంగీకరించాను. ఇప్పుడేవిధంగా అసత్యమాడగలను? అని యయాతి పలుకగా శర్మిష్ఠ ఇట్లా అన్నది.

క. **చను బొంకఁగఁ బ్రాణాత్యయ ।**
మున, సర్వధనాపహరణమున, వధ గావ
చ్చిన విప్రార్థమున, వధూ ।
జన సంగమమున, వివాహసమయములందున్. 82

ప్రతిపదార్థం: ప్రాణ+అత్యయమునన్= ప్రాణాలకు చేటువచ్చే సమయాన; సర్వ, ధన+అపహరణమునన్= ఉన్న సమస్తధనాన్ని దొంగిలిస్తున్న సమయాన; వధ, కావచ్చిన, విప్ర+అర్థమునన్= హత్య కావించబడేందుకు సిద్ధంగా ఉన్న బ్రాహ్మణుడికొరకు; వధూ, జన, సంగమమునన్= స్త్రీజనాలతో సంభోగవిషయాన; వివాహసమయములందున్= పెళ్ళికాలమందు; బొంకఁగన్= అబద్ధమాడటం; చనున్= తగును.

తాత్పర్యం: ప్రాణాలకు నాశం కలిగే సమయాన, సమస్తధనం అపహరించబడే సమయాన, వధించబడేందుకు సిద్ధంగా ఉన్న బ్రాహ్మణుడిని రక్షించేందుకూ, స్త్రీజనసంగమవిషయానా, పెళ్ళివేళలందూ అసత్య మాడవచ్చును.

విశేషం: ఈవిషయమే భాగవతంలో "వారిజాక్షులందు వైవాహికములందు, ప్రాణ విత్తమాన భంగమందుఁ, జకిత గోకులాగ్ర జన్మరక్షణమందు, బొంకవచ్చు నఘముఁ బొందదధిప!" అనే పద్యంలో చెప్పబడింది. ఇక్కడ వధూజనసంగమం విషయం కాబట్టి పెళ్లిసమయాన యయాతి ఒడంబడిన కారణాన బొంకవచ్చు అని శర్మిష్ఠ చెప్పుతున్నది.

వ. 'ఈ యేనింటియందు నసత్యదోషంబు లేదని మునివచనప్రమాణంబు గలదు; నీవు వివాహసమయంబున నొడంబడితివి కావున నసత్య దోషంబునం బొంద' వనిన నయ్యయాతి యొడంబడి శర్మిష్ఠకు నభిమతం బొనరించె; నదియుఁ దత్సమాగ మంబున గర్భిణి యై కొడుకుం గనిన విస్మయపడి దేవయాని దానికడకు వచ్చి యి ట్లనియె. 83

ప్రతిపదార్థం: ఈ యేనింటి యందున్= ఈ అయిదింటిలోను; అసత్య, దోషంబు= అబద్ధం ఆడటంవలన దోషం; లేదు+అని; ముని, వచన, ప్రమాణంబు= మునీంద్రులు చెప్పిన మాట అనే ప్రమాణం; కలదు; నీవు; వివాహ, సమయంబునన్= పెళ్ళాడే సమయంలో; ఒడంబడితివి= అంగీకరించావు; కావునన్; అసత్యదోషంబునన్= అబద్ధమాడటం వలని పాపంతో (పాపాన్ని); పొందవు= పొందవు (కలయవు); అనినన్= అంగీకరించి; శర్మిష్ఠకున్; అభిమతంబు= ఇష్టం; ఒనరించెన్= చేశాడు; అదియున్= శర్మిష్ఠ కూడ; తద్+సమాగమంబునన్= అతనితోడి కలయికచేత; గర్భిణి+ఐ= గర్భవతి అయి; కొడుకున్, కనినన్= ప్రసవించిగా; విస్మయపడి= ఆశ్చర్యపడి; దేవయాని; దాని, కడకున్= శర్మిష్ఠవద్దకు; వచ్చి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'పైన చెప్పబడిన ఐదువిషయాలలోను అబద్ధ మాడటంవలన పాపం లేదని మునీశ్వరులవచన మనే ప్రమాణం ఉన్నది. నీవు పెళ్ళిసమయంలో అంగీకరించావు కాబట్టి అబద్ధం దోషం పొందవు' అని శర్మిష్ఠ పలుకగా యయాతి అంగీకరించి శర్మిష్ఠకు ప్రీతి కావించాడు. శర్మిష్ఠకూడ యయాతితోడి కలయికచేత గర్భవతి అయి పుత్రుడిని కన్నది. అది చూచి దేవయాని ఆశ్చర్యపడి శర్మిష్ఠదగ్గరకు వచ్చి ఇట్లా పలికింది.

విశేషం: అసత్య దోషంబునన్+పొందవు= ఇక్కడ పొందుధాతువు అసమాపక క్రియగా వాడబడింది. విస్మయము+పడి= పడు మొదలైనవి పరమయ్యేటప్పుడు మువర్ణానికి లోపంగాని పూర్ణబిందువుగాని వస్తుంది. ఇచ్చట లోపం వచ్చింది.

తే. బాల వయ్యు నత్యుత్తమశీలవినయ।
గౌరవాన్విత వై నిర్వికారవృత్తి
నున్న నీ కున్నయునికిన సన్నుతాంగి!।
సుతుఁడు పుట్టుట యిది గడుఁజోద్య మయ్యె. 84

ప్రతిపదార్థం: సన్నుత+అంగి= పొగడబడిన అంగాలు కలదానా; బాలవు+అయ్యున్= వయసులో చిన్నదానివి అయికూడా, అతి+ఉత్తమ, శీల, వినయ, గౌరవ, అన్వితవు+ఐ= మిక్కిలి శ్రేష్ఠ మైన శీలంతోను, గౌరవంతోను కూడినదానివై; నిర్వికారవృత్తిన్= వికారం లేని వ్యాపారంతో; ఉన్న= వర్తిస్తున్న; నీకున్; ఉన్న ఉనికిన్+అ= ఉన్నట్లుండగానే; (ఎవరికీ తెలియకుండానే); సుతుఁడు, పుట్టుట, ఇది= కొడుకుపుట్టటమనేది; కడున్; చోద్యము; అయ్యెన్= మిక్కిలి ఆశ్చర్యకర మైనది.

తాత్పర్యం: ఓ సుందరాంగి! బాలికవై కూడా, శ్రేష్ఠ మైన శీలంతోను, వినయంతోను, గౌరవంతోను కూడినదానివై మనోవికారం లేని వ్యాపారంతో ఉన్న నీకు ఉన్నట్లుండి కొడుకు పుట్టటం చూడగా మిక్కిలి ఆశ్చర్యంగా ఉన్నది.

విశేషం: ఈపద్యంలో శర్మిష్ఠకు వాడబడిన విశేషణాలు ఆమె వయసును, ప్రవర్తనను, వికారం లేని సచ్చరిత్రను సూచిస్తున్నాయి. అట్టి ఆమెకు ముం

దెవరికీ తెలియకుండగానే, కుమారుడు పుట్టటం అన్నది ఆశ్చర్యకరంగా ఉన్నది. అది దేవయాని హృదయంలో శంకను కలిగించింది.

వ. అది యె ట్లని యడిగిన శర్మిష్ఠ లజ్జావనతవదన యయి యి ట్లను; 'నెందేనినుండి యొక్కమహాముని నిఖిల వేదవేదాంగపారగుండు వచ్చి ఋతుమతినై యున్న నన్నుం జూచి నాకుఁ బుత్త్రోత్పత్తిఁ బ్రసాదించె' ననిన విని దేవయాని నిజనివాసంబునకుం జనియె; శర్మిష్ఠయు నయ్యయాతి వలనఁ గ్రమంబున ద్రుహ్యను పూరు లనంగా ముమ్వురు గొడుకులం బడసి యున్నంత, నొక్కనాఁడు. 85

ప్రతిపదార్థం: అది, ఎట్లు= కుమారుడు పుట్టటం ఎట్లా జరిగింది; అని, అడిగినన్= అని దేవయాని అడుగగా; శర్మిష్ఠ, లజ్జా+అవనత, వదన అయి= సిగ్గుచేత వంగిన ముఖం కలదై; ఇట్లు+అనున్= ఇట్లా పలికింది; ఎందున్+ఏని+ఉండి= ఎక్కడ నుండియో; ఒక్క మహత్, ముని= ఒక గొప్పముని; నిఖిలవేద, వేద+అంగ, పారగుండు= అన్ని వేదాలయొక్క, వేదాంగాలయొక్క అంతం చూచిన వాడు; వచ్చి; ఋతుమతిన్+ ఐ+ఉన్న= పుష్పవతి నై ఉన్న; నన్నున్; నాకున్; చూచి; పుత్త్ర+ఉత్పత్తిన్= కొడుకు కాన్పును; ప్రసాదించెన్= అనుగ్రహించాడు; అనినన్= అని శర్మిష్ఠ పలుకగా; విని; దేవయాని. నిజనివాసంబునకున్= తన యింటికి; చనియెన్= వెళ్ళింది. శర్మిష్ఠయున్= శర్మిష్ఠకూడ, ఆ+యయాతివలనన్; క్రమంబునన్= వరుసగా; ద్రుహ్యు+అను, పూరులు అనంగాన్=ద్రుహ్యు; అనువు, పూరుడు అనే పేర్లుతో ఒప్పే ముమ్వురుకొడుకులన్; పడసి= పొంది; ఉన్న+అంతన్= ఉండగా; ఒక్కనాఁడు= ఒకరోజు.

తాత్పర్యం: నీకు కొడుకు పుట్టటం ఎట్లా జరిగిం దని దేవయాని అడుగగా శర్మిష్ఠ సిగ్గుతో ముఖం వంచుకొని ఇట్లా అన్నది: 'ఎక్కడినుండియో సమస్త వేదాలను, వేదాంగాలను బాగా చదివిన ఒక గొప్పముని వచ్చి ఋతుకాలమం

దున్న నన్ను చూచి నాకు పుత్త్రజన్మను అనుగ్రహించాడు' - అని శర్మిష్ఠ పలుకగా విని దేవయాని తన గృహానికి వెళ్ళింది. శర్మిష్ఠకూడ ఆ యయాతివలన వరుసగా ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే ముగ్గురు కొడుకులను పొంది ఉండగా ఒక్కరోజున.

విశేషం: ఋగ్యజుస్సామాథర్వణ వేదాలు నాలుగు. శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, కల్పం, నిరుక్తం, జ్యోతిషం అనే ఆరు వేదాంగాలు, ద్రుహ్యు+అను= ద్రుహ్యను - యణాదేశసంధి. వివాహవిషయాలలో బొంకు లాడినా అసత్యదోషం రాదని చెప్పిన శర్మిష్ఠ ఇక్కడ తాను ఆ ధర్మాన్నే పాటించిందని చెప్పేటట్లు వ్యవహరించింది. పుత్రసంతానం ఇచ్చింది యయాతికాని ముని కాదు. అయినా, అట్లా చెప్పినా దోషం లేదని శర్మిష్ఠభావం.

సీ. కరువలిచేఁ దూలుకపిల జటాలియ ।
కరమొప్పు శిఖలుగాఁ గనకరత్న
మయజాల భూషణామలదేహదీప్తుల ।
తేజంబుగాఁ బ్రవిదీప్యమాన
యాగశతంబుల నర్చితం బైన మూఁ ।
డగ్నులు ప్రత్యక్ష మైన యట్లు
దనమ్రోల శర్మిష్ఠతనయులు గ్రీడించు ।
చుండంగ నున్న యయ్యుర్వీశేని

ఆ. కడకు నేఁగుదెంచెఁ గన్యలు దనుజాధి!
రాజసుతయుఁ దోడరాఁగ నొప్పి
దేవి దేవయాని దేవేంద్రుదేవియ ।
పోలె నెంతయును విభూతి మెఱసి. 86

ప్రతిపదార్థం: కరువలిచేన్= గాలిచేత; తూలు= చలించు; కపిల, జట+ఆళి+అ= గోరోజనంవంటి రంగు గల జడల యొక్క సముదాయమే; కరము+ఒప్పు= మిక్కిలి అందగించు; శిఖలు, కాన్= సిగలుగా; కనక,

రత్నమయ, జాల, భూషణ, అమల దేహ, దీప్తులు+అ= బంగారంతోను, రత్నాలతోను కూడిన కవచాలవలె, నగలవలె నిర్మల మైన శరీరంయొక్క కాంతులే; తేజంబుకాన్= తేజస్సుగా; ప్రవిదీప్య మాన యాగ శతంబులన్= మిక్కిలి ప్రకాశిస్తున్న నూరు యజ్ఞాల యందు; అర్చితంబు+ఐన= పూజించబడిన; మూడు+అగ్నులు= త్రేతాగ్నులు; ప్రత్యక్షము+ఐన+అట్లు= ఎదుట సాక్షాత్కరించినట్లు; తనమ్రోలన్= తన ఎదుట; శర్మిష్ఠ తనయులు= శర్మిష్ఠకుమారులు; క్రీడించుచున్+ఉండంగన్= ఆడుతుండగా; ఉన్న; ఆ+ఉర్వీశేని కడకున్= ఆ యయాతి మహారాజు చెంతకు; కన్యలు= చెలికత్తె లైన ఇతర కన్యకలునూ; దనుజ+అధిరాజు సుతయున్= రాక్షస రా జైన వృషపర్వుడి కూతు రైన శర్మిష్ఠయునూ; తోడన్, రాఁగన్= తనవెంట రాగా; ఒప్పి= ప్రకాశించి; దేవేంద్రు, దేవి+అ, పోలెన్= దేవతల రా జైన, ఇంద్రుడి పట్టమహిషి యైన శచీదేవివలె; ఎంతయును= మిక్కిలి; విభూతి= వైభవం; మెఱసి= ప్రకాశించి; దేవి, దేవయాని= పట్టమహిషి యైన దేవయాని; ఏఁ గుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: గాలిచేత కదిలే కపిలవర్ణం గల జడలసమూహమే మిక్కలి సుందర మైన సిగలుగా, బంగారంతోను, రత్నాలతోను, నిండిన (కవచాలవలె) నగలవలె నిర్మల మైన శరీరకాంతులే తేజస్సుగా ప్రకాశిస్తున్న వందలకొలది యజ్ఞాలయందు పూజించబడిన త్రేతాగ్నులు సాక్షాత్కరించినట్లు తన ఎదుట శర్మిష్ఠకుమారు లైన ద్రుహ్యుడు మొదలైన వారు ఆడుతుండగా ఉన్న ఆ యయాతిమహారాజువద్దకు కన్యకలునూ, వృషపర్వుడి కూతురైన శర్మిష్ఠయునూ తనవెంట రాగా దేవేంద్రుడి పట్టమహిషి యైన శచీదేవివలె వైభవం మెరయ పట్టమహిషి యైన దేవయాని వచ్చింది.

విశేషం: ('కనకరత్నమయజాల' లోని 'జాల' అన్నపదానికి కవచ మని అర్థం చెప్పాల్సి వచ్చింది. జాల అనగా సమూహమని అర్థ మున్నది కాని అప్పుడు అది భూషణ అన్నపదం తరువాత ఉండాలి) ఆ బాలురు అలంకారాదులు

లేకపోయినా సహజకాంతిచేతనే ప్రకాశిస్తున్నా రని కవిభావం. గార్హపత్యము, దక్షిణాగ్ని, ఆహవనీయము అనేవి మూడు త్రేతాగ్నులు. శర్మిష్ఠకుమారులు త్రేతాగ్నులవలె ఉన్నారనటం చేత ఆమెవలననే యయాతి గృహస్థధర్మం సార్థకమైనదనీ, వంశకర్తను ఆమెవలననే పొందగలిగాడనీ భావికథార్థ ధ్వని. అలం: మొదటి మూడుపాదాలలో రూపకం, ఉత్ప్రేక్షల సంకరం ఉన్నది. ఎత్తుగీతిలో ఉపమ ఉన్నది.

వ. ఇ ట్లరుగుదెంచి యధికతేజస్వులయి యయాతి ప్రతిబింబంబులుం బోని యబ్బాలకులం జూచి' యిక్కుమారు లెక్కడి వా? రెవ్వరికొడుకు? లని యయాతి నడిగి యలబ్ధప్రతివచనయై 'మీ తల్లిదండ్రులెవ్వ' రని యక్కుమారుల నడిగిన. 87

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; అరుగుదెంచి= వచ్చి; అధిక, తేజస్వులు, అయి= మిక్కిలితేజస్సు కలవా రై; యయాతి ప్రతిబింబంబులున్, పోని= యయాతియొక్క మాఱురూపాలవంటి; (యయాతిరూపం వంటి రూపం కల); ఆ+బాలకులన్= ఆ కుమారులను; చూచి; ఈ+కుమారులు; ఎక్కడి వారు; ఎవ్వరి కొడుకులు; అని; యయాతిన్; అడిగి; అలబ్ధ ప్రతివచన+ఐ= పొందబడని సమాధానం కలదై; మీ తల్లి దండ్రులు= మీ తల్లి, తండ్రి; ఎవ్వరు; అని; ఆ+కుమారులన్; అడిగినన్= దేవయాని అడుగగా.

తాత్పర్యం: (దేవయాని) ఈవిధంగా వచ్చి అధిక మైన తేజస్సు కలిగి యయాతి రూపంవంటి రూపం కల శర్మిష్ఠ కుమారులను చూచి 'ఈకుమారులు ఏప్రదేశానికి చెందినవారు? ఎవ్వరి కొడుకులు?' అని యయాతిని అడిగింది. యయాతి సమాధానం చెప్పకపోతే, 'మీ తల్లిదండ్రు లెవ్వరు? అని ఆ కుమారులనే అడిగింది.

క. తరుణప్రదేశినులు మా।
సరముగ వారలు యయాతి శర్మిష్ఠలఁ జూ

పిరి తండ్రియుఁ దల్లియు నని ।
కర మనురాగిల్లెఁ గన్యకానివహంబున్. 88

ప్రతిపదార్థం: వారలు= ఆ కుమారులు; తరుణ, ప్రదేశినులు= లేత చూపుడువేళ్ళు; మాసరముగన్= దీర్ఘం కాగా; తండ్రియున్, తల్లియున్+అని; యయాతి శర్మిష్ఠలన్= యయాతి మహారాజును; శర్మిష్ఠను; చూపిరి; కన్యకా, నివహంబున్= కన్యలయొక్క సముదాయం కూడ; కరము= మిక్కిలి; అనురాగిల్లెన్= ప్రీతిపొందెను.

తాత్పర్యం: ఆ కుమారులు లలితము లైన చూపుడువ్రేళ్ళు దీర్ఘాలు కాగా వీరు మా తండ్రి తల్లి అని యయాతి శర్మిష్ఠలను చూపించారు. ఆ దృశ్యం చూచి అక్కడి కన్యకలసముదాయం మిక్కిలిప్రీతిని పొందారు.

విశేషం: ఇక్కడ మీతండ్రీ, తల్లీ ఎవ్వరని దేవయాని అడుగగా కుమారులు చూపుడు వ్రేళ్ళతో వరుసగా యయాతి శర్మిష్ఠలను చూపించటం చాలా సహజంగా ఉన్నది. సామాన్యంగా లోకంలో తల్లిదండ్రు లెవ రని అడుగుతారు. కాని, ఇక్కడ తండ్రిఎవరో ముందు తెలియాలి. తల్లిఎవరో ఆతరువాత; కాబట్టి ఇక్కడ ఆ పదాల వరుస మారింది.

వ. ఇట్లు ద న్నెఱుంగకుండ యయాతి శర్మిష్ఠవలన లబ్ధసంతానుం డగుట యప్పు డెఱింగి. 89

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; తన్నున్+ఎఱుంగక+ఉండ= తనసంగతి తెలిసికొనకుండా, తనకు తెలియకుండా; యయాతి; శర్మిష్ఠవలనన్; లబ్ధ సంతానుండు+ అగుట= పొందబడిన సంతానం కలవా డౌట; అప్పుడు; ఎఱింగి= దేవయాని తెలిసికొని.

తాత్పర్యం: ఈవిధంగా తనసంగతి తెలిసికొనకుండా (తనకు తెలియకుండా) యయాతి శర్మిష్ఠవలన సంతానాన్ని పొందటం అప్పుడు తెలిసికొని.

విశేషం: తా నెరుగకుండా అని ఉంటే ఎక్కువ ఉచితంగా ఉండేదని కొందరు భావిస్తారు. కాని, తనకు తెలియకుండా, తనసంగతి తెలియకుండా అని రెండర్థాలు వచ్చేటట్లు వాడి నన్నయ ప్రకృత, భావికథార్థవ్యంజకత్వాన్ని సాధించాడు. తనకు తెలియకుండా యయాతి శర్మిష్ఠవలన సంతానంపొందటంలో దోషం యయాతియందే ఉన్నదని ఆమె భావించింది. ఆపని యయాతి ఆమెసంగతి (శక్తియుక్తులు) తెలియకచేశాడని అభిమానపడి తనతండ్రిచేత శాపాన్ని ఇప్పించింది. భర్త తనపట్ల చేసిన ఈ అపరాధానికి ప్రతీకారం చేయాలని భావించే దేవయాని దురహంకారిణి.

చ. పతివిహితానురాగమున భార్గవపుత్త్రి యయాతిచేత వం
చిత యయి, వాఁడు దానవికిఁ జేసిన నెయ్య మెఱింగి, కోపదుః
ఖిత యయి, తండ్రిపాలి కతిఖేదమునం జని, దీర్ఘనేత్రని
ర్గతజలధారలం గడిగెఁ గాంత తదీయ పదాబ్జయుగ్మమున్. 90

ప్రతిపదార్థం: పతివిహిత+అనురాగమునన్= భర్తకు విధింపబడిన ప్రేమవిషయంలో భార్గవపుత్త్రి= శుక్రుడికూతు రైన దేవయాని; యయాతిచేతన్; వంచిత+అయి= మోసగించబడిన దై; వాఁడు= యయాతి; దానవికిన్= రాక్షసస్త్రీ యైన శర్మిష్ఠకు; (శర్మిష్ఠయందు అని అర్థం:) చేసిన; నెయ్యము= ప్రేమ; ఎఱింగి= తెలిసికొని; కోపదుఃఖిత, అయి= కోపంచేత దుఃఖం పొందినదై; తండ్రిపాలికిన్= తండ్రి యైన శుక్రుడి చెంతకు; అతిఖేదమునన్= మిక్కిలి శోకంతో; చని= వెళ్ళి; తదీయపద+అబ్జ, యుగ్మమున్= ఆ శుక్రుడి పద్మాలవంటి పాదాలజంటను; దీర్ఘ, నేత్ర, నిర్గత, జలధారలన్= ఆయతములైన కన్నులనుండి బయల్వెడలిన (బయటపడిన) కన్నీటి ధారలచేత; కడిగెన్= తడిపినది. (అతనిపాదాలపై పడి ఏడ్చిన దని భావం.)

తాత్పర్యం: పతి అన్యస్త్రీని ప్రేమించడంచేత, అతనిచేత వంచించబడిన దై శుక్రుడికూతు రైన దేవయాని, యయాతి రాక్షసకన్య యైన శర్మిష్ఠయందు

చేసిన ప్రేమకలాపాన్ని ఎఱిగి కోపాన్ని, దుఃఖాన్ని పొందినదై, మిక్కిలి శోకంతో తండ్రివద్దకు వెళ్ళి తన విశాలనయనాలనుండి జారు కన్నీటిధారలచేత, అతని పాదపద్మయుగాన్ని కడిగింది. (అతడిపాదాలు క్షాళితాలయ్యేంత అధికంగా కన్నీ రోడ్చి ఏడ్చిందని భావం).

విశేషం: ప్రతివిహితానురాగమున అను పాఠాంతరం కలదు. ప్రతివిహితమంటే వ్యతిరేకంగా చేయబడింది. ఇక్కడ యయాతి శర్మిష్ఠను ప్రేమించటం వ్యతిరేకంగా చేయబడిన ప్రేమయే. అందుచేత ఈ పాఠమే ఉచితతరంగా కనబడుతున్నది. ఈపద్యంలో దేవయానికి కలిగిన కోపదుఃఖభావాలు రుచిరార్థరమ్యంగా వర్ణింపబడినాయి, తా నుండగా మరొక వనితను వలచుటవలన అవమానితురాలయింది. తనభర్త శర్మిష్ఠయందు పుత్రులను పొందాడని తెలిసి దేవయాని మండిపడింది. శర్మిష్ఠ పరోక్షంగా తనమీద విజయం సాధించింది. ఆమె అస్తిత్వం అస్తి నాస్తి విచికిత్సలో పడింది. ఆమె అహంకారం దెబ్బతిన్నది. తండ్రిపెట్టిన కట్టడి వీగిపోవటంచేత ఏర్పడిన ఈవిపత్తును గురించి చెప్పుకొనటానికి పుట్టింటికి వెళ్ళింది. తండ్రిపాదపద్మాలను కన్నీటితో కడిగింది. కన్నీటితో పాదాలు కడిగిందనటంలో లక్ష్యార్థం ప్రధానం. పాదాలపై పడి కంటికి కడవకట్టినట్లు దుఃఖించిందని భావం. దాని వలన ఆమె దుఃఖభావతీవ్రత ధ్వనిస్తోంది కాబట్టి ఇక్కడ లక్షణా మూలధ్వని. కన్నీటితో కాళ్ళుకడగట మనేదానివలన దుఃఖం వాచ్యం కావటంవలన అవివక్షితవాచ్యధ్వని. (సంపా.)

శుక్రుఁడు యయాతికి శాపం బిచ్చుట (సం.1-78-24)

వ. అయ్యయాతియు దానిం బట్టువఱుచుచుఁ దోడన చని శుక్రుం గని నమస్కరించి యున్న నద్దేవయాని గద్గద వచన యై 'యధర్మంబున ధర్మంబు గీడ్పఱిచి యిమ్మహీశుం డాసురంబున నాసురియం దనురక్తుం డై పుత్త్రత్రయంబు వడసి నాకవమానంబు సేసె' ననిన విని శుక్రుండు యయాతి కలిగి 'నీవు యౌవనగర్వంబున రాగాంధుండ వై నాకూఁతున

కప్రియంబు సేసితివి కావున జరాభారపీడితుండవు గ' మ్మని శాపం బిచ్చిన నయ్యయాతి శుక్రున కి ట్లనియె. 91

ప్రతిపదార్థం: ఆ+యయాతికూడ; దానిన్= దేవయానిని; పట్టువఱుచుచున్= ఓదార్చుచు; తోడన్+అ= వెంటనే, చని= వెళ్ళి, శుక్రున్= శుక్రుడిని; కని= చూచి; నమస్కరించి; ఉన్నన్= నమస్కారం చేసి ఉండగా; ఆ+దేవయాని; గద్గద, వచన, ఐ= డగ్గుత్తికతో కూడిన మాటలు కలదై; అధర్మంబునన్= అధర్మంచేత; ధర్మంబు= ధర్మాన్ని; కీడ్పఱిచి= కించపరిచి; ఈ+మహీ+ ఈశుండు= ఈరాజు; ఆసురంబునన్= రాక్షస విధాన; ఆసురి, అందున్= రాక్షసస్త్రీయందు; అనురక్తుండు+ఐ= ప్రేమకలవాడై; పుత్త్రత్రయంబు= ముగ్గురు కొడుకులను; పడసి= పొంది; నాకున్; అవమానంబు చేసెన్= పరాభవం చేశాడు; అనినన్= అని దేవయాని పలుకగా; విని; శుక్రుండు; యయాతికిన్= యయాతియెడ; అలిగి= కోపించి; నీవు; యౌవనగర్వంబునన్= యౌవనంవలని గర్వంచేత; రాగ+అంధుండవు+ఐ= ప్రేమచేత గ్రుడ్డివాడి వై; నాకూఁతునకున్= నాకూతు రైన దేవయానికి; అప్రియంబు= అనిష్టం; చేసితివి; కావునన్; జరా, భారపీడితుండవు= ముసలితనంయొక్కభారంచేత బాధించబడిన వాడివి; కమ్ము= అగుము; అని; శాపంబు; ఇచ్చినన్; ఆ+యయాతి; శుక్రునకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: ఆ యయాతికూడ దేవయానిని ఓదారుస్తూ వెంటనే వెళ్ళి శుక్రుడిని దర్శించి నమస్కరించాడు. దేవయాని డగ్గుత్తికతో కూడికొన్న వాక్కులు కలదై ఇట్లా అన్నది: 'ఈ మహారాజు అధర్మంచేత ధర్మాన్ని కించపరిచి రాక్షసపద్ధతిలో రాక్షసకన్య అయిన శర్మిష్ఠను అనురాగంతో గ్రహించి పుత్త్రత్రయాన్ని పొంది నాకు అవమానం చేశాడు'. ఆమెమాటలు విని శుక్రుడు యయాతిమీద ఆగ్రహించి 'నీవు యౌవనగర్వంతో రాగాంధుడ వై నాకూతురికి ఇష్టంలేనిపని చేశావు. కాబట్టి ముసలితనపు బరువుతో పీడింపబడేవాడివి కమ్మ' అని శపించాడు. అప్పుడు ఆ యయాతి శుక్రాచార్యుడితో ఇట్లన్నాడు.

విశేషం: దేవయాని కోపాన్నీ దుఃఖాన్నీ ఉపశమింపచేయటానికి యయాతి ప్రయత్నించాడు. ఆమెవెంట శుక్రాచార్యుడి దగ్గరకు వెళ్ళి నమస్కరించాడు. అయినా ఆ ముని అతడిని పట్టించుకొన్నట్లు లేదు. ఆమె తండ్రితో చెప్పిన మాటలలో ముఖ్యమైన అంశాలు. 1. రాజు అధర్మంచేత ధర్మాన్ని కించపరిచాడు. అంటే అధర్మసంబంధంవలన గృహస్థధర్మాన్ని కించపరిచాడని భావం. 2. అసురుడివలె వ్యవహరించి అసురకన్యను అనురాగంతో స్వీకరించాడు. ఈవాక్యంలో అసురశబ్దం నిందావాచకం. రాక్షసస్త్రీని ఈ రాక్షసుడు ప్రేమించి నన్ను రాక్షసంగా అవమానించాడని భావం. 3. పైపెచ్చు ఆమెయందు ముగ్గురుకొడుకులను పొందాడు. ఇది అచ్చమైన అసూయతో అన్నమాట. పట్టమహిషిఅయిన తనకు ఇద్దరు కొడుకులు. శర్మిష్ఠకు ముగ్గురుకొడుకులు. ఈ మూడింటికి గల మూలకారణం యౌవనంలో కలిగే రాగాంధ్య మని శుక్రుడు నిర్ణయించాడు. దానిని తొలగించే వార్ధక్యాన్ని శాపంవలన యయాతికి కలిగించాడు. శపించటానికి కారణం యయాతి అధర్మవర్తనం అని అనలేదుకాని కూతురుకు చేసిన అప్రియ మని మాత్రం ప్రత్యేకించి పేర్కొన్నాడు. కూతురి అప్రియత్వాన్ని తొలగించటానికి శాపాన్ని ఇచ్చాడు. ఆమె కిమ్మనలేదు కాబట్టి తండ్రి చేసినపని ఆమెకు ఆమోదయోగ్యమే అని వ్యంగ్యం. నాటకీయంగా పాత్రల సంభాషణలు వర్ణిస్తూ కథార్థాలను ప్రసన్నంచేసే నన్నయ ప్రయోగనైపుణ్యం ఇందులో ప్రసన్నమౌతున్నది. (సంపా.)

క. ఋతుమతి యై పుత్త్రార్థము।
పతిఁ గోరిన భార్యయందుఁ బ్రతికూలుం డై
ఋతువిఫలత్వము సేసిన।
యతనికి మఱి భ్రూణహత్య యగు నండ్రు బుధుల్. 92

ప్రతిపదార్థం: ఋతుమతి+ఐ= పుష్పవతి యై; పుత్త్ర+అర్థము= పుత్రుడి నిమిత్తం; పతిన్= భర్తను; కోరిన; భార్యయందున్; ప్రతికూలుండు+ఐ= అనుకూలుడు కానివాడై; ఋతు, విఫలత్వము చేసిన; అతనికిన్= ఋతుకాలంయొక్క వ్యర్థత్వం కావించిన వాడికి; మఱి; భ్రూణహత్య= గర్భమందలి బిడ్డను చంపటం (వలన కలుగు పాపం) అగును; అని; బుధుల్= పండితులు; అండ్రు= అంటారు.

తాత్పర్యం: పుష్పవతి యై భర్తను వాంఛించిన భార్యయెడ ఆనుకూల్యం లేనివాడై ఋతుకాలాన్ని వ్యర్థం చేసిన వాడికి గర్భస్థశిశువును చంపినపాప మౌ తుందని పెద్దలు (చెప్పారు).

విశేషం: ఇది నన్నయసూక్తులలో ఒకటి. యయాతి ఈపద్యంలో ఋతుమతి అయిన సతి పుత్రార్థం పతిని కోరితే, దానిని కాదనటం భ్రూణహత్యచేసినంత దోషం అనే పండితప్రమాణాన్ని పేర్కొన్నాడు. అది- అధర్మంతో ధర్మాన్ని కించపరిచాడన్న దేవయాని వాదాంశానికి సమాధానం. అట్లాచెప్పటంలో యయాతి దేవయానికంటె గడుసరితనాన్ని ప్రదర్శించాడు. యజమానురాలు రాజుకు భార్య అయితే ఆమె సేవకురాలుకూడ ఆయనకు భార్యయే. అయినా, ఆమెకు శయ్యాసుఖం మాత్రం ఈయవద్దని శుక్రుడి కట్టుబాటు. యయాతి తనంతట తాను ఆమె పొందును కోరలేదు. ఆమె ఋతుమతి అయినప్పుడు పుత్రార్థిని యై అతడిని అర్థించింది. ఆకోర్కెను అతడు తీర్చాడు. ఇందులో ధర్మవైరుద్ధ్యం లేదు. పుత్రులకొరకే అయిన సంబంధంవలన శర్మిష్ఠకు ముగ్గురుకొడుకులు పుట్టారు. అందువలన అధర్మంవలన ధర్మం అవమానంపొందలేదని యయాతి వాద తాత్పర్యం. అది ఆసుర మైన ధర్మంకాదనీ మానవీయధర్మ మనీ అతడి అభిప్రాయం.

క. దానికి భీతుఁడ నై య।
మ్మానవతీ ప్రార్థనం గ్రమం బొనరఁగ సం
తానము వడసితి నెదలో।
దీనికి నలుగంగఁ దగునె దివ్యమునీంద్రా! 93

ప్రతిపదార్థం: దివ్యముని, ఇంద్రా= దేవతాముని శ్రేష్ఠుడా, శుక్రాచార్యా!; దానికిన్= భ్రూణహత్యకు; భీతుఁడన్+ఐ= భయపడినవాడి నై; ఆ+మానవతీ

ప్రార్థనన్= అభిమానం కల ఆ శర్మిష్ఠయొక్క వేడికోలుచేత; క్రమంబు= న్యాయం (వరుస) ఒనరఁగన్= సమకూడేటట్లుగా; సంతానము= సంతతి; పడసితిన్= పొందితిని (పొందాను); దీనికిన్= ఈన్యాయమైనదానికి; ఎదలోన్= హృదయంలో అలుగంగన్ తగున్+ఎ= కోపించటం యుక్తమా? (కాదని భావం).

తాత్పర్యం: దేవతామునిశ్రేష్ఠుడ వైన ఓ శుక్రాచార్యా! ఆ భ్రూణహత్యా పాపానికి భయపడి, మానవతి యైన శర్మిష్ఠ కోరికచేత సక్రమంగానే సంతానాన్ని పొందాను. దీనికి హృదయంలో కోపించ తగునా?

వ. 'ఏ నిద్దేవయానియందు విషయోపభోగతృప్తుండఁ గాను, జరాభారంబుఁ దాల్పనోప' నని ప్రార్థించిన విని వానికి శుక్రుండు గరుణించి 'యట్లేని నీముదిమి నీకొడుకులయం దొక్కరునిపయిం బెట్టి వానిజవ్వనంబు నీవు గొని రాజ్యసుఖంబు లనుభవింపుము; నీవు విషయోపభోగ తృప్తుండ వైన మఱి నీముదిమి నీవ తాల్చి, వాని జవ్వనంబు వానికి నిచ్చునది; నీ ముదిమిఁ దాల్చిన పుత్త్రుండ రాజ్యంబున కర్హుండును, వంశకర్తయు నగు' ననిన నయ్యయాతి శుక్రు వీడ్కొని దేవయానీసహితుం డై తనపురంబునకు వచ్చి శుక్రుశాపంబున జరాభారంబుఁ దాల్చిన, వానికి. 94

ప్రతిపదార్థం: ఏను= నేను; ఈ+దేవయానియందున్; విషయ+ఉపభోగ, తృప్తుండన్, కాను= ఇంద్రియ భోగాలను అనుభవించటంలో తృప్తిచెందిన వాడిని కాను; జరాభారంబున్= ముదిమి బరువును; తాల్పన్+ఓపన్= భరించజాలను; అని ప్రార్థించినన్= అని వేడుకోగా; విని; వానికిన్= యయాతియెడ; శుక్రుండు; కరుణించి= దయతలచి; అట్లు+ఏని= నీవు జరాభారం వహించ లేకపోయినట్లయితే; నీ ముదిమి= నీ ముసలితనం; నీ కొడుకులయందున్; ఒక్కరుని, పయిన్; పెట్టి= ఉంచి; వాని జవ్వనంబు= ఆ కొడుకుయౌవనం; నీవు కొని= నీవు గ్రహించి; రాజ్యసుఖంబులు= రాజత్వంవలని సౌఖ్యాలను; అనుభవింపుము; నీవు; విషయ+ఉపభోగ, తృప్తుండవు= ఇంద్రియ భోగాలను అనుభవించటంచేత తృప్తిపొందినవాడివి; ఐన; మరి= అయిన పిమ్మట; నీ ముదిమి= నీ ముసలితనం; నీవు+అ= నీవే; తాల్చి= ధరించి; వాని జవ్వనంబు= ఆ కొడుకుయౌవనం; వానికిన్= ఆ కొడుకుకు; ఇచ్చునది= ఇమ్ము; నీ ముదిమిన్; తాల్చిన; పుత్త్రుండు+అ= కొడుకే; రాజ్యంబునకున్= రాజత్వానికి; అర్హుండును= తగినవాడును; వంశకర్తయున్= వంశాన్ని కొనసాగించేవాడును; అగున్; అనినన్= అని శుక్రుడు పలుకగా; ఆ యయాతి; శుక్రున్= శుక్రుడిని; వీడ్కొని= సెలవు పుచ్చుకొని; (విడిచి) దేవయానీ+సహితుండు+ఐ= దేవయానితో కూడినవా డై; తన పురంబునకున్= తన పట్టణానికి; వచ్చి; శుక్రుశాపంబునన్= శుక్రుడిశాపంచేత; జరాభారంబున్= ముదిమిబరువును; తాల్చిన, వానికిన్= ధరించిన (గ్రహించిన) యయాతికి.

తాత్పర్యం: 'నే నీ దేవయానియందు ఇంద్రియభోగాలను అనుభవించటంలో (చే) తృప్తి పొంది యుండలేదు. అధిక మైన ముసలితనాన్ని వహించలేను' అని యయాతి వేడుకోగా విని వానియెడల శుక్రుడు దయతలచి నీవు ఇంద్రియభోగాలచేత తృప్తిపొందనివాడ వైతే నీ ముసలితనాన్ని నీకొడుకులలో ఒకడికి ఇచ్చి, వాడి యౌవనాన్ని నీవు గ్రహించి రాజ్యసుఖాలను అనుభవించుము; నీవు ఇంద్రియభోగాలవలన తృప్తి పొందినతరువాత నీముసలితనాన్ని నీవే తిరిగి గ్రహించి, నీ కొడుకుయౌవనాన్ని వాడి కిచ్చివేయుము. నీ ముసలితనాన్ని గ్రహించిన కొడుకే రాజ్యం చేయటానికి తగినవాడున్నూ వంశాన్ని కొనసాగించేవాడున్నూ అవుతా' డని పలుకగా ఆ యయాతి శుక్రుడిని వీడ్కొని దేవయానితో కూడినవా డై తనపట్టణానికి వచ్చి శుక్రుడు ఇచ్చిన శాపంవలన ముదిమి వహించాడు. ఆ తరువాత యయాతికి. (తరువాతి పద్యంతో అన్వయం.)

విశేషం: 'నేను దేవయానియందు విషయోపభోగతృప్తుడను కాను'- అని యయాతి అనటంలో విశేషం ఉన్నది. శర్మిష్ఠతోడి సంబంధం పుత్త్రార్థమే. దేవయానితోడి సంబంధం నిత్య మైనది. రాజులకు అనేక భార్య లుండవచ్చును. కాని, దేవయానియందు అతడికి విషయవాంఛ తీరలేదు. కాబట్టి వార్ధక్యభారంవలన దుఃఖం కలిగేది దేవయానిపొందు లేనందుకే. అది ఆమెకుకూడ ప్రీతిపాత్రం కాదు. అందుచేత జరాభారాన్ని వహించలే నన్నాడు. శుక్రుడు తనపొరపాటు తెలిసికొన్నాడు. దేవయానినోట మాట పెకలలేదు. అటువంటిది యయాతి వాక్యనైపుణ్యం. ఇది వస్తుధ్వని. (సంపా.)

క. తల వడఁకఁ దొడఁగె, నింద్రియ ।
ముల గర్వ మడంగె, నంగములు వదలె,వళీ
పలితంబు లయ్యె, వగరును ।
దలయేరును నుక్కిసయును దరికొనుదెంచెన్. 95

ప్రతిపదార్థం: తల; వడఁకన్+తొడఁగెన్= తలవణకుట మొదలు పెట్టింది; ఇంద్రి యముల= దేహం, నేత్రం మొదలైన కర్మేంద్రియాల; గర్వము= విజృంభణం; అడంగెన్= తగ్గింది; అంగములు= అవయవాలు; వదలెన్= శిథిలాలు అయినవి; వళీ, పలితంబులు= ముడతలున్నూ, నరసిన వెంట్రుకలున్నూ; అయ్యెన్; వగరును= శ్వాస రోగమున్నూ; తల ఏరును= తలనొప్పియున్నూ; ఉక్కిసయును= పొడిదగ్గున్నూ; దరికొనుదెంచెన్= విజృంభించాయి. తలకొనుదెంచెన్ అని పాఠాంతరం. (కలిగాయి లేక సంభవించాయి.)

తాత్పర్యం: తల వణకటం మొదలు పెట్టింది. ఇంద్రియాల మదం అణిగింది. అవయవాలు సడలినాయి; శరీరాన ముడతలు ఏర్పడ్డాయి. వెంట్రుకలు నరిశాయి. ఉబ్బసం, తలనొప్పి, పొడిదగ్గు కలిగాయి.

విశేషం: ఈపద్యంలో ముసలితనపు లక్షణా లన్నీ వర్ణించబడ్డాయి. అలం: స్వభావోక్తి.

యయాతి యదుప్రముఖులకు శాపం బిచ్చుట (సం. 1-79-1)

వ. ఇట్లు జరాక్రాంతుం డైన యయాతి గొడుకులనెల్లరావించి 'నాకు విషయసుఖతృప్తి లేకున్నయది గావున మీయందొక్కరుండు నా ముదిమి గొని తన జవ్వనంబు నా కిచ్చునది' యనిన విని యదు తుర్వసు ద్రుహ్యానులు దండ్రి కి ట్లనిరి. 96

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; జర+ఆక్రాంతుండు= ముసలితనంచేత ఆక్రమించ బడినవాడు; ఐన, యయాతి; కొడుకులన్+ఎల్లన్= కుమారులనందరినీ; రావించి= రప్పించి; నాకున్; విషయ, సుఖతృప్తి= ఇంద్రియ సుఖాల తృప్తి; లేక+ ఉన్న+అది= కలుగకున్నది; కావున; మీయందున్; ఒక్కరుండు= ఒకడు; నాముదిమి= నాముసలితనం; కొని= గ్రహించి; తన జవ్వనంబు= తన యౌవనం; నాకు; ఇచ్చునది= ఇవ్వవలసింది; అనినన్= అని యయాతి పలుకగా; విని; యదు, తుర్వసు, ద్రుహ్య+అనులు= ఆ పేర్లు కలిగిన కొడుకులు; తండ్రికిన్= యయాతికి; ఇట్లు+అనిరి= ఈవిధంగా పలికారు.

తాత్పర్యం: ఈవిధంగా వృద్ధుడైన యయాతి కొడుకులందరినీ తనకడకు రప్పించి 'నాకు ఇంద్రియభోగాలను అనుభవించటంలో తృప్తి కలగక ఉన్నది. కావున మీలో ఒకడు నా ముసలితనం గ్రహించి తనయౌవనాన్ని నాకు ఇవ్వవలసింది' అని యయాతి పలుకగా విని యదువు, తుర్వసుడు, ద్రుహ్యు, అనువు అనే కుమారులు యయాతితో ఇట్లా చెప్పారు.

విశేషం: ద్రుహ్య+అనులు= దుహ్యానులు (యణాదేశసంధి).

ఆ. తగిలి జరయు రుజయు దైవవశంబున ।
నయ్యెనేని వాని ననుభవింత్రు
గాక యెఱిఁగి యెఱిఁగి కడఁగి యారెంటిఁ జే ।
కొందురయ్య యెట్టి కుమతు లైన. 97

ప్రతిపదార్థం: తగిలి= అంటి; జరయున్= ముసలితనమూ; రుజయున్= రోగమూ; దైవవశంబునన్= విధివశాన; అయ్యేన్, ఏని= అయినట్లయితే; వానిని= ఆ జరారోగాలను; అనుభవింత్రు, కాక= అనుభవిస్తారు కాని; ఎఱిఁగి ఎఱిఁగి= బాగా తెలిసి; (తెలిసి తెలిసి); కడఁగి= పూని; ఆ రెంటిన్= ఆ జరారోగాలు రెండింటినీ; ఎట్టి కుమతులు+ ఐనన్= ఎటువంటి బుద్ధిహీను లైనా; చేకొందురు+అయ్య?= గ్రహిస్తారా? గ్రహించరు.

తాత్పర్యం: ముసలితనమున్నూ; రోగమున్నూ విధివశాన ఎవరికైనా కలిగితే వారు వాటిని అనుభవిస్తారు కాని, తెలిసి తెలిసి మరొకరినుండి కావాలని ఆ రెంటింటినీ ఎవరైనా ఎంతబుద్ధిహీను లైనా గ్రహిస్తారా?

విశేషం: అనుభవించుదురు. చువర్ణంతోడి దుక్‌దకారానికి తకారమౌతుంది. అనుభవింతురు. ఉత్వలోపము - అనుభవింత్రు. ఆమ్రేడితం పరమైనను క్త్వార్థక మగుటచేత సంధి కాలేదు - ఎఱిఁగియెఱిఁగి. ఈపద్యం నన్నయ సూక్తి.

క. నరలు గల కాము నైనను।
దరుణులు రోయుదురు డాయ; ధనపతి యయ్యుం
బురుషుఁడు దుర్వారజరా।
పరిభూతి నభీష్టభోగబాహ్యుఁడ కాఁడే. 98

ప్రతిపదార్థం: నరలు, కల= నరసిన వెంట్రుకలు కల; కామున్+ఐనను= మన్మథుడినైనా (అందగాడినైనా) కూడా; తరుణులు= జవ్వనులు; డాయన్= సమీపించటానికి; రోయుదురు= ఏవగిస్తారు. (అసహ్యపడతారు); పురుషుఁడు; ధనపతిఅయ్యున్= కుబేరు డైనా కూడా, అంటే సంపన్నుడైనా కూడ; దుర్వార జరాపరిభూతిన్= వారించ శక్యం కాని ముసలితనంవలని రోతచేత; అభీష్ట భోగ బాహ్యుఁడు+అ= ఇష్టము లైన భోగాలు వెలియైనవాడు; కాఁడు+ఏ= కాడా; అవుతాడు.

తాత్పర్యం: నరసిన వెంట్రుకలు కలిగిన మన్మథుడి నైనా యౌవనవతులు సమీపించటానికి అసహ్యించుకొంటారు. పురుషుడు ధనవంతు డైనా కూడా

(కుబేరుడై నప్పటికి) వారించశక్యం కాని ముసలితనంవలన కలిగేరోతచేత ఇష్టములైన భోగాలు పొంద వీలు లేనివాడు కాడా!

విశేషం: ఇది నన్నయసూక్తి.

వ. అని యొడంబడ కున్న నలిగి యయాతి 'యదువంశంబునవారు రాజ్యంబున కయోగ్యులుగాఁ, దుర్వసు వంశంబునవారు ధర్మాధర్మ వివేకశూన్యు లై సంకీర్ణవర్ణ కిరాతులకు రాజులుగా, ద్రుహ్యువంశంబున వారు డుపప్లవ సంతార్యం బైన దేశంబునకు రాజులుగా, జరాదూషకుం డగుట ననువంశంబునవారు ముదియు నంతకు నుండక జవ్వనంబునన పంచత్వంబున కరుగు వారునుంగా శాపంబిచ్చి, యానలువురకుం గొండుక వాని శర్మిష్ఠాపుత్త్రుఁ బూరుం బిలిచి యడిగిన, వాఁడు దండ్రి కోరినయట్ల చేసిన నవయౌవనుం డైయయాతి యభిమతసుఖంబులు సహస్రవర్షంబు లనుభవించి తృప్తుం డై, పూరుజవ్వనంబు వానిక యిచ్చి, తన జరాభారంబుఁ దాన తాల్చి నిజాజ్ఞావిధేయ చతురంత మహీతల బ్రహ్మక్షత్త్రాది వర్ణముఖ్యుల నెల్ల రావించి మంత్రిపురోహితసామంత పౌరజన సమక్షంబున సకలక్షోణీ చక్రసామ్రాజ్యంబునకుఁ బూరు నభిషిక్తుం జేసిన సర్వప్రకృతిజనంబు లారాజున కి ట్లనిరి. 99

ప్రతిపదార్థం: అని; ఒడంబడక, ఉన్నన్= కొడుకులు ముసలితనం గ్రహించేందుకు అంగీకరించకుండా ఉండగా; యయాతి; యదువంశంబున వారు= యదువు వంశానికి చెందినవారు; రాజ్యంబునకున్= రాజ్యం చేసేందుకు; అయోగ్యులుగాన్= తగనివారౌనట్లుగా (తగని వారుగా); తుర్వసు వంశంబున వారు= తుర్వసు వంశానికి చెందిన వారు; ధర్మ+అధర్మ వివేకశూన్యులు+ఐ= ఇది ధర్మం. ఇది అధర్మం అనేజ్ఞానం లేనివారై; సంకీర్ణ, వర్ణ కిరాతులకున్= సంకరజాతులైన వనచరులకు; రాజులుగాన్= రాజు లౌనట్లుగా; ద్రుహ్యువంశంబున వారు= ద్రుహ్యుని వంశానికి చెందినవారు,

ఉడుప= ఉడుపప్లవ సంతార్యం బైన= తెప్పల చేతను, పడవల చేతను, (పుట్టుల చేతను) దాటటానికి యోగ్య మైన; దేశంబునకున్; రాజులుగాన్= రాజు లౌనట్లుగా; జరాదూషకుండు, అగుటన్= ముదిమిని నిందించిన వా డౌటచేత; అనువంశంబున వారు= అనువు వంశానికి చెందిన వారు; ముదియున్+అంతకున్= ముసలివారయ్యేంత వరకు; ఉండక= జీవించక; జవ్వనంబునన్+అ= యౌవనమందే; పంచత్వంబునకున్= మరణానికి (పంచభూతాలలో కలిసి పోవటానికి); అరుగు వారునున్+కాన్= వెళ్ళేవారు ఔనట్లుగా; శాపంబు+ఇచ్చి; ఆ నలువురకున్= యదువు మొదలైన నలుగురికంటె; కొండుకవానిన్= చిన్నవాడిని; శర్మిష్ఠాపుత్రున్= శర్మిష్ఠా కుమారు డైన; పూరున్= పూరు డనే వాడిని; పిలిచి; అడిగినన్= నా ముసలితనం పుచ్చుకొని నీ యౌవనం ఇస్తావా అని అడుగగా; వాఁడు= ఆ పూరుడు; తండ్రి; కోరిన అట్లు+అ= తండ్రి యైన యయాతి కోరినట్లే; చేసినన్= చేయగా; నవయౌవనుండు+ఐ= క్రొత్త యౌవనం కలవా డై; యయాతి; అభిమత సుఖంబులు= ఇష్టము లైన భోగాలు; సహస్ర వర్షంబులు= వేయి సంవత్సరాలు; అనుభవించి= పొంది తృప్తుండు+ఐ= తృప్తి పొందినవా డై; పూరుజవ్వనంబు= పూరుని యౌవనం; వానికిన్+అ= వానికే; ఇచ్చి; తనజరా, భారంబున్= తన ముదిమి బరువును; తాను+అ= తానే; తాల్చి= వహించి; నిజ, ఆజ్ఞా విధేయ, చతుః+అంత, మహీతల, బ్రహ్మక్షత్ర+ఆది వర్ణముఖ్యులన్, ఎల్లన్= తన ఆజ్ఞకు విధేయ మైన నాలుగు సముద్రాల చేత చుట్టబడిన భూతలమందలి బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలగు వర్ణాలలోని ప్రధానులందరినీ; రావించి= రప్పించి; మంత్రి పురోహిత సామంత పౌరజన సమక్షంబునన్= మంత్రులయొక్క, పురోహితులయొక్క; సామంతరాజులయొక్క; పురజనులయొక్క ఎదుట; సకలక్షోణీ చక్రసామ్రాజ్యంబునకున్= సర్వ భూవలయ సామ్రాజ్యానికి; పూరున్= పూరువును; అభిషిక్తున్+చేసి= అభిషేకించబడినవాడిని చేయగా, సర్వప్రకృతి, జనంబులున్= ఎల్లపురజనులున్నూ; ఆ రాజునకున్; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: అని అంగీకరించకుండాఉన్న కొడుకులను కోపించి యయాతి యదువు వంశానికి చెందినవారు రాజత్వానికి తగని వా రౌనట్లుగా, తుర్వసువంశానికి చెందినవారు ధర్మాధర్మజ్ఞానం లేనివా రై సంకర జాతులకు చెందిన ఆటవికులకు రాజు లౌనట్లుగా, ద్రుహ్యువంశానికి చెందినవారు తెప్పలచే దాటదగిన దేశానికి (జలమయమైన దేశానికి) రాజు లౌనట్లుగా; ముదిమిని నిందించినవా డవటంచేత అనువువంశానికి చెందినవారు ముసలివారయ్యేంత వరకు జీవించక యౌవనంలోనే మరణించువా రౌనట్లుగా శాప మిచ్చి, యదువు మొదలైన నల్గురికంటె చిన్నవాడు, శర్మిష్ఠ కుమారు డైన పూరుడిని పిలిచి అడుగగా అతడు తండ్రి కోరినట్లుగానే తన యౌవనాన్ని తండ్రికి ఇచ్చి, అతని ముసలితనాన్ని తాను గ్రహించాడు. యయాతి నవ (క్రొత్త) యౌవన సమన్వితుడై ఇష్టభోగాలను వేయిసంవత్సరా లనుభవించి తృప్తి పొందినవా డై, అతడి యౌవనాన్ని ఆతడికే ఇచ్చి, తన ముసలితనాన్ని తానే ధరించి తనఆజ్ఞకు వశమైన నాల్గుసముద్రాలు హద్దులుగా గల భూతలమందున్న బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలైన వర్ణాలలోని ప్రధాను లందరినీ రప్పించి మంత్రులు, పురోహితులు, సామంతరాజులు మొదలైన పురజనుల ఎదుట సర్వభూతల సామ్రాజ్యానికి పూరుడిని అభిషేకించాడు. అప్పుడు పురజనులందరూ రాజును చూసి యిట్లా పలికారు.

విశేషం: యదువంశంబు+వారు= తత్పురుషసమాసంలో కొన్నిచోట్ల 'న' ఆగమంగా వస్తుంది. వంశంబున వారు. స్వామి, అమాత్యుడు, సుహృత్తు, కోశము, రాష్ట్రము, దుర్గము, బలము అనునవి సప్తప్రకృతులు.

మ. అవిచారం బని పల్క నోడెదము ధర్మాభిజ్ఞ! నీయగ్రసం
భవుఁ డత్యున్నతశక్తియుక్తుఁడు మహీభారప్రగల్భుండు భా
ర్గవదౌహిత్రుఁడు పాత్రుఁ డీయదుఁడు లోకఖ్యాతుఁ డుండంగ నీ
భువనేశత్వభరంబుఁ బూన్పఁ దగునే పూరున్ జఘన్యాత్మజున్.100

ప్రతిపదార్థం: ధర్మ+అభిజ్ఞ= ధర్మం తెలిసినవాడా!; అవిచారంబు, అని= అనాలోచిత మని; పల్కన్= చెప్పటానికి; ఓడెదము= భయపడుతున్నాము; అతి+ఉన్నతశక్తి యుక్తుఁడు= మిక్కిలి అధిక మైన సామర్థ్యంతో కూడినవాడు; మహీభార, ప్రగల్భుండు= భూమియొక్క బరువును వహించేందుకు సమర్థుడు; భార్గవ దౌహిత్రుఁడు= శుక్రుడి కూతు రైన దేవయానికి కొడుకు;లోకఖ్యాతుఁడు= జగత్తులో ప్రసిద్ధుడు; పాత్రుఁడు= తగిన వాడు (యోగ్యుడు); నీ అగ్రసంభవుఁడు= నీ పెద్దకొడుకు; యదుఁడుఉండంగన్= ఉండగా; ఈ, భువన+ఈశత్వ, భరంబున్= ఈ జగత్ప్రభుత్వ భారాన్ని; జఘన్యా+ ఆత్మజున్= శూద్రస్త్రీయందు పుట్టినకుమారుడిని (చిన్నవాడిని); పూరున్= పూరుడిని; పూన్పన్; తగున్, ఏ= వహింపచేయటం ఉచితమా?

తాత్పర్యం: ధర్మం తెలిసిన ఓ యయాతి మహారాజా! అనాలోచిత మని చెప్పటానికి జంకుతున్నాము. అధికమైన సామర్థ్యంతో కూడినవాడూ, భూభారాన్ని వహించే నేర్పు కలవాడూ, తగినవాడూ, జగత్ప్రసిద్ధుడూ, శుక్రుడి మనుమడూ అయిన నీ పెద్దకొడుకు యదు వుండగా కనిష్ఠపుత్రుడు (తక్కువజాతిస్త్రీకి పుట్టినవాడు) అగు పూరుడిని రాజ్యభారం వహించేందుకు నియోగించటం తగునా?

విశేషం: జఘన్య శబ్దం విశేషణం. దానికి కనిష్ఠుడు, నీచుడు, నిందితుడు అనే అర్థాలు ఉన్నాయి. అది స్త్రీ లింగమైనప్పుడు నీచస్త్రీ, నింద్యురాలైన స్త్రీ అని అర్థం వస్తుంది. అటువంటి స్త్రీ కుమారుడు జఘన్యాత్మజుడు. శర్మిష్ఠ రాజకుమార్తె అయినా కూడా దాసి అవటంచేత ఆమెకు జఘన్యా శబ్దం వాడబడింది. కనిష్ఠకుమారు డని చెప్తే ఎట్టిబాధా వుండదు. మంత్రుల మాటలలో అర్థశక్తిమూలవస్తుకృతవస్తుధ్వని ఉన్నది. అర్థదర్శనాన్ని కలిగించే వర్ణాల, పదాల ఆరోహావరోహక్రమం రచనలో పోషించటంద్వారా 'సమాధి' అనే శబ్దగుణం రాణించింది. (సంపా.)

వ. అనిన వారల కయ్యయాతి యి ట్లనియె. 101

ప్రతిపదార్థం: అనినన్=పురజను లట్లా పలుకగా; ఆ+యయాతి; వారలకున్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: పురజనులు ఆవిధంగా పలుకగా ఆ యయాతి వారితో ఇట్లా అన్నాడు.

క. యదుఁ డగ్రతనూజుఁడు నా ।
హృదయ సముద్భవుఁడు దానయిన మద్వచనం
బిది యేటిది యని కడు దు ।
ర్మదుఁ డై చేయక కృతావ మానుం డయ్యెన్. 102

ప్రతిపదార్థం: యదుఁడు+అగ్రతనూజుఁడు= జ్యేష్ఠ కుమారుడు (పెద్ద కొడుకు); నా, హృదయ, సముద్భవుఁడు= నా ఆత్మజుడు; తాన్; అయినన్= అయినప్పటికీ; మత్, వచనంబు= నా పలుకు; ఇది; ఏటి+అది= ఇది ఎట్టిది; అని; కడు, దుర్మదుఁడు+ఐ= మిక్కిలి గర్విష్ఠుడై; చేయక= నామాట పాటించక; కృత+అవమానుండు= అవమానం చేసినవాడు; అయ్యెన్= అయినాడు.

తాత్పర్యం: యదుఁడు నాజ్యేష్ఠకుమారుడు, ఆత్మజుడు అయినాకూడా చాలా గర్వితుడై నామాటను లెక్కచేయక నన్ను అవమానించినాడు.

విశేషం: ఏటి+అది. అది, యవిశబ్దముల అత్తునకు వృత్తిని లోపం బహుళంగా ఔతుంది.

క. తనయుండు దల్లిదండ్రులు ।
పనిచినపని సేయఁడేని, పలు కెడలోఁ జే
కొనఁడేని, వాఁడు తనయుం ।
డనఁబడునే? పితృధనమున కర్హుం డగునే? 103

ప్రతిపదార్థం: తనయుండు= కొడుకు; తల్లి+తండ్రి= తల్లిదండ్రులు; పనిచిన పని= ఆజ్ఞాపించిన పని; చేయఁడు+ఏని= చేయని వాడైతే; పలుకు=

తల్లిదండ్రుల మాట; ఎడలోన్= మనస్సులో; చేకొనఁడు+ఏని= గ్రహించని వాడైతే; వాఁడు= అట్టి కొడుకు, తనయుండు= కొడుకు; అనఁబడున్+ఏ= అనబడునా; పితృధనమునకున్= తండ్రి యొక్క సొమ్ముకు; అర్హుడు+ అగున్+ఏ= తగినవా డౌనా?

తాత్పర్యం: కొడుకు తల్లిదండ్రు లాజ్ఞాపించిన పని చేయకపోతే, వారివాక్యం హృదయ పూర్వకంగా అంగీకరించకపోతే అట్టివాడు కొడుకు అనబడతాడా? తండ్రిసొమ్ముకు తగినవాడు అవుతాడా? కాడు.

క. పూరుఁడు గొండుక యయ్యును।
భూరిగుణజ్యేష్ఠుఁడును సుపుత్త్రుఁడు నవనీ
భారసహిష్ణుఁడు నాతఁడ।
కోరినకార్యంబు దీర్చి కుశలుం డగుటన్. 104

ప్రతిపదార్థం: పూరుఁడు; కోరిన కార్యంబు= తండ్రినైన నేను కోరినపని; తీర్చి= నెరవేర్చి; కుశలుండు= నేర్పరి; అగుటన్= అగుటచేత; కొండుక+అయ్యును= వయసులో చిన్నవా డైనాకూడా; భూరి, గుణజ్యేష్ఠుఁడును= అధికము లైన గుణాలలో పెద్దవాడున్నూ; సుపుత్త్రుఁడున్= యోగ్యుఁడైన కుమారుడున్నూ; అవనీభార సహిష్ణుఁడున్= భూమియొక్క బరువును వహించే ఓర్పుకలవాడున్నూ; ఆతడు+అ= అతడే. (అయ్యాడు).

తాత్పర్యం: పూరుడు తండ్రి నైన నేను కోరినపని నెరవేర్చిన నేర్పరి అవటంచేత, వయసులో చిన్నవాడైనా, అధికము లైన గుణాలచేతఅగ్రజుడూ, యోగ్యు డైన పుత్రుడూ, భూమిబరువును వహించే సహనం కలవాడూ అతడే.

వ. 'నా జరాభారంబుఁ దాల్చిన పుత్త్రుండ రాజ్యంబున కర్హుండును వంశకర్తయు నగు; శుక్రవచనంబును నిట్టిద' యని యయాతి ప్రకృతి

జనంబుల నొడంబఱిచి, పూరు నఖిల భూభారధురంధరుం జేసి, యదు ప్రభృతులఁ బ్రత్యంత భూములకు రాజులం జేసి, తాను వేదవేదాంగపారగు లయిన బ్రాహ్మణులతోడం దపోవనంబునకుం జని, యందుఁ గందమూల ఫలాశనుం డై వన్యంబులయిన ఫలంబుల హవ్యకవ్యంబుల నగ్నిభట్టారకుం బితృదేవతలం దనుపుచు, వానప్రస్థ విధానంబుఁ దప్పక శిలోంఛవృత్తి నతిథిభుక్తశేషం బుపయోగించుచు, నియతాత్ముం డై జితారిషడ్వర్గుం డును నయి సహస్ర వర్షంబులు దపంబు సలిపి సర్వసంగ విముక్తుం డై, సర్వద్వంద్వంబులును విడిచి ముప్పది యేండ్లు నిరాహారుం డయి, యొక్కయేఁడు వాయుభక్షకుం డయి, పంచాగ్నిమధ్యంబున నిల్చి, యొక్కయేఁడు నీటిలో నేకపాదంబున నిలిచి, మహాఘోరతపంబు సేసి, దివ్య విమానంబున దేవలోకంబునకుం జని, యందు దేవర్షిగణపూజితుం డై బ్రహ్మలోకంబునకుం జని, యందు బ్రహ్మర్షిగణపూజితుం డై యనేక కల్పంబు లుండి, క్రమ్మఱ నింద్రలోకంబునకు వచ్చిన నింద్రుండు వానిం బూజించి యి ట్లనియె. 105

ప్రతిపదార్థం: నాజరా, భారంబున్= నా ముదిమి బరువును; తాల్చిన= వహించిన; పుత్త్రుండు+అ= కొడుకే; రాజ్యంబునకున్= రాజ్యపరిపాలనకు; అర్హుండును= తగినవాడును; వంశకర్తయున్= వంశాన్ని కొనసాగించిన వాడును; అగున్; శుక్ర వచనంబును= శుక్రునియొక్క వాక్యం కూడ; ఇట్టి+అది+అ= ఇట్టిదే; అని; యయాతి; ప్రకృతి జనంబులన్= పురజనులను; ఒడంబఱిచి= ఒప్పించి (అంగీకరింప జేసి); పూరున్= పూరుని; అఖిల, భూ, భార, ధురంధరున్= సమస్త (సర్వ) భూభారాన్ని వహించేవాడిని; చేసి; యదుప్రభృతులన్= యదువు మొదలైన వారిని; ప్రత్యంత భూములకున్= మిక్కిలి సమీపంలో ఉన్న దేశాలకు (మ్లేచ్ఛదేశాలకు); రాజులన్+చేసి; తాను; వేద, వేదాంగ, పారగులు+అయిన= వేదాలయొక్క; శిక్షా వ్యాకరణాది వేదాంగాలయొక్క అంతం చూచిన, అంటే వేద వేదాంగాలను బాగా ఎఱిగిన;

బ్రాహ్మణులతోడన్= తపః+వనంబునకున్= తపస్సు చేసికొనేందుకు తగిన అడవికి; చని= వెళ్ళి; అందున్= ఆ వనమందు; కంద, మూల, ఫల, అశనుండు+ఐ= దుంపలు, వేర్లు, పళ్ళు ఆహారంగా కలవాడై; వన్యంబులు+ అయిన= అడవిలో పుట్టిన; ఫలంబులన్= పళ్ళతో; హవ్యకవ్యంబులన్= దేవతల కివ్వదగిన అన్నంచేతను; పితృదేవతల కివ్వదగిన అన్నంచేతను, (ఇక్కడ అన్నమంటే ఆహారం) అగ్నిభట్టారకున్= హవ్యములచే పూజ్యు డైన అగ్నిని; పితృదేవతలన్= కవ్యములచే పితృదేవతలను; తనుపుచున్= తృప్తి నొందిస్తూ; వానప్రస్థ, విధానంబున్= నాల్గు ఆశ్రమాలలో మూడవది వానప్రస్థం, వానప్రస్థు డంటే వనవాసవ్రతాన్ని అవలంబించేవాడు; అట్టివాడి నియమాన్ని; తప్పక= మానక; శిలా+ఉంఛవృత్తిన్= రాళ్ళలో రాలిన గింజలను ఏరుకుని తినట మనే జీవనోపాయంతో; అతిథిభుక్తశేషంబు= అతిథులు తినగా మిగిలిన ఆహారాన్ని; ఉపయోగించుచున్= గ్రహిస్తూ; నియత+ఆత్ముండు+అయి= నియమంతో కూడిన ఆత్మకలవాడై; జిత+ అరి+షట్+వర్గుండునున్= జయించబడిన కామక్రోధాదు లనే అంతఃశత్రు సమూహం కలవాడును; అయి; సహస్రవర్షంబులు= వేయి ఏళ్ళు; తపంబు; సలిపి= చేసి; సర్వ, సంగ, విముక్తుండు+ఐ= అన్ని ఆసక్తులచేత విడువబడిన వాడై; సర్వద్వంద్వంబులున్=శీతోష్ణ సుఖదుఃఖాది సకల ద్వంద్వాలను; విడిచి; ముప్పది యేండ్లు; నిరాహారుండు+అయి= ఆహారం లేనివా డై; ఒక్కయేఁడు; వాయుభక్షకుండు+అయి= గాలిని మాత్రం తినేవాడై; పంచ+అగ్ని మధ్యంబునన్= ఐదు అగ్నులనడుమ; నిల్చి; ఒక్క, ఏఁడు; నీటిలోన్; ఏకపాదంబునన్= ఒంటికాలితో; నిలిచి; మహత్+ఘోరతపంబు= గొప్పతీవ్ర మైన తపస్సును చేసి; దివ్య, విమానంబునన్= దేవతాసంబంధ మైన విమాన మందు; దేవ లోకంబునకున్= స్వర్గలోకానికి; చని= వెళ్ళి; అందున్= స్వర్గలోకంలో; బ్రహ్మ+ఋషి, గణ పూజితుండు+ఐ= బ్రహ్మర్షుల సముదాయంచేత పూజించబడినవా డై; అనేక, కల్పంబులు= పెక్కుయుగాలు; ఉండి; క్రమ్మఱన్= మళ్ళీ; ఇంద్రలోకంబునకున్= ఇంద్రుడి లోకానికి;

(అనగా స్వర్గలోకానికి); వచ్చినన్= రాగా; ఇంద్రుండు; వానిన్= యయాతిని; పూజించి; ఇట్లు; అనియెన్.

తాత్పర్యం: 'నా ముదిమిబరువు వహించిన కొడుకే రాజ్యపాలనానికి తగినవాడూ, వంశాన్ని కొనసాగించే వాడూ అవుతాడు. శుక్రుడుకూడ ఈవిధంగానే (ఇట్లాగే) చెప్పి ఉన్నాడు' అని యయాతి పురజనులను ఒప్పించి పూరుడిని సకలమహీభారాన్ని వహించే చక్రవర్తిగా చేసి, యదువు మొదలైనవారిని సన్నిహితప్రదేశాలకు రాజులుగా చేసి, తాను వేదాలను వేదాంగాలను బాగా చదివిన బ్రాహ్మణులతో తపోవనానికి వెళ్ళాడు. ఆ వనంలో అతడు దుంపలను వేర్లను పళ్ళను భుజిస్తూ అడవి పళ్ళచేతను హవ్యాలచేతను అగ్నిదేవుడిని, కవ్యాలచేత పితృదేవతలను తృప్తి పొందిస్తూ (పరుస్తూ) వానప్రస్థాశ్రమ నియమం తప్పక శిలలయందు రాలిన గింజలను ఏరుకొని తినటమే వృత్తిగా కలవాడై, అతిథులు తినగా మిగిలిన ఆహారాన్ని సేవిస్తూ, నియమంతో కూడిన ఆత్మ కలవాడూ, అరిషడ్వర్గాలను జయించిన వాడూ అయి, వెయ్యేళ్ళు, తపస్సు చేశాడు. తర్వాత సర్వ సంగాలను, శీతోష్ణసుఖ దుఃఖాది ద్వంద్వాలను విడిచి ముప్ఫైఏళ్ళు ఆహారం లేకుండా, ఒక్కఏడు వాయువునుమాత్రం భక్షిస్తూ, ఐదగ్నుల మధ్య నిలిచి (నిలబడి); ఒకఏడు నీటిలో ఒంటికాలిపై నిలబడి గొప్పతీవ్ర మైన తపస్సు చేసి దేవతావిమానంలో స్వర్గలోకానికి వెళ్ళాడు. ఆ స్వర్గలోకంలో దేవర్షుల సమూహంచేత పూజించబడి బ్రహ్మలోకానికి వెళ్ళి, అక్కడ బ్రహ్మర్షుల సమూహంచేత పూజించబడి అనేకకల్పాలుండి మళ్ళీ ఇంద్రలోకానికి రాగా, ఇంద్రుడు అతడిని పూజించి యిట్లా పలికాడు.

విశేషం: ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం - త్రేతాగ్నులు. ఇవి క్రమంగా వేదికి పూర్వ, దక్షిణ, పశ్చిమదిశలలో (దిక్కులలో) ఉంటాయి. ఈ మూడిటికి సభ్యం, అవసథ్యం అనే రెండు కలిస్తే పంచాగ్నులు. ఈరెండు వేదికి ఈశాన్య దిక్కులో ఉంటాయి. బ్రహ్మ+ఋషి - బ్రహ్మర్షి - గుణసంధి.

ఆ. 'కొడుకుజవ్వనంబుఁ గొని నీవు నిజరాజ్య।
భూరిభరము వానిఁ బూన్చునప్పు
డతని కెద్ది గఱపి' తని యడిగిన హరి।
కయ్యయాతి యిట్టు లనుచుఁ బలికె. 106

ప్రతిపదార్థం: కొడుకు జవ్వనంబున్= కొడు కైన పూరుడి యౌవనం; కొని= గ్రహించి; వానిన్= ఆ పూరుని; నీవు; నిజ, రాజ్యభూరి భరమున్= నీ రాజ్యంయొక్క అధికమైన భారాన్ని; పూన్చు+అప్పుడు= వహింపచేసే టప్పుడు; అతనికిన్= ఆ పూరునికి; ఎద్ది, కఱపితి(వి) అని= ఏది బోధించితివి అని; అడిగినన్; హరికిన్= ఇంద్రుడికి; ఆ+ యయాతి; ఇట్టులు; అనుచున్; పలికెన్.

తాత్పర్యం: 'కొడుకైన పూరుడి యౌవనాన్ని నీవు గ్రహించి, అతడిని విస్తృతమైన నీ రాజ్యభారాన్ని భరింప చేసేటప్పుడు అతని కేమి బోధించావు?' అని ఇంద్రుడు అడుగగా యయాతి ఇంద్రుడితో ఇట్లా పలికాడు.

యయాతి పూరునకు బోధించిన నీతులు (సం.1-82-6)

క. ఎఱుక గలవారి చరితలు।
గఱచుచు, సజ్జనుల గోష్ఠిఁ గదలక ధర్మం
బెఱుఁగుచు, నెఱిఁగిన దానిని।
మఱవ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్. 107

ప్రతిపదార్థం: ఎఱుక, కలవారి చరితలు= జ్ఞానం కలవారి చరిత్రలు; కఱచుచున్=అభ్యసిస్తూ; సజ్జనుల, గోష్ఠిన్= మంచివారి సల్లాపమందు; (సభయందు); కదలక; ధర్మంబు; ఎఱుఁగుచున్= తెలిసికొంటూ; ఎఱిఁగిన దానిని= తెలిసికొన్న దానిని; మఱవక= మఱచిపోక; సమంజస బుద్ధిన్= న్యాయంతో కూడినబుద్ధితో; అనుష్ఠించునది= చేయవలెను.

తాత్పర్యం: జ్ఞానం కలవారి చరిత్రలు అభ్యసిస్తూ, సజ్జనులసల్లాపమందు కదలకుండా ధర్మం తెలిసికొంటూ, తెలిసికొన్నదానిని మరిచిపోకుండా న్యాయంతో కూడిన బుద్ధితో చేయాలి. (ఆచరించాలి).

విశేషం: మఱవక+అనుష్ఠించునది= అత్వసంధి.

క. ఇచ్చునది పాత్రునకు ధన।
మచ్చుగ; నొరు వేఁడకుండునది; యభిముఖు లై
వచ్చిన యాశార్థుల వృథ।
పుచ్చక చేయునది సర్వభూతప్రీతిన్. 108

ప్రతిపదార్థం: పాత్రునకున్= అర్హుడికి; అచ్చుగన్= తగినట్లుగా; ధనము; ఇచ్చునది= ఈయవలయును (ఇవ్వవలసింది); ఒరున్= ఇతరుని; వేఁడక+ఉండునది= ప్రార్థించ కుండా ఉండాలి; అభిముఖులు+ఐ= ఎదురుముఖం కలవారై; వచ్చిన, ఆశా+అర్థులన్= కోరికలను అడిగేవారికి, (ఆశతో కూడిన యాజకులను); వృథపుచ్చక= వ్యర్థం చేయక; సర్వభూత ప్రీతిన్= ఎల్ల జీవులకును సంతృప్తిని, చేయునది= చేయవలెను (చేయాలి).

తాత్పర్యం: అర్హుడికి తగినట్లుగా ధన మివ్వాలి. ఇంకొకరిని అడగకుండా. ఎదురుగా వచ్చిన యాచకులను వ్యర్థం చేయక (నిరాశపుచ్చక) సకలజీవులకూ సంతృప్తి చేయాలి. (తృప్తిని కలిగించాలి).

విశేషం: ఉండు+అది= 'విధియందు అది యను తచ్ఛబ్దంబును ముందు నుగాగమంబు నగును' ఉండునది.

క. మనమునకుఁ బ్రియంబును హిత।
మును బథ్యముఁ దథ్యమును నమోఘము మధురం
బును బరిమితమును నగు పలు।
కొనరఁగఁ బలుకునది ధర్మయుతముగ సభలన్. 109

ప్రతిపదార్థం: మనమునకున్= మనస్సుకు; ప్రియంబున్= ప్రీతికలిగించేదీ; హితమును= మేలు కలిగించేదీ; పథ్యమున్= తగినదియున్నూ; తథ్యమును= సత్యమైనదీ; అమోఘమున్= వ్యర్థం కానిదీ మధురంబును= తీయనిదీ; పరిమితమును= సంక్షిప్త మైనదీ; అగు పలుకు= అయిన మాట; ఒనరఁగన్= ఒప్పేటట్లుగా; సభలన్= సభలలో; ధర్మయుతముగన్= ధర్మంతో కూడి ఉండేటట్లుగా; పలుకునది= పలకాలి.

తాత్పర్యం: సభలలో మనసుకు ప్రీతి కలిగించేదీ, మేలైనదీ, ఉచితమైనదీ, సత్యమైనదీ, తీయనిదీ, విస్తృతం కానిదీ, అయినమాట ధర్మంతో కూడుకొని ఉండేటట్లుగా పలకాలి.

విశేషం: సభలలో మానవు డేవిధంగా మాటాడాలో నన్నయ ఈపద్యంలో సూచిస్తున్నాడు. పలికే పలుకు మితమైనది, హితమైనది, సత్యమైనది అయి ఉండాలి అని అతని అభిప్రాయం. 'మిత హిత సత్యవాక్య జనమేజయ' అని అతడు జనమేజయుడిని సంబోధించాడు. కావ్యంలోకూడ నన్నయవాక్యాలు అట్లాగే ఉంటాయి.

సీ. వదన బాణాసన వ్యక్తముక్తము లైన ।
పలుకు ల న్కడువాఁడి బాణతతులఁ
బరమర్మలక్ష్యముల్ పాయక భేదించు ।
చుండెడి దుర్జనయోధవరుల
కడనుండ కున్నది; కరుణ యార్జవమక్ష ।
జయము సత్యంబును శమముశౌచ
మను నివి యెద నిల్పునది; శత్రుషడ్వర్గ ।
జయమందునది శుద్ధశాంతబుద్ధి;

తే. మదముఁ గామముఁ గ్రోధంబు మత్సరంబు ।
లోభమును మోహమును నను లోని సహజ

వైరివర్గంబు నొడిచినవాఁడ యొడుచు ।
నశ్రమంబున వెలుపలి యహితతతుల. 110

ప్రతిపదార్థం: వదన, బాణాసన, వ్యక్తముక్తములు+ఐన= ముఖ మనే ధనుస్సునుండి వెలువడినవై విడవబడిన; పలుకులు+అన్, కడు వాఁడి బాణతతులన్= పలుకు లనే మిక్కిలివాడి యైన బాణాలసమూహంచేత; పర, మర్మ లక్ష్యముల్= ఇతరులయొక్క జీవస్థానాలనే గురులను; పాయక= విడువక; భేదించుచున్+ఉండెడి= చీలుస్తుండెడి; దుర్జన యోధవరులకడన్= దుష్టులైన జను లనబడే యోధశ్రేష్ఠులచెంత; ఉండక+ఉన్నది= ఉండకుండ వలెను; కరుణ= దయ; ఆర్జవము= ఋజుత్వం; అక్షజయము= ఇంద్రియ జయం; సత్యంబును; శమము= అంతరింద్రియనిగ్రహం; శౌచము= శుచిత్వం; అను+ఇవి= అనువీటిని; ఎదన్= హృదయమందు; నిల్పునది= స్థిరంగా ఉండేటట్లు చేయాలి; శత్రు; షట్ వర్గ జయము= కామాదులైన ఆర్గురుశత్రువుల సముదాయాల జయము; శుద్ధశాంతబుద్ధిన్= నిర్మలం, శాంతం ఐనదైన బుద్ధితో; అందునది= పొందవలయును; మదమున్= గర్వాన్ని; కామమున్; క్రోధంబున్= కోపము; మత్సరంబున్= మాత్సర్యం; లోభమును= పిసినారితనాన్ని; మోహమునున్= అజ్ఞానాన్ని; అను; లోనిసహజవైరి వర్గంబున్= సహజమైన అంత శ్శత్రు సముదాయాన్ని (సహజం అంటే స్వభావసిద్ధమైనది); ఒడిచిన, వాడు+అ= ఓడించినవాడే; వెలుపలి, అహిత, తతులన్= బయట నున్న శత్రువుల సముదాయాన్ని; అశ్రమంబునన్= శ్రమలేకుండ, ఒడుచున్= ఓడిస్తాడు.(ఓడించగలడు).

తాత్పర్యం: ముఖమనే వింటియందు వ్యక్తములై విడువబడిన మాట లనే వాడియైన బాణాల సమూహంతో, ఇతరుల మర్మాలనే గుఱులను, విడవక చీలుస్తుండే దుష్టు లైన యోధశ్రేష్ఠుల చెంత నివసించకూడదు. దయ, ఋజుత్వం, ఇంద్రియజయం, సత్యం, బహిరింద్రియనిగ్రహం, శుచిత్వం అనే వాటిని హృదయంలో నిలపాలి. నిర్మల మైన శాంతబుద్ధితో కామాది వైరులను ఆరుగురిని జయించాలి. గర్వం, కామం, కోపం, మత్సరం,

పిసినారితనం, అజ్ఞానం అనే సహజమైన అంతశ్శత్రువుల సముదాయాన్ని ఓడించినవాడే బహిశ్శత్రువుల సముదాయాన్ని శ్రమలేకుండా ఓడిస్తాడు.

విశేషం: అలం: రూపకాలంకారం. ఉండు+అది= ఉండునది కావాలి. కాని నన్నయ దానికి బదులు ఉన్నది అని వాడాడు. కామక్రోధలోభమోహమద మాత్సర్యాలు సహజములైన అంతశ్శత్రువులు. వెలుపలి శత్రువులు రాజులు, మానవులు మొదలైనవారు.

వ. 'అని పూరుం గఱపితి; నమ్మహాపురుషుం దొరులకుఁ గఱపునట్టి సర్వగుణసంపన్నుం' డనిన విని యింద్రుండు వెండియు నయ్యయాతి కి ట్లనియె. 111

ప్రతిపదార్థం: అని; పూరున్= పూరుని; కఱపితిన్= బోధించాను; ఆ, మహత్, పురుషుండు= ఆ మహానుభావుడు; ఒరులకున్= ఇతరులకు; కఱపు+అట్టి= బోధించేటి; సర్వగుణ సంపన్నుండు= సకల సద్గుణాలతో కూడినవాడు; అనినన్= అని యయాతి పలుకగా; విని; ఇంద్రుండు; వెండియున్= మరల; ఆ+యయాతికిన్; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: 'అని నా కొడు కైన పూరుడికి బోధించాను. ఆ మహాత్ముడు ఇతరులకు బోధించగల సర్వగుణాలతో కూడినవాడు' (అతడికి ఇతరులు బోధించవలసిన అవసరం లేదని భావం), అని యయాతి పలుకగా విని ఇంద్రుడు మరల ఆ యయాతితో ఇట్లా పలికాడు.

విశేషం: యయాతి తనకొడు కైన పూరుడిని మహాపురుషుడు అనటానికి కారణం అతడి సద్గుణసంపదలే.

క. ఏమి తపం బొనరించితి ।
భూమీశ్వర! పుణ్యలోక భోగంబులఁ దే
జోమహిమ ననుభవించితి ।
సామాన్యమె శతసహస్రసంవత్సరముల్. 112

ప్రతిపదార్థం: భూమి+ఈశ్వర= ఓరాజా! యయాతీ! ఏమితపంబు= ఏతపస్సు; ఒనరించితి(వి)= చేశావు; శతసహస్ర సంవత్సరముల్= వందల వేల యేళ్ళు; పుణ్యలోక, భోగంబులన్= స్వర్గాది పుణ్యలోకాలలోని సౌఖ్యాలను; తేజస్+మహిమన్= కాంతియొక్క మహత్త్వంచేత; అనుభవించితి(వి)= పొందావు; సామాన్యము+ఎ= సాధారణమా?.

తాత్పర్యం: ఓమహారాజా! నీవు ఏ (మి) తపస్సు చేశావు? వందవేలయేళ్ళు తేజస్సుయొక్క మహత్త్వంచేత, స్వర్గలోక పుణ్యంచేత స్వర్గాదిలోకాలలోని సౌఖ్యాల ననుభవించావు. ఇది అసాధారణం.

వ. అనిన నయ్యింద్రున కయ్యయాతి యి ట్లనియె. 113

తాత్పర్యం: అని ఇంద్రుడు పలుకగా ఆ యయాతి ఇట్లా అన్నాడు.

క. సురదైత్య యక్షరాక్షస ।
నరఖేచర సిద్ధమునిగణ ప్రవరుల భా
సురతపములు నాదగు దు ।
ష్కరఘోరతపంబు సరియుఁ గా వమరేంద్రా!. 114

ప్రతిపదార్థం: అమర+ఇంద్రా= దేవతలకు రాజైన ఓయింద్రుడా! సురదైత్య యక్షరాక్షస నరఖేచర సిద్ధముని గణప్రవరులు= దేవతల, దితికుమారులైన దైత్యుల, యక్షుల, రాక్షసుల, మానవుల, ఖేచరుల (ఆకాశంలో సంచరించేవారు) సిద్ధుల, మునుల సముదాయంలో శ్రేష్ఠులైన వారియొక్క; భాసుర తపములు= ప్రకాశించే తపస్సులు; నా+అది+అగు= నాదగు; దుష్కర, ఘోరతపంబు= చేయశక్యం కాని తీవ్రమైన తపస్సుకు; సరియున్, కావు= సమానం కావు.

తాత్పర్యం: దేవతలకు రాజువైన ఓ ఇంద్రుడా! దేవతల, దైత్యుల, యక్షుల, రాక్షసుల, మానవుల, ఆకాశ సంచారుల, సిద్ధుల, మునుల, సముదాయాలలో శ్రేష్ఠు లైనవారి ప్రకాశించే తపస్సులు, చేయశక్యం కాని తీవ్రమైన నాతపస్సుకు సమానం కావు.

విశేషం: ఇక్కడ యయాతి తన తపస్సు సుర దైత్యాదుల తపస్సుకంటె మించినదనీ, అసమానమైన దనీ గర్వంతో పలికాడు. ఈ గర్వమే అతని పతనానికి కారణ మయింది.

ఇంద్రుఁడు యయాతిని స్వర్గలోకభ్రష్టునిఁ జేయుట (సం.1-83-3)

వ. **అని తపోభిమానంబున మహర్షులతపంబు లవమానించి పలికిన నయ్యయాతిగర్వంబునకు సహింపక యింద్రుం డలిగి 'నీకు దేవలోక సుఖానుభవంబులందుఁ బుణ్యసమాప్తియయ్యెఁ; నీగర్వంబు నిన్నింత సేసెఁ; నింక నధోలోకంబున కరుగు' మనిన వాఁడును 'మనుష్య లోకంబునకుం బోవనోప; నంతరిక్షంబున సద్భువనంబున సత్సంగతి నుండు నట్లుగా నాకుఁ బ్రసాదింపు' మని యింద్రుననుమతంబు వడసి.** **115**

ప్రతిపదార్థం: అని; తపస్+అభిమానంబునన్= తన తపస్సునందలి అభిమానంచేత; మహర్షుల, తపంబులు= గొప్ప మునులయొక్క తపస్సులు; అవమానించి= తక్కువపరచి; పల్కినన్= పలుకగా; ఆ+యయాతి గర్వంబునకున్= ఆ యయాతియొక్క గర్వానికి; సహింపక= ఓర్వక, ఇంద్రుండు; అలిగి= కోపించి; నీకున్; దేవలోక సుఖ+అనుభవంబులందున్= స్వర్గలోకంలోని సుఖాలను అనుభవించటంలో; పుణ్యసమాప్తి, అయ్యెన్= నీవు చేసిన పుణ్యం పూర్తి అయింది; నీగర్వంబు; నిన్నున్, ఇంత చేసెన్= నీ కింత చెడ్డ చేసింది; ఇంకన్= ఇకముందు; అధస్+లోకంబునకున్= కిందిలోకానికి; అరుగుము; అనినన్= వెళ్ళుమని పలుకగా; వాఁడును= యయాతియు; మనుష్య, లోకంబునకున్= మానవలోకానికి; పోవన్, ఓపన్= వెళ్ళలేను; అంతరిక్షంబునన్= ఆకాశమందు; సత్, భువనంబునన్= నక్షత్రలోకాన; సత్, సంగతిన్= నక్షత్రాల స్నేహంతో; ఉండు, అట్లుగాన్= ఉండేవిధాన; నాకున్; ప్రసాదింపుము= అనుగ్రహించుము; అని; ఇంద్రు+అనుమతంబు= ఇంద్రునియొక్క సమ్మతి; పడసి= పొంది.

తాత్పర్యం: అని తపస్సునందు గర్వంచేత మహామునుల తపస్సులను తక్కువచేసి పలుకగా, ఆ యయాతి గర్వానికి సహించక ఇంద్రుడు కోపించి 'నీకు స్వర్గలోకసుఖాల ననుభవించటంలోని పుణ్యం క్షీణించింది. నీ గర్వం నీకు ఇంతహాని చేసింది. ఇక ముందు అధోలోకాలకు వెళ్ళు' మని పలుకగా, యయాతి 'నేను మానవలోకానికి వెళ్ళలేను; ఆకాశంలో నక్షత్రలోకమందు నక్షత్రాల స్నేహంతో ఉండేటట్లుగా న న్ననుగ్రహించు' మని ఇంద్రుడి సమ్మతి పొంది.

విశేషం: కామ్యకర్మలను చేసేవారు ఆ పుణ్యం కారణంగా స్వర్గానికి పోతారు. అక్కడ వారు భోగాలను అనుభవిస్తే వారి పుణ్యం క్షీణిస్తుంది. అపుడు వారు మళ్ళీ మనుష్యలోకాన జన్మిస్తారు. ఈ విషయమే 'క్షీణే పుణ్యే మర్త్యలోకం విశన్తి' అని భగవద్గీతలో చెప్పబడింది.

తే. **అంతరిక్షంబువలన దిగంతరములు।**
వెలుఁగఁ జనుదెంచు నాతని విమలదీప్తి
సూచి సద్గణములు గడుఁ జోద్య మంది।
రురుతరద్యుతి యిది యేమి యొక్కొయనుచు. **116**

ప్రతిపదార్థం: అంతరిక్షంబు వలనన్= ఆకాశందెస; దిక్+అంతరములు= దిక్కుల యొక్క మధ్యభాగాలు; వెలుఁగన్= ప్రకాశించగా; చనుదెంచు, ఆతని= వచ్చు యయాతియొక్క; విమలదీప్తి= నిర్మలమైన కాంతి; చూచి; సత్+గణములు= నక్షత్ర గణాలు; ఉరుతరద్యుతి, ఇది= మిక్కిలి అధికమైన యీ కాంతి; ఏమి; ఒక్కొ= ఏమోకదా; అనుచున్; కడున్= మిక్కిలి; చోద్యము+అందిరి= ఆశ్చర్యం పొందారు.

తాత్పర్యం: ఆకాశందెస దిక్కులమధ్యభాగాలు ప్రకాశింపగా వచ్చే యయాతియొక్క నిర్మల మైన కాంతి చూచి అధిక మైన ఈకాంతి ఏమో కదా! అంటూ నక్షత్రగణాలు ఎక్కువ ఆశ్చర్యాన్ని పొందాయి.

వ. అంతనయ్యయాతి దౌహిత్రు లయిన యష్టకుండును బ్రతర్దనుం డును వసుమంతుండును నౌశీనరుం డయిన శిబియు ననువారలు సద్భువన నివాసులు దమ యొద్దకుం జనుదెంచిన యయాతి నధిక తేజోమయు ననంత పుణ్యమూర్తిం గని నిసర్గస్నేహంబున నభ్యాగత పూజల సంతుష్టుం జేసి 'నీవెవ్వండ?వెం దుండి యేమికారణం బున నిందులకు వచ్చి?' తని యడిగిన వారలకు నయ్యయాతి యి ట్లనియె. 117

ప్రతిపదార్థం: అంతన్= పిమ్మట; ఆ+యయాతి ఆ యయాతియొక్క; దౌహిత్రులు+ అయిన= కూతురి కొడుకు లైన అష్టకుడు, ప్రతర్దనుడు, వసుమంతుడు; ఔశీనరుండు+ ఐన= ఉశీనర దేశానికి రాజైన; శిబియున్; అనువారలు+అనే పేర్లు కలవారు సత్+భువన నివాసులు= నక్షత్ర లోకాన నివసించేవారు; తమ యొద్దకున్= తమ వద్దకు; చనుదెంచిన= వచ్చిన; యయాతిన్; అధిక, తేజోమయున్= గొప్ప తేజస్సుతో కూడిన వాడిని; అనంత పుణ్య మూర్తిన్= అంతం లేని పుణ్యం రూపు ధరించినవాడిని; కని= చూచి; నిసర్గ స్నేహంబునన్= సహజమైన ప్రేమతో; అభ్యాగత పూజలన్= అతిథులకు చేయవలసిన పూజలచేత; (భోజన సమయంలో వచ్చిన అతిథి - అభ్యా గతుడు); సంతుష్టున్ చేసి= సంతోషించిన వాడినిగా చేసి; నీవు; ఎవ్వండవు; ఎందున్+ఉండి= ఎక్కడినుండి; ఏమి కారణంబునన్= ఏ కారణం చేత; ఇందులకున్= ఇచ్చటికి; వచ్చితి(వి); అని; అడిగినన్; వారలకున్= ఆ అష్టకాదులకు; ఆ+యయాతి; ఇట్లు+అనియెన్.

తాత్పర్యం: అటు తరువాత ఆ యయాతి కూతురి కొడుకులైన అష్టకుడు, ప్రతర్దనుడు, వసుమంతుడు, ఉశీనరదేశానికి సంబంధించిన శిబి అనబడేనక్షత్ర లోకనివాసులైన వారు తమవద్దకు వచ్చిన గొప్పతేజస్సుతో కూడిన అధికమైనపుణ్యం రూపుధరించిన యయాతిని చూచి, సహజమైనప్రేమతో అభ్యాగతులకు చేయవలసిన పూజలతో సంతోషపెట్టి 'నీ వెవరివి? ఎక్కడినుండి ఏ కారణాన ఇక్కడకు వచ్చావు' అని అడుగగా వారికి ఆ యయాతి ఇట్లా పలికాడు.

క. అనవద్యధర్మచరితం।
బున నున్నతుఁ డైన నహుషపుత్త్రుఁడఁ, బూరుం
డను మధ్యమలోకేశ్వరు।
జనకుండ, యయాతి యనఁగఁ జనియెడువాఁడన్. 118

ప్రతిపదార్థం: అనవద్య, ధర్మ, చరితంబునన్= నింద్యంకాని ధర్మంతో కూడిన ప్రవర్తనమందు; ఉన్నతుఁడు+ఐన= అధికు డయిన; నహుష, పుత్త్రుఁడన్= నహుషుడి కుమారుడను; పూరుండు+అను= పూరు డనే పేరు కల; మధ్యమ+లోక+ఈశ్వరు= మర్త్యలోక ప్రభువుయొక్క, జనకుండన్= తండ్రిని; యయాతి, అనఁగన్= యయాతి అనే పేరుతో; చనియెడు; వాఁడన్=ఒప్పేవాడిని.

తాత్పర్యం: అనింద్యం, ధర్మయుక్తం అయిన చరిత్రచేత అధికుడైన నహుషుడి కుమారుడిని; పూరుడనే పేరు కల మధ్యమలోకాన్ని పరిపాలించే రాజుయొక్క తండ్రిని; యయాతి అనే పేరుతో ఒప్పువాడిని.

విశేషం: యయాతి తండ్రి యైన నహుషుడు ఇంద్రపదవి నధిష్ఠించి అగస్త్యుడి శాపంచేత అజగర మై పడి ధర్మజుడి సమాగమం చేత శాపవిముక్తు డైనవాడు.

క. అమిత తపోవిభవంబునఁ।
గమలజులోకంబు మొదలుగాఁ గల సురలో
కములందుఁ బుణ్యఫలములఁ।
గ్రమమున భోగించి యింద్రుకడ కేఁజనినన్. 119

ప్రతిపదార్థం: అమిత, తపః, విభవంబునన్= అధికమైన తపస్సుయొక్క వైభవంచేత; కమలజులోకంబు, మొదలుగాన్, కల= బ్రహ్మలోకం మొదలయిన; సురలోకములందున్= దేవలోకాలందు; పుణ్యఫలములన్= పుణ్యంయొక్క ఫలాలను; క్రమమునన్= వరుసగా; భోగించి= అనుభవించి; ఇంద్రుకడకున్= ఇంద్రునిచెంతకు; ఏన్= నేను; చనినన్=వెళ్ళగా.

తాత్పర్యం: అధిక మైన తపస్సుయొక్క వైభవంచేత బ్రహ్మలోకం మొదలైన దేవ లోకాలలో వరుసగా పుణ్యఫలాలను అనుభవించి ఇంద్రుడిచెంతకు నేను వెళ్ళగా. (తరువాతి పద్యంతో అన్వయం.)

క. సురపతి నా తపమున క ।
చ్చెరువడి నీ తపము పేర్మిఁ జెప్పుమ యనినన్
సురసిద్ధమునీంద్ర తప ।
శ్చరణలు నాతపముతోడ సరిగా వంటిన్. 120

ప్రతిపదార్థం: సురపతి= దేవతలకు రాజైన ఇంద్రుడు; నాతపమునకున్= నేను చేసిన తపస్సుకు; అచ్చెరువడి= ఆశ్చర్యపడి; నీతపము పేర్మిన్= నీవు చేసిన తపస్సుయొక్క పెంపును; చెప్పుము+అ= చెప్పుమా; అనినన్= అని అడుగగా; సురసిద్ధ, ముని+ఇంద్ర తపః చరణలు= దేవతలయొక్కయు, సిద్ధులయొక్కయు, మునిశ్రేష్ఠులయొక్కయు తపము చేయుటలు; నా తపముతోడన్= నేను చేసిన తపస్సుతో; సరి కావు= సమానం కావు; అంటిన్= అని పలికితిని.

తాత్పర్యం: దేవతలకు రాజైన ఇంద్రుడు నేను చేసిన తపస్సున కాశ్చర్యపడి 'నీ తపస్సుయొక్క మహత్త్వం చెప్పు' మని అడుగగా 'దేవతల, సిద్ధుల, మునిశ్రేష్ఠుల తపఃకార్యాలు నా తపంతో సమానం కా' వని పలికాను.

విశేషం: 'అను' ధాతువుయొక్క భూతకాలమందలి ఉత్తమపురుషైకవచనం 'అనితిని', ను స్థానంబున బిందువు - అంతిని; బిందువు మీది తకారానికి టకారం అంటిని; అంటిన్.

చ. అమరవిభుండు దాని విని యల్గి 'మదంబున నుత్తమావమా
నము దగునయ్య చేయ' నని నన్ను నధోభువనప్రపాతసం
భ్రమవివశాత్ముఁ జేసె; నది పాడియ; యెందును నల్ప మయ్యు ద
ర్పము బహుకాలసంచిత తపఃఫలహాని యొనర్పకుండునే. 121

ప్రతిపదార్థం: అమర, విభుండు= దేవతలకు రాజైన ఇంద్రుడు; దానిన్= నే నన్న మాటల తీరును; విని; అల్గి= కోపించి; మదంబునన్= గర్వంతో;

ఉత్తమ+అవమానము= పూజ్యుల (శ్రేష్ఠులైన వారి) పరాభవము; చేయన్= చేయటం; తగున్+అయ్య= ఉచితమౌనా! అని; నన్నున్, అధస్+భువన, ప్రపాత, సంభ్రమ, వివశ+ఆత్మున్= క్రిందిలోకాలకు పడటంలోని వేగిరపాటు చేత వశం తప్పిన ఆత్మకలవాడిని; చేసెన్; అది= అట్లా చేయటం; పాడి+అ= న్యాయమే; ఎందును= ఎక్కడైనా; అల్పము+అయ్యున్= స్వల్పమైనా కూడా; దర్పము= గర్వము; బహుకాలసంచితతపస్+ఫలహాని= ఎంతోకాలంగా సంపాదించబడిన తపస్సుయొక్క ఫలంయొక్క కీడును (నాశాన్ని); ఒనర్పక+ ఉండున్+ఏ= చేయకుండునా! తప్పక చేస్తుం దని భావం.

తాత్పర్యం: దేవేంద్రుడు నామాట విని కోపించి 'గర్వంతో శ్రేష్ఠులైనవారిని అవమానించటం తగునా?' అని నన్ను క్రిందిలోకాలకు పడటంలోని వేగిరపాటుచేత వశం తప్పిన ఆత్మకలవాడినిగా చేశాడు. అది న్యాయమే. ఎక్కడైనా స్వల్పమైన దైనా గర్వం పెద్దకాలం చేసిన తపస్సుయొక్కఫలాన్ని నాశనం చేయకుండా ఎట్లాఉంటుంది?.

విశేషం: యయాతి తనతప్పు తాను అంగీకరించాడు. ఇంద్రుడు శపించటంలో అన్యాయం లేదని అతడే చెప్పుకోవటం అతని ఔదార్యాన్ని సూచిస్తుంది. అలం: అర్థాంతరన్యాసం.

వ. 'ఇట్లు కుపిత శతమఖ వచన ప్రపీడితుండ నయి తదాదేశంబున సద్భువనంబునకు వచ్చితి' ననిన నాతండు దమకు మాతామహుం డగుటయు నతని మహత్త్వంబును సార్వలౌకికత్వంబును సర్వజ్ఞాన సంపత్తియు నెఱింగి, యష్టకాదులు సకల ధర్మాధర్మంబులు, సుగతి, దుర్గతి స్వరూపంబులు, జీవుల గర్భోత్పత్తిప్రకారంబులువర్ణాశ్రమధర్మంబులు నడిగిన వారల కయ్యయాతి యి ట్లనియె. 122

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; కుపిత, శతమఖ, వచన, ప్రపీడితుండన్+ అయి= కోపించిన యింద్రుడియొక్క శాపవాక్యం చేత, మిక్కిలి బాధించబడిన వాడ నై; తద్+ఆదేశంబునన్= అతని యొక్క ఆజ్ఞచేత; సత్+ భువనంబునకున్= నక్షత్రలోకానికి; వచ్చితిన్, అనినన్= అని యయాతి పలుకగా; ఆతండు= యయాతి; తమకున్= అష్టకాదులకు; మాతామహుండు; అగుటయున్= తల్లి(కి) దండ్రి కావటమూ; అతని, మహత్త్వంబును= అతని గొప్పతనమును; సార్వలౌకికత్వంబును= విశ్వజనీనత్వమును (సర్వలోకాల వారికి తెలిసియుండుటయు); సర్వజ్ఞాన సంపత్తియున్= సమస్తమైన జ్ఞానంయొక్క సంపదయున్నూ; ఎఱింగి= తెలిసికొని; అష్టక+ఆదులు= అష్టకులు మొదలైన వారు; సకల, ధర్మ+అధర్మంబులు= అన్నిధర్మాలు, అధర్మాలు: సుగతి, దుర్గతి స్వరూపంబులు= మంచిగతియొక్క (మోక్షం), చెడ్డ గతియొక్క (నరకాదుల); స్వరూపంబులు= స్వభావాలు; జీవుల, గర్భ+ఉత్పత్తి ప్రకారంబులు= జీవులు పిండరూపాన పుట్టే విధము; వర్ణ, ఆశ్రమ ధర్మంబులును= బ్రాహ్మణ క్షత్రియాది వర్ణాలయొక్క బ్రహ్మచర్యాశ్రమాలయొక్క, స్వభావాలు; అడిగినన్= అడుగగా; వారలకున్= అష్టకాదులకు; ఆ+యయాతి; ఇట్లు= ఈవిధంగా; అనియెన్= పల్కినాడు.

తాత్పర్యం: 'ఈ విధంగా కోపించిన ఇంద్రుడియొక్క వాక్కుచేత పీడించబడినవాడినై, అతడి ఆజ్ఞచేత నక్షత్ర లోకానికి వచ్చాను' అని యయాతి పలుకగా ఆయయాతి తమ మాతామహుడు కావటంచేతను, అతని గొప్పతనం సమస్త లోకాలలో ప్రసిద్ధి చెందటం చేతను, అన్ని విషయాలగురించిన జ్ఞానసంపదను తెలిసికొని అష్టకుడు మొదలైన వారు అన్ని ధర్మాలను, అధర్మాలను, మంచి చెడ్డగతుల స్వభావాలను, జీవుల పిండోత్పత్తి విధానాన్ని, వర్ణాశ్రమ ఆచారాలను అడుగగా ఆ అష్టకాదులకు యయాతి ఇట్లా చెప్పాడు.

యయాతి యష్టకాదు లడిగిన ప్రశ్నలకు సంక్షేపరూపంబున సమాధానంబు లొసఁగుట (సం.1-84-3)

ఆ. సర్వభూతదయకు సత్యవాక్యమునకు।
నుత్తమంబు ధర్మ్మ మొం డెఱుంగ;
నొరుల నొప్పి కోడ కుపతాప మొనరించు।
నదియ కడు నధర్మ మనిరి బుధులు. 123

ప్రతిపదార్థం: సర్వభూతదయకున్= ఎల్ల జీవులయందలి దయకును; సత్య వాక్యమునకున్= సత్యంతో కూడిన వాక్యానికి; (వానికంటె) ఉత్తమంబు= శ్రేష్ఠమైన; ధర్మ్మవు= ధర్మము; ఒండు= ఇతరము; ఎఱుంగన్; ఒరుల నొప్పికిన్= ఇతరులయొక్క బాధకు; (ఇతరులను బాధ పెట్టటానికి); ఓడక= భయపడక, జంకక; ఉపతాపము= సంతాపము; ఒనరించు+అది+అ= కలిగించుటయే; బుధులు= పండితులు; కడున్= మిక్కిలి; అధర్మము+అనిరి.

తాత్పర్యం: ఎల్లజీవులయందు దయ కలిగి ఉండటంకంటెను, నిజమైనవాక్యం పల్కటంకంటెను, శ్రేష్ఠ మైన ధర్మ మింకొకటి నాకు తెలియదు. ఇతరులను బాధించటానికి జంకక, సంతాపం కలుగ జేయటం మిక్కిలి అధర్మమని పండితులు చెప్పారు.

ఆ. వేదవిహితవిధుల నాదరించుట యూర్ధ్వ।
గతికిఁ దెరువు; విధులఁ గడచి యెందు
నాఁగఁబడినవాని లోఁగక చేయుట।
యధమగతికి మార్గ మనిరి మునులు. 124

ప్రతిపదార్థం: వేదవిహిత, విధులన్= వేదమందు విధించబడిన కార్యాలను; ఆదరించుట= ప్రీతితో చేయటం; ఊర్ధ్వగతికిన్= ఉన్నతమైన గతికి; తెరువు= మార్గం; విధులన్= వేదాలలో విధించబడిన కార్యాలను; కడచి= దాటి; ఎందున్= ఎక్కడైనా; ఆఁగఁబడినవానిన్= నిషేధించబడిన వాటిని; లోఁగక=

వెనుదీయక; చేయుట; అధమగతికిన్= నీచమైన గతికి; మార్గము; అని; మునులు; అనిరి= చెప్పారు.

తాత్పర్యం: వేదమందు విధించబడిన కార్యాలను పాటించటం ఉన్నతమైన గతికి మార్గం. వేదమందు విధించబడిన కార్యాన్ని అతిక్రమించి, ఎల్లయెడల నిషేధించబడినవాటిని వెనుదీయక (వెనుకాడక) చేయటం నీచమైన గతికి మార్గం అని మునులు చెప్పారు.

వ. మఱియు గర్భయోనియందు ఋతుపుష్ప రససంయుక్తం బగుచు రేతంబు గాడ్పుచేతం బ్రేరితం బయి కలసిన, నందుఁ బంచతన్మాత్రలు పొడ వయి క్రమంబున నవయవంబు లేర్పడి లబ్ధజీవు లయి యుద్భవిల్లి, శ్రోత్రంబుల శబ్దంబును నేత్రంబుల రూపంబును ఘ్రాణంబున గంధంబును జిహ్వను రసంబును ద్వక్కున స్పర్శంబును మనంబున సర్వంబును నెఱుంగుచుఁ, బూర్వకర్మనియోగంబున దుష్కృతంబును సుకృతంబును జేయుచు, దుష్కృత బాహుళ్యంబునఁ బుణ్యంబు గీడ్పఱిచి బుద్ధి విరహితులై తిర్యగ్యోనులందుఁ బుట్టుదురు; సుకృత బాహుళ్యంబునఁ బాపంబు గీడ్పఱిచి బుద్ధియుక్తులై మనుష్యయోనులందుఁ బుట్టి, యుక్తాచారులును దత్త్వ విదులును నయి, దేవత్వంబునం బొంది, విశుద్ధజ్ఞాను లయి ముక్తు లగుదురు; మఱి యుక్తాచారు లెవ్వరనిన గురు శుశ్రూష సేయుచు నిత్యాధ్యయనాగ్ని కార్యంబులయం దప్రమత్తు లయి శమదమ శౌచంబులు దాల్చి యవిప్లుత బ్రహ్మచర్యులయిన బ్రహ్మచారులును, బాపంబునకుఁ బరోపతాపంబునకు వెఱచి ధర్మ్యంబైన విత్తంబున నతిథులం బూజించుచు యజ్ఞంబులు సేయుచుఁ బరుల యీనిధనంబులు పరిగ్రహింపక నిత్యాను ష్ఠానపరు లయిన గృహస్థులును, నియతాహారు లై సర్వసంగంబులు విడిచి జితేంద్రియు లైన వానప్రస్థులును, వనంబులనుండి గ్రామ్యవస్తువుల నుప యోగింపక గ్రామంబులనుండి శరీర ధారణార్థంబు నియతస్వల్పభోజను లయి నగర ప్రవేశంబు పరిహరించి కామక్రోధాదులం బొరయక

శౌచాచారక్రియారతు లయి సర్వద్వంద్వంబులు నోడిచిసర్వసంగవివర్జితు లయి యేకచరు లయి యనేకనికేతను లయిన యతులును నను వీరలు దమతమ పుణ్యాచారం బులం జేసి క్రిందం బదితరంబులవారిని మీఁదం బదితరంబుల వారిని దమ్మును నుద్ధరింతురు. 125

ప్రతిపదార్థం: మఱియున్= అదికాక; గర్భయోనియందున్= పిండముండు స్త్రీ అవయవమందు; ఋతుపుష్ప రస సంయుక్తంబు= ఋతుకాలానికి సంబంధించిన రజస్సుతో కూడినది; అగుచున్; రేతంబు= పురుషుడి వీర్యం; గాడ్పుచేతన్= గాలిచేత; ప్రేరితంబు+అయి= ప్రేరేపించబడినదై; కలసినన్= కలయగా; అందున్= ఆ రేతస్సునందు (గర్భయోనియందు) పంచతన్మాత్రలు= ఐదయిన శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు; పొడవు+అయి= రూపొంది; క్రమంబునన్= కాలక్రమాన; అవయవంబులు= అంగాలు; ఏర్పడి= రూపొంది; లబ్ధజీవులు+అయి= పొందబడిన జీవం కలవారై; ఉద్భవిల్లి= పుట్టి; శ్రోత్రంబులన్= చెవులచేత; శబ్దంబును= ధ్వనిని; నేత్రంబులన్= కన్నులచేత; రూపంబును; ఘ్రాణంబునన్= ముక్కుచేత; గంధంబును= వాసనను; జిహ్వను= నాలుకచేత; రసంబునున్= రుచిని; త్వక్కునన్= చర్మంచేత; స్పర్శంబును= స్పర్శను (తాకుడును); మనంబునన్= మనస్సుచేత; సర్వంబునున్= సమస్తమును; ఎఱుంగుచున్; పూర్వకర్మ నియోగంబునన్= పూర్వజన్మ మందలి కర్మల పనుపుచేత; దుష్కృతంబును= చెడ్డపనిని; సుకృతంబును= మంచిపనిని; చేయుచున్; దుష్కృత, బాహుళ్యంబునన్= చెడ్డపనుల ఆధిక్యత చేత; పుణ్యంబు= పుణ్యమును; కీడ్పఱచి= తక్కువచేసి; బుద్ధి విరహితులు+ఐ= బుద్ధిలేని వారై; తిర్యక్+ యోనులందున్= పశుపక్ష్యాదుల గర్భమందు; పుట్టుదురు; సుకృత బాహుళ్యంబునన్= పుణ్యంయొక్క ఆధిక్యంచేత; పాపంబున్= పాపమును; కీడ్పఱిచి= తక్కువ పఱిచి; బుద్ధియుక్తులు+ఐ= బుద్ధితో కూడినవారై; మనుష్య యోనులందున్= మానవ గర్భమందు; పుట్టి; యుక్త+ఆచారులు= తగిన ఆచారం కలవారును; తత్వవిదులునున్= తత్త్వం తెలిసిన వారును; అయి; దేవత్వంబునన్=

దేవత్వాన్ని; పొంది; విశుద్ధ జ్ఞానులు+అయి= నిర్మలమైన జ్ఞానం కలవారై; ముక్తులు= మోక్షం పొందినవారు; అగుదురు; మఱి=ఇంక; యుక్త+ఆచారులు= తగిన ఆచారం కలవారు; ఎవ్వరు+ అనినన్= ఎవ్వరనగా; గురు, శుశ్రూష= గురువులసేవ, చేయుచున్; నిత్య+అధ్యయన+ అగ్ని కార్యంబులయందున్= నిత్యం చేయదగిన వేదాధ్యయన, అగ్ని ఉపాసన మొదలైన పనులలో; అప్రమత్తులు= ప్రమాదం లేనివారు; శమ దమశౌచంబులు= బహిరింద్రియ అంతరింద్రియ నిగ్రహాన్ని; శుచిత్వాన్ని; తాల్చి= పొంది; అవిప్లుత బ్రహ్మచర్యులు+అయిన= చెడని బ్రహ్మచర్య వ్రతం కలవారైన బ్రహ్మచారులును; పాపంబునకున్; పర+ఉపతాపంబునకున్= ఇతరులకు సంతాపాన్ని కలిగించటానికి; వెఱచి= భయపడి; ధర్మ్యంబు అయిన= ధర్మంతో కూడిన, ధర్మమార్గాన సంపాదించబడిన; విత్తంబునన్= ధనంతో; అతిథులన్; పూజించుచున్; యజ్ఞంబులు చేయుచున్; పరుల ఈని ధనంబులు= ఇతరులు ఇవ్వని ధనాలు (పరుల ధనంబులు, పరధనంబులు అని పాఠాంతరం. ఇవే యుక్తమైనవి); పరిగ్రహింపక= చేకొనక; నిత్య+అనుష్ఠాన పరులు= సంతతం చేయదగిన సంధ్యావందనాది కార్యాలయందు ఆసక్తి కలవారైన; గృహస్థులును; నియత+ఆహారులు+ఐ= నియమంతో కూడిన ఆహారం కలవారై; సర్వసంగంబులు= అన్ని ఆసక్తులు; విడిచి; జిత+ఇంద్రియులు+ఐన= జయించబడిన ఇంద్రియాలు కలవారైన; వానప్రస్థులును= వానప్రస్థాశ్రమం కలవారును; వనంబులన్+ ఉండి= అడవులందు నివసించి; గ్రామ్య వస్తువులను= గ్రామాలందలి వస్తువులను; ఉపయోగింపక; గ్రామంబులన్+ ఉండి= గ్రామాలందు నివసించి; శరీర, ధారణ+ అర్థంబు= శరీరం నిలిచే నిమిత్తం; నియత, స్వల్ప భోజనులు అయి= నియమంతో కూడిన స్వల్పమైన ఆహారం కలవారై; నగర ప్రవేశంబు= పట్టణాలందు ప్రవేశించటం; పరిహరించి= విడిచి; కామ+క్రోధ+ఆదులన్= కామం, క్రోధం మొదలైన వాటిని; పొరయక= పొందక; శౌచ+ఆచార క్రియారతులు+ అయి= శుచిత్వంతో కూడిన ఆచారమందును (ఆచారంలోను పనులలోను ఆసక్తికలవారై);

సర్వద్వంద్వంబులున్= శీతోష్ణసుఖదుఃఖాద్యద్వంద్వాలన్నింటినీ; ఒడిచి= ఓడించి (జయించి); సర్వసంగ, వివర్జితులు+అయి= అన్ని సంగాలచేత విడువబడినవారై; ఏక, చరులు+అయి= ఒంటరిగా సంచరించువారై; అనేక నికేతనులు+అయిన= పెక్కు గృహాలు కలవారైన (ఒకేయింట్లో ఉండకుండా పెక్కుగృహాలకు భిక్షాటనార్థం వెళ్ళేవారైన) యతులును= సన్న్యాసులును; (వీరు యుక్తాచారులు); అను వీరలు= అనే వీరు; తమ, తమ,పుణ్య+ ఆచారంబులన్ చేసి= వారి వారి పుణ్యంతో కూడిన ఆచారాలచేత; క్రిందన్= జరిగిన కాలమందలి (కడచిపోయిన కాలంలోని); పదితరంబులవారిని; మీఁదన్= ముందువచ్చు; పదితరంబుల వారిని; తమ్మును; ఉద్ధరింతురు= మీది కెత్తుదురు, ఉద్ధరిస్తారు.

తాత్పర్యం: అదిగాక గర్భయోనియందు ఋతుకాలమందలి స్త్రీ రజస్సుతో కూడినదై పురుషుడిరేతస్సు గాలిచేత ప్రేరేపించబడి కలయగా, ఆ గర్భయోనియందు శబ్దస్పర్శాదులైన ఐదు తన్మాత్రలు రూపొంది క్రమంగా అవయవాలేర్పడి జీవం పొంది జన్మిస్తారు. తరువాత చెవులచేత శబ్దాన్ని, నేత్రాలచేత రూపాన్ని, ముక్కుచేత వాసనను, నాలుకచేత రుచిని, చర్మంచేత స్పర్శగుణాన్ని, మనస్సుచేత సమస్తాన్నీ ఎరుగుదురు (తెలిసికొంటారు). పిమ్మట పూర్వజన్మలోని కర్మలఏర్పాటుచేత మంచిపనిని, చెడ్డపనిని చేస్తూ చెడ్డపనుల ఆధిక్యంచేత పుణ్యాన్ని తక్కువ పరచి (చేసి) బుద్ధిలేనివారై పశుపక్ష్యాదుల గర్భాలందు జన్మిస్తారు. పుణ్యంయొక్క ఆధిక్యంచేత పాపాన్ని తక్కువ కావించి బుద్ధితో కూడినవారై మానవగర్భాలందు పుట్టి తగిన ఆచారాలు కలవారున్నూ, తత్త్వజ్ఞానం కలవారున్నూ అయి దేవత్వాన్ని పొంది నిర్మలమైన జ్ఞానంతో కూడి మోక్షాన్ని పొందుతారు. మఱి యుక్తాచారులు ఎవరంటే గురువుల సేవచేస్తూ నిత్యం వేదాధ్యయనాన్ని, అగ్నికార్యాన్ని పొరపాటు లేకుండా చేస్తూ అంతర్బహిరింద్రియ నిగ్రహాన్ని, శుచిత్వాన్ని ధరించి భ్రష్టం కాని బ్రహ్మచర్యవ్రతం కలవారైన బ్రహ్మచారులునూ, పాపానికీ, పరులను పీడించటానికీ భయపడి ధర్మమార్గాన సంపాదించబడిన ధనంతో అతిథులను

పూజిస్తూ యజ్ఞాలు చేస్తూ ఇతరులు ఈయని ధనాలను గ్రహించక నిత్యకర్మానుష్ఠానంలో ఆసక్తులై ఉండే గృహస్థులును, నియమంతో కూడిన ఆహారం కలవారై సర్వాసక్తులు విడిచి ఇంద్రియాలను జయించి ఒప్పారు వానప్రస్థులును, అడవియం దుండి గ్రామమందు పుట్టిన వస్తువులను వాడక గ్రామాలందు నివసించి దేహపోషణకై స్వల్పమైన (కొద్దిగా) ఆహారం స్వీకరిస్తూ (గ్రహిస్తూ) పట్టణాలలో ప్రవేశించక కామక్రోధాదులను పొందక శుచిత్వంతో కూడిన ఆచారాలందు, కర్మలందు ఆసక్తి కలవారై శీతోష్ణ సుఖ దుఃఖాదులను, సర్వ ద్వంద్వాలను జయించి సర్వాసక్తులను విడిచి ఒంటరిగా సంచరిస్తూ ఒకే గృహం లేనివారై యుండు సన్న్యాసులును-వీరు యుక్తాచారులు. వీరు తమ తమ పుణ్యాలయిన ఆచారాల చేత పదితరాల పూర్వులను, పదితరాల ముందువారిని మరియు, తమ వెనుక నున్న వారిని కూడ ఉద్ధరిస్తారు.

క. మానాగ్నిహోత్రమును మఱి।
మానాధ్యయనమును మానమౌనంబు నవి
జ్ఞానమున మానయజ్ఞము।
నా నయథార్థంబు లివియు నాలుగు నుర్విన్. 126

ప్రతిపదార్థం: మాన+అగ్నిహోత్రమును= గర్వంతో కూడిన అగ్ని ఉపాసనను; మఱి, మాన+అధ్యయనమును= ఆడంబరంతో కూడిన వేదాధ్యయనాన్ని; మానమౌనంబునన్= గర్వంతో కూడిన మౌనమును (మౌనాన్ని తాల్చుటయు); అవిజ్ఞానమునన్= జ్ఞానంలేకుండ (లేకపోవటంచేత); మానయజ్ఞమును= గర్వంతో కూడిన యజ్ఞమును; నాన్= అనగా; ఇవియున్ నాలుగున్= మానంతో కూడిన అగ్నిహోత్ర. అధ్యయన, మౌన, యజ్ఞములు నాలుగూ; ఉర్విన్= భూమియందు; అయథార్థంబులు= నిజాలు కావు.

తాత్పర్యం: గర్వంతో కూడిన అగ్నిహోత్రం, ఆడంబరానికై చేసే వేదాధ్యయనం, గర్వంతో కూడుకొన్న మౌనం, జ్ఞానం లేకుండా ఆడంబరంతో చేసే యజ్ఞం అనే నాలుగూ భూమియందు అసత్యా లైనవి (అయోగ్యా లైనవి).

వ. అని యయాతి యష్టకాదు లడిగినవాని నెల్ల సంక్షేపరూపంబునం జెప్పటయు వార లి ట్లనిరి. 127

ప్రతిపదార్థం: అని, యయాతి; అష్టక+ఆదులు= తన దౌహిత్రు లైన, అష్టకుడు మొదలైన వారు; అడిగిన వానిన్, ఎల్లన్= అడిగిన ప్రశ్నలు అన్నింటిని; సంక్షేప రూపంబునన్= విస్తరంగా కాక, సంక్షేప రూపాన; చెప్పుటయున్= చెప్పగా; వారలు= అష్టకాదులు; ఇట్లు+అనిరి.

తాత్పర్యం: అని యయాతి తనదౌహిత్రు లయిన అష్టకాదులు అడిగిన ప్రశ్నల కన్నిటికీ సంక్షేపంగా సమాధానా లీయగా, అష్టకాదు లతనితో ఇట్లా అన్నారు.

విశేషం: ఇక్కడ మూలంలో అష్టకాదు లడిగిన ప్రశ్నలూ యయాతి ఇచ్చిన సమాధానాలూ విస్తృతంగా ఉన్నాయి. ఇది ఆధ్యాత్మిక విషయం కావటంచేత నన్నయ వాటిని సంగ్రహించాడు. సంగ్రహించినట్లు అతడే 'సంక్షేపరూపంబున' అని సూచించాడు. శాస్త్రేతిహాసమైన వ్యాసభారతాన్ని తెలుగులో కావ్యేతిహాసంగా నిర్మించే విధానంలో ముఖ్యమైన లక్షణం శాస్త్రాంశసంగ్రహీకరణం.

తే. 'సకల ధర్మవిదుండవు, సర్వలోక।
వర్తనము లెఱింగిన పుణ్యకర్త, వీవు
నెయ్య మొనరంగ నెఱిఁగింపుమయ్య మాకు।
వెలయఁ బుణ్యలోకంబులు గలవె' యనిన. 128

ప్రతిపదార్థం: సకల, ధర్మ, విదుండవు= అన్ని ధర్మాలను ఎఱింగిన వాడివి; సర్వలోక వర్తనములు= అన్ని లోకాల ప్రవర్తనలు; ఎఱింగిన= తెలిసిన; పుణ్యకర్తవు= పుణ్యం చేసినవాడివి; ఈవు= నీవు; నెయ్యము; ఒనరంగన్= స్నేహ మొప్పునట్లుగా; మాకున్; వెలయన్= ప్రసిద్ధంగా; పుణ్యలోకంబులు= పవిత్ర మైన లోకాలు; కలవు+ఎ= కలవా?; ఎఱింగింపుమయ్య= తెలుపవయ్య; అనినన్= అని అష్టకాదు లడుగగా.

తాత్పర్యం: 'నీవు సర్వధర్మాలను ఎరిగినవాడివి, సర్వలోకప్రవర్తనలు తెలిసిన పుణ్యమూర్తివి, స్నేహ మొప్పగా మాకు పుణ్యలోకాలు కలవా?' అని అష్టకాదులు అడుగగా. (తరువాతి వచనంతో అన్వయం.)

వ. 'మీకుంబుణ్యలోకంబులుగల' వని యయాతి సెప్పిన విని యన్నలువురు సంతోషించి 'యేము నీ దౌహిత్రులము సు' మ్మని త మ్మెఱింగించి వానికిఁ బుణ్యలోకంబు లిచ్చిన న ట్లయ్యయాతి సత్సంగతిం జేసి తానును దౌహిత్రులు నూర్ధ్వలోకంబునకుం జనియె నని. 129

ప్రతిపదార్థం: మీకున్; పుణ్యలోకంబులు= పుణ్యం చేసేవారు పోవు లోకాలు; కలవు= ఉన్నవి; అని; యయాతి; చెప్పినన్= చెప్పగా; విని; ఆనలువురున్= అష్టకుడు, ప్రతర్దనుడు వసుమంతుడు, శిబి అనే నలువురును; సంతోషించి; ఏము= మేము; నీదౌహిత్రులము; సుమ్ము= నీకూతురి కుమారులము సుమా!; అని; తమ్మున్, ఎఱింగించి= తమను తెలిపికొని; వానికిన్= ఆ యయాతికి; పుణ్యలోకంబులు; ఇచ్చినన్= ఇయ్యగా; అట్లు; ఆ+యయాతి; సత్సంగతిన్, చేసి= సత్పురుషుల సాంగత్యంచేత; తానును, దౌహిత్రులున్= కూతురి కుమారులును (మనుమలును); ఊర్ధ్వలోకంబునకున్= పైస్వర్గలోకానికి; చనియెన్= వెళ్ళెను; అని.

తాత్పర్యం: 'మీకు పుణ్యలోకా లున్నవి' అని యయాతి చెప్పగా విన్న ఆ నలుగురు మనుమలూ సంతోషించి 'మేము నీకూతురికుమారులం సుమా!' అని తమను తాము తెలుపుకొని ఆ యయాతికి పుణ్యలోకాలు ఇచ్చారు. ఆ విధంగా ఆ యయాతి ఉత్తములసంసర్గంచేత తాను మనుమలతో పైలోకానికి వెళ్ళాడు అని.

విశేషం: తానున్ దౌహిత్రులున్ చనియె - ఆత్మార్థం బభిహితం కావటంచేత ఇచ్చట క్రియకు ఏకవచనం కలిగింది.

* * *